13-05Pg1exHMNWJQERS.qxd:13-05Pg1exHMNWJQERS.qxd 01/01/01 9:56 AM Page 1





ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-5-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 101 పేజీలు: 12 వెల: 6.50




టెస్టులకు విరాట్ కోహ్లి గుడ్‌బై

ఆటలో

# ఉగ్రవాదుల్ని ఊడ్చేశాం

## వారు కలలో కూడా ఊహించని దెబ్బకొట్టాం

మన త్రివిధ దళాలు ఎప్పుడూ సర్వసన్నద్ధం

మహిళల సిందూర రక్షణకే 'ఆపరేషన్ సిందూర్'

పాక్ క్షిపణులు భారత్‌లోకి రాలేకపోయాయి

భారత్ సైన్యానికి, శాస్త్రవేత్తలకు నా సెల్యూట్

### జాతినుద్దేశించిన ప్రసంగంలో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, మే 12:** ఉగ్రవాదులు కలలో కూడా ఊహించనివిధంగా భారత సైన్యం దెబ్బతీసిందని, భారత మహిళల నుదుట సింధూరాన్ని దూరంచేస్తే మూల్యం ఎలా ఉంటుందో కూడా వారికి తెలిసొచ్చేలా చేసామని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. భారత్ పాక్‌లమధ్య కాల్పుల విరమణ అనంతరం సోమవారం ఉదయం నుంచి విస్తృత స్థాయిలోరక్షణరంగ సమీక్షలు నిర్వహించిన ప్రధాని మోడీ రాత్రి జాతినుద్దేశించి ప్రసంగించారు. ఆపరేషన్ సింధూర్ అనేది ఒక ఆపరేషన్ కంటే మన భారత మహిళల ఆవేదన అని ఆయన అన్నారు. ఉగ్రవాదాన్ని వీడకపోతే పాకిస్తాన్‌కు మనుగడ అనేదే ఉండదని, ఉగ్రవాదులు భవిష్యత్తులో దాడిచేస్తే ఆపరేషన్ సింధూర్‌కు రెట్టింపుస్థాయిలో జవాబిస్తామని హెచ్చ రించారు. ఉగ్ర వాదం ఏరూపంలో ఉన్నా తుదముట్టిస్తామన్నారు. అణ్వా యుధాలను బూచిగా చూపించి ఉగ్రకార్యకలాపాలకు పాల్పడ తామంటే సహించేదిలేదని, సమూలంగా పెకలించివేస్తా మన్నారు. భారత్ నిర్ణయాలకు అనుగుణంగానే పాకిస్థాన్‌తో చర్చలుంటాయని ఆయన స్పష్టంచేసారు. పాకిస్థాన్‌తో చర్చలు అంటూ జరిగితే కేవలం ఉగ్రవాదంపైనే ఉంటాయని ప్రధానిమోడీ స్పష్టంచేసారు. గడచిన నాలుగురోజులుగా మన సైన్యం సామర్థ్యాన్ని మనంచూసామని, నిఘా వర్గాల సామర్థ్యం, శాస్త్ర సాంకేతిక సామర్థ్యాన్ని దేశం చూసిందని మనదేశ అసమాన వీరత్వం ప్రదర్శించిందని మోడీ ఈసందర్భంగా వారికి శెల్యూట్‌చేసారు. పహల్గాంలో ఉగ్రవాదులు మతం పేరు అడిగి మరీ కుటుంబ సభ్యులముందే, భర్తలను దారుణంగా కాల్చిచంపారని, వ్యక్తిగతంగా ఇది తనకెంతో బాధాకరం అనిపించిందని అన్నారు. చనిపోయిన ఉగ్రవాదులనుచూసి పాకిస్థాన్ అధికారులు కన్నీళ్లుపెట్టుకోవడం మనం చూసామని, దీన్నిబట్టిచూస్తే పాకిస్థాన్‌లో ఉగ్రస్థావరాలు, ఉగ్రవాదులకు పాకిస్తాన్ అధికారుల ప్రోత్సాహం, మద్దతు ఉందని అన్నారు. పాకిస్థాన్‌లోని బహావల్‌పూర్, మురిద్కే వంటి స్థావరాలు ఉగ్రవాద యూనివర్సిటీలుగా ఉన్నాయని, అమాయక యువతను ప్రలోభపెట్టి వారిని లొంగదీసుకుని ఈ కేంద్రాల్లోనే శిక్షణ ఇచ్చి వారిని భారత్‌పైకి ఉసిగొలుపుతున్నారని, అందుకే ఉగ్రవాద మూలాలను ధ్వంసం చేసామని ప్రధాని మోడీ అన్నారు. కేవలం ఉగ్రవాదంపైనే అనుకుంటే పొరుగుదేశం మన స్కూళ్లు, మందిరాలు, మసీదులు, గురుద్వారాలు, సామాన్యుల ఇళ్లపైనా దాడులు చేసిందని, ఇక సహించలేకనే మన శక్తిసామర్థ్యాలను చూపించామన్నారు. >>2



## మళ్లీ ఉల్లంఘన

### జమ్ము సరిహద్దుల్లో రాత్రి కాల్పులు జరిపిన పాక్

### డ్రోన్లను కూల్చివేసిన భద్రతా దళాలు

### జలంధర్, ఫిరోజ్‌పూర్‌లో బ్లాకౌట్

**న్యూఢిల్లీ, మే 12:** కాల్పుల విరమణ ఉల్లంఘనను పాకిస్థాన్ నిస్సిగ్గుగా ఉల్లంఘించింది. రెండుదేశాల డిజిఎంఒల చర్చల అనంతరం కూడా పాకిస్తాన్ ఈ నిర్వాకానికి పాల్పడింది. రెండురోజులపాటు తీవ్రస్థాయి దాడులు చవిచూసిన తర్వాతకూడా పాక్ తన వక్రబుద్ధిని మార్చుకోలేదు. జమ్ముకాశ్మీర్‌లోని వాస్తవాధీన రేఖవెంబడిసాంబ, కతువా జిల్లాల్లో డ్రోన్లను ప్రయోగించి దాడులకు పాల్పడిందని సైనిక వర్గాలు ధృవీకరించాయి. దీనితో సరిహద్దు రాష్ట్రాలను కేంద్రం అప్రమత్తంచేసింది .పంజాబ్, రాజస్థాన్, జమ్ము, గుజరాత్ రాష్ట్రాల్లోని కీలక స్థావరాలున్న ప్రాంతాలను బ్లాకౌట్‌ప్రకటించింది. పంజాబ్‌లోని జలం ధర్, ఫిరోజ్‌పూర్లలో కూడా బ్లాకౌట్ అమలు చేసారు. మరోపక్క వాస్తవాధీనరేఖ వెంబడి పాక్ సైన్యం జరుపుతున్న దాడులను భారత్‌రక్షణ వ్యవస్థ తిప్పికొట్టింది. డ్రోన్లను కూల్చివేసినట్లు ప్రకటించింది. ఇదిలా ఉండగా ప్రధాని మోడీ ప్రసంగం తర్వాతనే పాకిస్థాన్ రెచ్చిపోయింది. డ్రోన్లను >>2



## భారత్, పాక్ అణుయుద్ధాన్ని నేనే ఆపా: ట్రంప్

2లో

## ఏజెన్సీలో ఉద్యోగాలు


# పూర్తిగా గిరిజనులకే

### జీవో నం-3 పునరుద్ధరణకు చర్యలు

### సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటిస్తాం

### ప్రత్యేక పథకాలు కూడా అమలు చేస్తాం

### గిరిజన సంక్షేమశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు



**విజయవాడ, మే 12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో నూరు శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానిక గిరిజనులకు 100 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉమ్మడి రాష్ట్రంలో 2000 ఏడాదిలో జీ.వో నెంబర్ 3 తెచ్చామని సిఎం చంద్రబాబు గుర్తు చేశారు. న్యాయ సమీక్షలో రద్దయిన జీవో నెంబర్ 3 పునరుద్దరణకు తీసుకావల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, మార్గదర్శకాలు పాటిస్తూనే... 2020 లో రద్దయిన జీ.వో నెంబర్ 3 పునరుద్దరణకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. సోమవారం సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష చేశారు. ఈ రివ్యూలో గిరిజన సంక్షేమ శాఖ, న్యాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 1986లో వచ్చిన జీవో ప్రకారం ఏజెన్సీలో స్థానిక గిరిజనులకు టీచర్ పోస్టుల్లో 100 శాతం రిజర్వేషన్లు తెచ్చాం. దీనిపై న్యాయపరమైన చిక్కులు రావడంతో మళ్లీ పెరిగిన మహిళ రిజర్వేషన్ల శాతాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని 2000 సంవత్సరంలో జీవో ఎంఎస్ నంబర్ 3తెచ్చాం. దీన్ని అమలు చేయడం ద్వారా సుమారు 4,626 టీచర్ ఉద్యోగాలు ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు దక్కాయి. అయితే జీవో నెంబర్ 3 పై 2002లో కొందరు కోర్టును ఆశ్రయించగా వివిధ స్థాయిల్లో విచారణ అనంతరం 2020లో ఈ ఉత్తర్వులను సుప్రీం కోర్టు రద్దుచేసింది. అయితే గత ప్రభుత్వం దీనిపై రివ్యూ పిటిషన్ వేయడంలో తీవ్ర అలసత్వం పాటించింది. దీంతో రివ్యూ పిటిషన్ ను కూడా సుప్రీం కోర్టు కొట్టేసింది. ఈ కారణంగా గిరిజనులు జీవో నెంబర్ 3 ద్వారా లభించే లబ్దిని కోల్పోయార్తు అని సిఎం అన్నారు.

**చట్టపరమైన అడ్డంకులపై అధ్యయనం**

జీవో నెంబర్ 3 పునరుద్దణ లేదా అదే తరహా న్యాయం చేసేందుకు గిరిజనులకు ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు జీ.వో నెంబర్ 3 రద్దు అనంతర పరిణామాలపై అధికారులతో సీఎం చర్చించారు. గిరిజన ప్రాంతాల్లో జీవో 3 ద్వారా నాడు గిరిజనులకు కలిగిన లబ్దిని పునరుద్దరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఏజెన్సీలో ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానిక గిరిజనులకు నూరు శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉన్న అవకాశాల గురించి, చట్టపరంగా ఉన్న వివిధ అనుకూలతలు, అడ్డంకుల గురించి చర్చించారు. జీ.వో నెంబర్ 3పునరుద్దరిచేందుకు తీసుకో వాల్సి న చర్యలపై గిరిజనుల, గిరిజన సంఘాల నుంచి అభిప్రాయాలు తీసుకోవాలని సిఎం అధికారులకు >>2

## ఎపి భవన్‌కు చేరిన 400 మంది విద్యార్థులు

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** భారత సరిహద్దులో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఢిల్లీ లోని ఏపీ భవన్‌కు చేరుకున్న విద్యార్థుల సుమారు సంఖ్య 400కి చేరింది. జమ్మూకాశ్మీర్,పంజాబ్‌ల్లోని పలు విద్యాసంస్థల్లో చదువుకుంటున్న వీరంతా ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో స్వస్థలాలకు తిరుగుపయనమయ్యారు. ఢిల్లీ చేరుకున్న వీరికి ఏపీ భవన్ అధికారులు తాత్కాలిక వసతి,భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి 91 మంది విద్యార్థులు ఉండగా,ఆదివారం నాటికి ఆ సంఖ్య 350కి చేరింది. ఇక్కడి సిబ్బంది వారికి రైలు టికెట్ కన్ఫర్మేషన్ చేయించడంతో పాటు, ఎయిర్‌పోర్టు,రైల్వే స్టేషన్లకు వెళ్ళటానికి రవాణా సౌకర్యం కల్పిస్తున్నారు. ఈ సమయంలో దేశ >>2

## సైనికులతో సమానంగా నర్సులు సేవలందించాలి

### రాష్ట్ర వైద్య,ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్



**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** నర్సింగ్ వృత్తి చాలా పవిత్రమైంది, గౌరవనీయమైందని,ఎంతో చిత్తశుద్ధితో నిర్వహించాలని ఏపీ వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.రోగులకు చిరునవ్వుతో సేవలందించాలన్నారు.వారిని అదే చిరునవ్వుతో ఆస్పత్రి నుంచి పంపించేలా మాట్లాడుతూ మొదటిసారిగా ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డుల ప్రదానం చేపట్టామన్నారు..ఆంధ్రప్రదేశ్ నర్సెస్, మిడ్‌వైవ్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం. విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ నర్సుల సేవలు అనితర సాధ్యమైనవని, నర్సులు సంపదను సృష్టిస్తారని దానికి కారణం మనిషి ఆరోగ్యాన్ని సంరక్షించి వారి జీవిత కాలం పెరగ డట మేనన్నారు. సమస్యల పట్ల ఉదాసీనంగా ఉంటే ఫిర్యాదులు వస్తాయన్నారు. ప్రజలకు పటిష్టమైన వైద్యం అందించాల్సిన బాధ్యత మంత్రిగా నాపైన, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పైన ఉందన్నారు. అందుకోసమే బడ్జెట్ లో వైద్య రంగానికి రూ.20 వేల కోట్లు కేటాయించారన్నారు. హక్కుల గురించి మాట్లాడుతున్నపుడు బాధ్యతలను కూడా మర్చిపోకూడదన్నారు. ప్రజలకు మేం జవాబుదారీ కాబట్టి బాధ్యతల నిర్వహణపై ప్రతి ఒక్కరినీ ప్రశ్నిస్తామని, మానవతా దృక్పథంతో కూడా ఆలోచిస్తామన్నారు. నేను బాధ్యతల గురించి మాట్లాడితే నన్నే ప్రశ్నిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం మానవతా దృక్పథంతో పనిచేస్తుందన్నారు. మా స్థాయిలో మేము సమస్యలు పట్ల సానుకూలంగా ఉంటూ, క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలిస్తున్నా, క్షేత్ర స్థాయికి వెళ్లటంలేదనే విమర్శలు చేస్తున్నారన్నారు. ఇవన్నీ వాస్తవాలు కాదని వారికి కూడా తెలుసునన్నారు. ఇటీవల ఒక ఉద్యోగి నన్ను బెదిరిస్తూ నాకు కామెంట్ పెట్టారని, అదే గత ప్రభుత్వం అయితే ఆయన్ను ఉద్యోగం నుంచి తొలగించేదన్నారు. నేను అలా చేయలేదని, కాని మేము అలాంటి వారికి కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. ఇటీవల అనంతపురంలో బేబీ మిస్సింగ్ లో మీడియా లో వచ్చిన వార్తలు వల్ల నర్సు మీద చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని, నిజం తెలుసుకుని తర్వాత సరిచేసామన్నారు. ఏపీ లో నర్సింగ్ కౌన్సిల్ లో రాష్ట్ర విభజన తరువాత 1,20,000 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. గత ప్రభుత్వం చెప్పిన జీరో వేకెన్సీ పాలసీలో డొల్లతన మేం బయటపెట్టామన్నారు. రాబోయే రోజుల్లో కాంట్రాక్ట్ పద్దతిలో 5,300 నర్సింగ్ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ప్రతీ సంవత్సరం 2,600 మంది ఇతర దేశాల్లో నర్సింగ్ ఉద్యోగాల కొరకు రిజిష్టర్ చేసుకుంటున్నారన్నారు. ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌తో ఎంవోయూ చేసుకుని 8 విదేశీ భాషలు వారికి నేర్పిస్తామన్నారు. దీనివల్ల మన వాళ్లు విదేశాల్లో కూడా నర్సుల ఉద్యోగాల ద్వారా సేవలు అందించే అవకాశం ఏర్పడుతుందన్నారు. సరైన అర్హత లేని నర్సులు ఎక్కడా ఉండకూడదని ఈ విధంగా వృత్తి నైపుణ్యంలో కూడా శిక్షణను అందిస్తామన్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నర్సింగ్ కాలేజీలను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

## జూన్ 13 దాకా హైకోర్టుకు సెలవులు

**విజయవాడ,మే 12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ హైకోర్టుకు ఈ రోజు సోమవారం నుంచి జూన్ 13 వరకు వేసవి సెలవులు ప్రకటించారు. తిరిగి జూన్ 16 నుంచి పూర్తిస్థాయి కోర్టు కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అత్యవసర వ్యాజ్యాల విచారణకు వెకేషన్ కోర్టులు ఏర్పాటు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. మొదటి దశ వెకేషన్ కోర్టులు ఈ నెల 15, 22, 29వ తేదీల్లో విచారణలు చేపడతాయి. ఇందులో భాగంగా మే 15, 22వ తేదీల్లో న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేష్ రెడ్డి, జస్టిస్ వై.లక్ష్మణరావు డివిజన్ బెంచ్‌గా జస్టిస్ చల్లా గుణరంజన్ సింగిల్ బెంచ్‌గా విచారణలు చేయనున్నారు. మే 29న జస్టిస్ ఎన్.హరి >>2

## తమిళ ప్రజలకు జనసేన తోడ్పాటు

### డి. సిఎం పవన్

**విజయవాడ, మే 12 ప్రభాతవార్త ప్రతినిధి:** అధికారం అంటే ప్రజాక్షేమాన్ని ఆలోచించే మార్గమని నేను నమ్ముతానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేసారు.అదే భావనతో జనసేన పార్టీని స్థాపించామన్నారు. రాజకీయం బాధ్యత దీన్ని గుర్తించామన్నారు.అందుకే ఓట్లు, సీట్ల లెక్కలు వేసుకోకుండా ప్రజలకు మేలుచేసే దారిలో ముందుకెళ్లామన్నారు. ప్రజలు దాన్ని అర్థం చేసుకుని ఆశీర్వదించారు. తమిళనాడు ప్రజలకు మేలుచేసే విషయాల్లో అవసరమైన తోడ్పాటు అందిస్తాం అని జనసేన అధ్యక్షుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాన్ పేర్కొన్నారు.మంగళగిరిలోని >>2

### హెలికాప్టర్‌పై దాడి కేసు

## మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డిని విచారణ చేసిన పోలీసులు



సోమవారం మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి

### చెన్నేకొత్తపల్లి పిఎస్‌లో సాగిన విచారణ

### నేడు రానున్న పైలట్ అనిల్ కుమార్

### లింగమయ్య హత్య కేసులో పరిటాల శ్రీరామ్‌పై కేసు ఎందుకు పెట్టలేదన్న తోపుదుర్తి

**అనంతపురం, మే 12 ప్రభాతవార్త బ్యూరో:** శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలంలో గత నెల ఎనిమిదో తేదీన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటనలో హెలికాప్టర్‌పై దాడి జరిగిన కేసులో వైసీపీ నేత, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పోలీసుల విచారణకు హాజరయ్యారు. చెన్నైకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఉదయం 3 గంటల పాటు పోలీసుల విచారణకు హాజరయ్యారు. చెన్నేకొత్తపల్లి సిఐ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీస్ విచారణ జరిగింది. వైసీపీ కార్యకర్తలు, అభిమానులు దూసుకు రావడం వల్ల వైఎస్ జగన్ ప్రయాణించిన హెలికాప్టర్ దెబ్బతిన్న విషయం హెలి కాప్టర్ దాడి కేసులో ఇప్పటికే హెలికాప్టర్‌కు సంబంధించిన సంస్థకు, పైలెట్, కో పైలెట్‌కు పోలీసులు నోటీ నోటీసులు జారీ చేయగా గతంలో హెలికాప్టర్ సంబంధించిన సంస్థ ఒక న్యాయవాది ద్వారా తన అభిప్రాయాన్ని తెలియజేసింది. ఇదే సమయంలో కో పైలట్ కూడా విచారణకు హాజరై పోలీసుల ప్రశ్నలకు సమాధానం చెప్పారు. అయితే గతంలో పోలీసు విచారణకు హెలికాప్టర్ పైలెట్ అనిల్ కుమార్ హాజరు కాలేదు. మళ్లీ రెండోసారి పైలట్ పోలీసులు నాటి నోటీసులు జారీ చేయగా మంగళవారం రోజు విచారణకు హాజరవుతున్నట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. ఈ కేసులో పైలట్ విచారణ పూర్తయితే ఈ కేసు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డిని మరోసారి అవసరం అయితే పిలుస్తామని పోలీసు అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా సోమవారం రోజు చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి విచారణకు హాజరయ్యారు. పోలీసు విచారణ పూర్తయిన తర్వాత స్టేషన్ బయట మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి మీడియాతో ఏమన్నారంటే హెలికాప్టర్ వద్ద జరిగిన సంఘటనలో నా ప్రమేయం ఏమీలేదు. నేను జనాన్ని అదుపు >>2

# వడదెబ్బకు నలుగురు మృతి

### రాష్ట్రమంతా అత్యధిక ఉష్ణోగ్రతలు

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ఎండలు దంచి కొట్టాయి. ఎన్టీఆర్,కృష్ణా,ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ప్రాథమిక సమాచారాన్ని అనుసరించి సగటు గరిష్ట ఉష్ణోగ్రతలు 43.1గా ఉన్నట్లు సమాచారం.ఎండ దెబ్బకు ఈ రోజు జనం అల్లాడారు. శీతల వాతావరణ సదుపాయాలు ఉన్న ఇండ్లలో సైతం జనం ఉండలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. మధుమేహం,రక్తపోటు వంటి అనారోగ్య కారణాలు నలుగురు వ్యక్తులు ఎండ వేడిమి తట్టుకోలేక మృత్యువాత పడ్డారు.ఎన్టీఆర్ జిల్లా నందిగామలో ఒకరు.ఏలూరు జిల్లాలో ఒకరు గుంటూరులో ఇద్దరు వడదెబ్బకు మరణించారు. 70 మండలాల్లో వడగాడ్పులు వీసినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. 29 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, మరో 41 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. తీవ్ర గాడ్పులు వీచిన మండలాల్లో శ్రీకాకుళంలో 6, విజయనగరంలో 9, పార్వతీపురం మన్యం 19, కాకినాడ 3, తూర్పుగోదావరి 1 మండలాలు ఉన్నాయి. వడగాడ్పులు వీచే మండలాల్లో శ్రీకాకుళం 7, విజయనగరం 14, పార్వతీపురం మన్యం 4, అల్లూరి సీతారామరాజు 4, అనకాపల్లి 4, కాకినాడ 4, తూర్పుగోదావరి 1, కృష్ణాలో 3 మండలాలు ఉన్నాయి.

నిన్న ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల, శ్రీకాకుళం జిల్లా జగ్గిలి బొంతులో 42.2 డిగ్రీల చొప్పున, తిరుపతి జిల్లా ఓజిలి, అల్లూరి జిల్లా ఎర్రంపేటలో 41.8 డిగ్రీల చొప్పున, ఎన్‌టిఆర్ జిల్లా పెనుగంచిప్రోలు, చిత్తూరు జిల్లా పిపల్లిలో 41.6 డిగ్రీల చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు. రాష్ట్రం మొత్తమ్మీద ఆదివారం 144 ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ పేర్కొన్నారు.భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రజలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా పలు చోట్ల రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతుంటే, మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరుగా వర్షాలు పడుతున్నాయి. ఈ క్రమంలోనే రానున్న మూడు రోజుల పాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురిస్తే, మరోవైపు వేడి గాలులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపింది.

ఐఎండీ అంచనా ప్రకారం మే 12 నుంచి 15 వరకు ఉరుములు మెరుపులతో పాటు బలమైన గాలులు వీస్తాయి. ఇవి కొన్ని ప్రాంతాల్లో ఉపశమనం కలిగించేలా ఉంటే, మరికొన్ని చోట్ల ఆందోళనకరంగా ఉంటా యని ఐఎండీ పేర్కొంది. దేశరాజధాని దిల్లీలో రానున్న ఐదు రోజుల పాటు వాతావరణం చల్లగా ఉండి తేలికపాటి వర్షాలు పడతాయని తెలిపింది.

13-5pg2exHMNWJQE.qxd:13-5pg2exHMNWJQE.qxd 01/01/01 9:52 AM Page 1





చీనాబ్ నదిపై రామ్‌బాన్‌లో నిర్మించిన బాగ్లిహార్ హైడ్రో ఎలక్ట్రిక్ విద్యుత్ కేంద్రం

# తమిళ ప్రజలకు జనసేన తోడ్పాటు

>> ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో తమిళనాడుకు చెందిన రచయిత పర్యావరణ ఉద్యమకారుడు కేఎస్ రాధాకృష్ణన్ ఆధ్వర్యంలో తమిళ రచయిత పబ్లిషర్ మరవన్‌పులవు కె.సచ్చిదానందన్, ఎంజీఆర్ మనవడు సత్యరాజేంద్రన్, పలు ప్రజాసంఘాలు నాయకులు విద్యావంతులతో కూడిన బృందం శనివారం పవన్ కల్యాణ్‌తో సమావేశమైంది. తమిళనాడులోని వర్తమాన రాజకీయ పాలనాపరమైన పరిస్థితులు ఆ రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కార మార్గాలు సంస్కృతి ధర్మపరిరక్షణ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడారు. తమిళనాడులోని సమస్యలు నా దృష్టిలో ఉన్నాయి. వాటి పరిష్కారానికి జనసేన తన వంతు తోడ్పాటు అందిస్తుంది. ప్రజలకు మేలు చేకూరాలంటే బలమైన నాయకత్వం ఉండాలి. అప్పుడే భద్రంగా ఉన్నామనే భావన ప్రజల్లో కలుగుతుంది. ఆపరేషన్ సిందూర్ ద్వారా మనం ఎంతటి శక్తిసామర్థ్యాలతో ఉన్నామో ప్రపంచం గుర్తించింది. అందుకు దేశానికి బలమైన నాయకత్వం ఉండటమే కారణం. సమాజంలో ఐక్యత ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యం అని స్పష్టం చేశారు. మాజీ సీఎంలు ఎంజీఆర్ జయలలితలు శాంతిభద్రతలతోపాటు భిన్నత్వంలో ఏకత్వం సామాజిక ఐక్యతకు ప్రాధాన్యం ఇచ్చేవారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆ స్ఫూర్తిని కొనసాగించాలి అని సూచించారు. ఎన్నో విశిష్టతల సమాహారం ద్రవిడ భూమి. ఏ రాష్ట్రంలో అయినా స్థిరమైన నాయకత్వం కావాలంటే ఎన్నికల్లో ఓట్ల చీలికను అరికట్టడం ముఖ్యం. దేశాభివృద్ధికి భవిష్యత్తు రాజకీయాల్లో బలమైన పొత్తు అవసరం ఉందని నమ్ముతా. దానివల్ల ప్రజలకు మేలు కలుగుతుంది అని వివరించారు.

# కాశ్మీర్‌లో మళ్లీ మోగనున్న బడిగంట

**న్యూఢిల్లీ, మే 12:** భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ అమలులోకి రావడం, సరిహద్దులోని పరిస్థితి సద్దుమణుగుతున్న నేపథ్యంలో కశ్మీర్‌లో మంగళవారం నుంచి మళ్లీ పాఠశాలలు తెరుచుకోనున్నాయి. సరిహద్దు జిల్లాలైన కుప్వారా, బారాముల్లా, బండిపోరలోని గురెజ్ సబ్‌డివిజన్ మినహా కశ్మీర్ అంతటా ఈ నెల 13 నుంచి స్కూళ్లు తెరుచుకుంటాయని కశ్మీర్ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రకటించారు. భారత్-పాక్ మధ్య పరస్పర కాల్పుల నేపథ్యంలో ఇంతకుముందు ఈ బడులను ముందుజాగ్రత్త చర్యగా మూసేశారు. కాగా, పంజాబ్‌లోని సంగ్రూర్ సహా ఐదు సరిహద్దు జిల్లాల్లో సోమవారం కూడా బడులు మూసే ఉంచారు. తక్కిన ప్రాంతాల్లో మాత్రం విద్యాసంస్థలు తిరిగి తెరుచుకున్నాయి. పాకిస్థాన్‌తో సరిహద్దులు పంచుకుంటున్న పఠాన్‌కోట్, అమృత్‌సర్, ఫిరోజ్‌పూర్, గురుదాస్‌పూర్, తరన్‌తరన్ జిల్లాల్లో పాఠశాలలు మూసే ఉంచారు. పాకిస్థాన్‌తో పంజాబ్‌కు 553 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో గత నెల 22న ఉగ్రవాదులు 26 మంది పర్యాటకులను అత్యంత కిరాతకంగా కాల్చిచంపడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఇందుకు ప్రతిగా 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలను భారత బలగాలు ధ్వంసం చేయడం, 100 మందికిపైగా ఉగ్రవాదులను మట్టుబెట్టడంతో యుద్ధపరిస్థితులు తలెత్తాయి. ఈ క్రమంలో ఇరుదేశాలు కాల్పుల విరమణకు ఈ నెల 10న అంగీకరించడంతో సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణుగుతున్నాయి.

# మద్యం కుంభకోణం నిందితులను కఠినంగా శిక్షించాలి: మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ మే 12 ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం కుంభకోణం ద్వారా ప్రపంచం విస్తుపోయేలా వైకాంగ్రెస్ పార్టీ నేతలు అవినీతికి పాల్పడ్డారని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరోపించారు. ముఖ్యమంత్రే స్వయంగా డిస్టిలరీలు పెట్టడం, సొంత బ్రాండ్లు తయారు చేయించడం లాంటి విడ్డూరం ప్రపంచంలో ఎక్కడా చూడలేదన్నారు. మద్యం కుంభకోణంలో రూ.వేల కోట్ల అవినీతి జరిగిందని చెప్పారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన సదస్సులో సత్యకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 2014-19 మధ్య కాలంలో 49 వేల కిడ్నీ కేసులు నమోదైతే 2019-2024 మధ్య 91 వేలకు పెరిగాయన్నారు. కాలేయ సమస్యలకు సంబందించిన కేసులు సైతం భారీగా పెరిగినట్లు సత్యకుమార్ తెలిపారు. న్యూరో సంబంధిత కేసులు 380 నుంచి 7800కి పెరిగినట్లు చెప్పారు. గత ప్రభుత్వ నేతలు నాణ్యతలేని మద్యం తయారు చేయించి లక్షల మంది ప్రాణాలతో చెలగాటమాడారని విమర్శించారు. ఇది క్షమించరాని నేరమని బాధ్యులను కఠినంగా శిక్షించాల్సిన అవసరముందన్నారు.

# సరస్వతి పుష్కరాలకు సర్వం సిద్ధం

**హైదరాబాద్,మే 12,ప్రభాతవార్త :** నదులను దేవతలుగా భావించి, పూజించే సంస్కృతి మన దేశానిది మన జీవఅవసరాలను తీర్చే నదులకు కృతజ్ఞతలు తెలుపుకొనే సాంప్రదాయాన్ని పుష్కరాల రూపంలో పూర్వీకులు నిర్దేశించారు. తదనుగుణంగా ఒక్కొక్క రాశిలో బృహస్పతి ప్రవేశించినప్పుడు.. ఒక్కొక్క నదికి పుష్కరాలు జరుగుతాయి. పన్నెండు ప్రధాన నదులకు.. పన్నెండేళ్లకు ఒక్కసారి పుష్కరాలు వస్తాయి.ఆ పుష్కర నదుల్లో సరస్వతి ఒకటి. మిగిలిన నదుల్లా కాకుండా అంతర్వాహినిగా ప్రవహించడం ఈ నది యెక్క ప్రత్యేకత, రుగ్వేదం, పురాణాల్లో సరస్వతీ నది ప్రస్తావన ప్రముఖంగా ఉంది. పవిత్రమైన సప్తనదుల్లోనూ సరస్వతికి విశిష్టస్థానం ఉంది. అందుకే, స్నానం చేసినప్పుడు... గంగే చయమునే చైవ గోదావరీ సరస్వతీ నర్మదే సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధిం కురు..... అంటూ ఈ నదులను తలచుకోవడం పుణ్యప్రదమని చెప్పారు పెద్దలు. బృహస్పతి మిధున రాశిలోకి ప్రవేశించినప్పుడు సరస్వతీ నదికి పుష్కరాలు వస్తాయి. ఈనెల 15 నుంచి 26 వరకూ పన్నెండు రోజుల పాటు సరస్వతీ నదికి పుష్కరాలు జరగబోతున్నాయి.

మానా... సరస్వతి నది జన్మస్థానం సరస్వతీ నది పుట్టిన చోటుగా పరిగణించే ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని బద్రినాథ్ సమీపంలో ఉన్న మానా గ్రామం. అక్కడ కూడా పుష్కర స్నానాల కోసం ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సరస్వతీ నది అలకనంద నదికి ఉపనది కేశవ ప్రయాగ దగ్గర అలకనందలో కలుస్తుందంటారు. అలాగే సరస్వతీ నది అంతర్వాహినిగా....ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగలో, గుజరాత్‌లోని సోమనాథలోని త్రివేణీ సంగమాల్లో, రాజస్థాన్లోని పుష్కరలో కలుస్తుందనే విశ్వాసం ఉంది. ఆ ప్రాంతాల్లో కూడా పుష్కరాలను నిర్వహిస్తున్నారు.తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం. సరస్వతీ నది పుష్కరాలకు సిద్ధమవుతోంది. గోదావరి, ప్రాణహిత నదులతో సరస్వతి కలిసే త్రివేణీ సంగమంలో పుష్కర స్నానాల కోసం ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కాళేశ్వరంలో ప్రస్తుతం ఉన్న ఘాట్‌కు ప్రస్తుతం ఉన్న ఘాట్‌ను విస్తరిస్తూ సుమారు 86 మీటర్ల వెడల్పుతో నూతన ఘాట్‌ను నిర్మించారు. నూతన ఘాటపై 16 అడుగులు ఎత్తయిన సరస్వతి అమ్మవారి రాతి విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్నారు.పుష్కరాలు జరిగే 12 రోజులు నది హారతి నిర్వహిం చేందుకు హారతి ప్లాట్ ఫాంను ఏర్పాటు చేశారు.ప్రస్తుతం ఆ ఘాట్‌ను వివిపి ఘాట్‌గా పిలుస్తుండగా ఇక నుంచి సరస్వతి ఘాట్‌గా నామకరణం చేశారు.

# ఇడి విచారణకు మహేష్ బాబు గైర్హాజర్

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** టాలీవుడ్ హీరో మహేష్ బాబు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరు కాలేదు. సోమ వారం నాడు మహేష్ బాబు ఈడీ విచారణకు హాజరవుతారని వార్తలు వచ్చినా లండన్‌లో షూటింగ్‌లో వుండడంతో ఆయన రాలేదు. ప్రముఖ నిర్మాణ రంగ స ంస్థ సూర్య డెవలపర్స్‌తో పాటు సురానా సంస్థలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) గత నెలలో జరిపిన దాడుల తరువాత ఈ సంస్థ లకు ప్రమోటర్‌గా వున్న హీరో మహేష్ బాబుకు ఈడీ నోటీసులు జారీ చేయడం తెలిసిందే. ఈ రెండు సంస్థల ప్రాజెక్టులకు మహేష్ బాబు ప్రచారకర్తగా వ్యవ హరించారని ఈడీ గుర్తించడం విదితమే. ఇందుకుగానూ ఆయన 2.5 కోట్ల రూపాయల నగదు, 3.4 కోట్ల మేరకు చెక్ రూపంలో అందుకున్నట్లు ఈడీ నిర్ధారిం చి ఏప్రిల్ 28వ తేదీన హైదరాబాద్‌లోని తమ కార్యాలయానికి విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. మహేష్ బాబు ప్రచారం చేయడం తతవల్లే తాము ఈ సంస్థల్లో కోట్లాది రూపాయలు పెట్టుబడులు పెట్టి మోసపోయామని కొందరు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు సాయి సూర్య డెవ లపర్స్‌తో పాటు సురానా సంస్థలపై ఈడీ దాడులు చేబట్టింది. అయితే షూటింగ్‌ల కారణంగా మహేష్ బాబు ఏప్రిల్ 28వ తేదీ విచారణకు రాలేదు. సోమవా రం నాడు ఆయన కచ్చితంగా వస్తారని భావించినా లండన్‌లో వుండడం వల్ల రాలేదని తెలిసింది. అయితే దీనిపై ఈడీ అధికారులు ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. మహేష్ బాబుకు మరో తేదీన విచారణకు రావాలని ఆదేశించే వీలుంది.

# ఉగ్రవాదుల్ని ఊడ్చేశాం

>> ఉగ్రవాదం చర్చలు ఒకే మార్గంలో నడవలేవని, ఉగ్రవాదం వాణిజ్య ఒకే బాటలో ఉండవని, అలాగే నదీజలాలు రక్తపుటేరులు ఒకే తీరులో ఉండబోవని పొరుగుదేశం గుర్తుంచుకోవాలనిమోడీ హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లోను ఉపేక్షించేదిలేదని, ఏరూపంలో ఉన్నా ఎక్కడ ఉన్నా అణిచివేస్తామని నిర్మూలించివేస్తామన్నారు. మన మేడిన్‌ఇండియా సాంకేతిక వ్యవస్థలతో రూపొందిన యుద్ధసామగ్రితోనే పొరుగుదేశానికి, ఉగ్రవాదులకు మన శక్తిసామర్థ్యాలను రుచిచూపించామన్నారు. రెండుదశాబ్దాలుగా పాకిస్తాన్‌లో విశృంఖలంగా ఉన్న ఉగ్రవాద తాండాలను ఒక్కదెబ్బతో తుడిచిపెట్టామని భారత్ వ్యతిరేకంగా కుట్రలుచేస్తున్న ఉగ్రతాండాలను తుదముట్టించామన్నారు. దీనితోభారత్అచేతనావస్థలోకి వెళ్లిందని, ఎటూపాలుపోని పాకిస్తాన్ మనదేశంలోని జనావాసాలు, పాఠశాలలపై దాడిచేసిందన్నారు. పాక్‌నుంచి ప్రయోగించిన మిసైళ్లు, డ్రోన్లను భారత క్షిపణి రక్షణ వ్యవస్థ సరిహద్దుల్లోకి రాకుండానే కూల్చివేసిందన్నారు.పాకిస్థాన్‌లోని కీలకమైన వైమానిక స్థావరాలకు తీవ్రనష్టం కలిగించామని దీనితోనే పాక్ బెంబేలెత్తిపోయిందన్నారు. పాక్ వైమానికస్థావరాలు, రాడార్ స్టేషన్లలో భారత మిసైళ్లు విధ్వంసం సృష్టించాయన్నారు. ఇప్పటికే మెరుపుదాడులు, బాలాకోట్ దాడులు, ఆపరేషన్ సింధూర్ ఉగ్రవాదంపై మన వైఖరిని స్పష్టంచేసామని, ఉగ్రవాదంపై భారత్‌షరతులమేరకే చర్చలు ఉంటాయని, భారత్ నిర్ణయాలకు అనుగుణంగానే చర్చలుసాగుతాయని ప్రధానిమోడీ స్పష్టంచేసారు. అణ్వాయుధాలను చూపించి ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తామంటే భారత్ ఉపేక్షించదని, ఏరూపంలో ఎక్కడ నక్కినా భారత్ తుదముట్టిస్తుందని, అందుకు ఈమూడురోజులపాటుజరిగిన దాడులే నిదర్శనమని మోడీ అన్నారు. మరోసారి భారత త్రివిధ దళాల శక్తిసామర్థ్యాలకు ప్రధానిమోడీ సెల్యూట్‌చేస్తున్నానని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను ప్రపంచం మొత్తంచూసిందని, భారతశక్తిసామర్థ్యాలను తక్కువగా అంచనావేయవద్దని ఆయన సూచించారు. మేడిన్‌ఇండియా ఆయుధాలతోనే మా సత్తాచూపించామని మోడీ గుర్తుచేసారు. ఉగ్రవాదమౌలిక వనరులను నిలిపివేస్తే తప్ప పాకిస్తాన్‌కు మనుగడ లేదని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నంతసేపూ ఆదేశానికి అభివృద్ధి కష్టమేనని మోడీ స్పష్టంచేసారు. బుద్ధపూర్ణిమరోజని బుద్ధుడు మనకు శాంతిని ప్రబోధించాడని, అలాగే శాంతితోపాటు మన శక్తిసామర్థ్యాలనుచాటిచెప్పినపుడే శాంతిసామరస్యవాతావరణం నెలకొల్పగలుగుతామని మోడీ అన్నారు. ఇది యుద్ధాల యుగం కాదని, ఉగ్రవాదులయుగం కూడా కానేకాదని మోడీ చెపుతూ భవిష్యత్తులోకూడా భారత్ ఉగ్రవాదులు దాడులుచేయాలని ఆలోచిస్తే ఇంతకు రెట్టింపుస్థాయిలో జవాబిస్తుందని పాకిస్థాన్‌కు స్పష్టమైన హెచ్చరికలు చేసారు.

## మళ్లీ ఉల్లంఘన

>> భారత్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలే టార్గెట్‌గా దాడులుచేసింది. హోషియార్‌పూర్‌లో సైరన్లు మోగించారు. సాంబా, ఆర్నియాలో డ్రోన్ల కదలికలను గుర్తించారు.

# భారత్, పాక్ అణుయుద్ధాన్ని నేనే ఆపా: ట్రంప్

**వాషింగ్టన్, మే 12:** భారత్ పాకిస్థాన్‌లమధ్య అణుయుద్ధాన్ని తానే ఆపానని, అణుయుద్ధంజరిగి ఉంటే లక్షలాదిమందిప్రాణాలు కోల్పోయేవారని అమెరికా అధ్యక్షుడుడొనాల్డ్‌ట్రంప్ పేర్కొన్నారు. అందుకే తాను అణుయుద్ధాన్ని ఆపేలా భారత్ పాక్‌లపై ఒత్తిడి తెచ్చానన్నారు. యుద్ధం కొనసాగిస్తామంటే మీతో వ్యాపారంచేయనని చెప్పానన్నారు. దీనితో రెండు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని దాయాది దేశాలు కాల్పుల విరమణ క్రెడిట్ నాదే అని ట్రంప్ వ్యాఖ్యలుచేసారు. అంతేకాకుండా యుద్ధం విషయంలోప్రస్తుతం భారత్‌తో చర్చలుజరుపుతున్నట్లు ట్రంప్ చెప్పారు. త్వరలో పాక్‌తోకూడా మాట్లాడతానని వివరించారు. కాల్పుల విరమణపరంగా గతంలో ఎన్నడూ వాణిజ్య అంశాలనను ప్రస్తావించిన దాఖలాలు లేవని, తాను మాత్రమే వాణిజ్యం ప్రాతిపదికగా కాల్పుల విరమణకు ఒత్తిడితెచ్చానని ట్రంప్ అన్నారు.

# బుద్ధవనంలో వరల్డ్ 'మిస్'లు గట్టి భద్రత మధ్య విహారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే12:** తెలంగాణ రాజధాని హైద్రాబాద్ లో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీలలో పాల్గొంటున్న ఆసియా దేశాలకు చెందిన 22 మంది కంటెస్టెంట్స్ బృందం సోమవారం నల్గొండ జిల్లా బుద్ధ వనాన్ని సందర్శించింది.ప్రపంచ సుందరీమణులకు నల్గొండ జిల్లా యంత్రాంగం ఘనంగా ఆతిథ్యమిచ్చింది.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నేతృత్వంలో విజయ విహార్ వద్ద వారికి ఘనంగా స్వాగతం పలికింది. ముందుగా సుందరీమణుల బృందం నాగార్జున సాగర్ తీరాన ఉన్న విజయ విహార్‌లో ఫోటోలు దిగారు.అనంతరం బుద్ధవనాన్ని సందర్శించి బుద్ధుడి పాదాలకు పూలతో పూజలు చేసి మహాస్తూపంలో జ్యోతులు వెలిగించి ధ్యానంలో పాల్గొన్నారు. మహాస్తూపం వద్ద ప్రపంచ సుందరీమణులకు లంబాడా కళాకారులు లంబాడా నృత్యంతో ఘన స్వాగతం పలికారు. బుద్ధవనం ప్రాముఖ్యత, బుద్ధుడి జననం నుండి నిర్యాణం వరకు జరిగిన సంఘటనలు ఆర్కియాలజిస్ట్ శివనాగిరెడ్డి వివరించారు. అనంతరం జాతకవనంలో బుద్ధ చరితంపై కళాకారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,ఎస్పి శరత్ చంద్ర పవార్,ఎమ్మెల్యేలు కుందూరు జయవీర్ రెడ్డి,బత్తుల లక్ష్మారెడ్డి,బాలునాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తదితరులు మాట్లాడుతూ బుద్ధవనం,నాగార్జున సాగర్ ప్రాముఖ్యతను, తెలంగాణ గొప్పతనాన్ని వివరించారు.

# తెలంగాణలో నాలుగు రోజులు వర్షాలు

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** ద్రోణి ప్రభావంతో తెలంగాణలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులు, భారీ ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. రాష్ట్రంలోని ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది. అలాగే రెండో రోజు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, వికారాబాద్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగులు వీస్తాయన్నారు.

# జూన్ 13 దాకా హైకోర్టుకు సెలవులు

>> నాథ్, జస్టిస్ వై.లక్ష్మణరావు డివిజన్ బెంచ్‌గా జస్టిస్ చల్లా గుణరంజన్ సింగిల్ బెంచ్‌గా కేసులు విచారించనున్నారు. రెండోదశ వెకేషన్ కోర్టులు జూన్ 5, 12వ తేదీల్లో విచారణ చేపడతాయి. జూన్ 5, 12వ తేదీల్లో జస్టిస్ జస్టిస్ ఎం.కిరణ్మయి, జస్టిస్ టి.సి.డి.శేఖర్ డివిజన్ బెంచ్, జస్టిస్ కుంచం మహేశ్వరరావు సింగిల్ బెంచ్ నిర్వహిస్తారు.

# 16న జిల్లా కేంద్రాల్లో తిరంగా ర్యాలీ బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

**విజయవాడ,మే12,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ,భారత సైనికులు వెంటే జాతి యావత్తూ ఉందని తిరంగా ర్యాలీ లు నిర్వహించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు, లోక్‌సభ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి పిలుపునిచ్చారు. బిజెపి శ్రేణులతో ఆడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా పురంధేశ్వరి మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ భారతీయుల మనోభావాలు కు సంబంధించిన విషయం, అదేవిధంగా స్వదేశీ ఆయుధాలు ఎంత శక్తివంతంగా పనిచేస్తుందో ప్రపంచానికి పరిచయం అయిందన్న విషయం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగంలో ప్రస్తావించిన విషయాలు వివరిస్తూ ఎన్ డి ఎ కూటమి నేతలను, స్వచ్ఛంద సంస్థలను ఆహ్వానించి జిల్లా కేంద్రంలో 16వ తేదీన ర్యాలీ లు నిర్వహించాలన్నారు, అదేవిధంగా 18వ తేదీన మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించాలని పిలుపు ఇచ్చారు. భారత సైనికులకు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి మద్దతు తెలుపుతూ ర్యాలీలు నిర్వహించాలన్నారు.

# గెస్ట్ లెక్చరర్‌కు వేతనం పెంపు

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో గెస్ట్ లెక్చరర్ లకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ చొరవతో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు జీతాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం గంటకు ఇస్తున్న రూ.150 పారితోషికాన్ని రూ.375కు పెంచగా, నెలకు గరిష్టంగా రూ.27,000గా నిర్ణయించింది. తక్షణమే ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయని తాజాగా విడుదలైన జీఓలో ప్రభుత్వం తెలిపింది. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రంలోని 475 జూనియర్ కాలేజీల్లో పని చేసే 1,177 మంది గెస్ట్ లెక్చరర్లు లబ్ధి పొందనున్నారు.



ఇటీవల జమ్ములో వీరమరణం పొందిన బిఎస్ఎఫ్ జవాన్ ఇంతియాజ్ భౌతిక కాయాన్ని సోమవారం అంత్య క్రియల కోసం పాట్నాకు తీసుకు వచ్చిన దృశ్యం

# పాక్‌తో 'హాట్'లైన్..

## కాల్పుల విరమణపై చర్చించిన ఉభయ డిజిఎంఒలు

**న్యూఢిల్లీ, మే 12:** భారత్‌పాకిస్థాన్ దేశాల డీజీఎంవోల చర్చలు ముగిశాయి. రెండు దేశాల డీజీఎంవోలు హాట్‌లైన్ ద్వారా చర్చలు జరిపారు. వాస్తవానికి ముందుగా నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం డీజీఎంవోలు ఇవాళ మధ్యాహ్నం 12 గంటలకే చర్చలు జరగాల్సి ఉంది. కానీ అనివార్యంగా చర్చలను సాయంత్రం 5 గంటలకు వాయిదా వేస్తున్నట్లు ఇవాళ వేసారు. సాయంత్రం 5 గంటలకు మొదలైన డీజీఎంల చర్చలు సుమారు గంటలపాటు జరిగాయి. భారత డీజీఎంవో రాజీవ్ ఘాయ్, పాకిస్థాన్ డీజీఎంవో కాశీఫ్ చౌదరిలుఈ చర్చల్లో పాల్గొన్నారు. కాల్పుల విరమణకు ఇరుదేశాలు అంగీకారం తెలిపిన అనంతర పరిస్థితులు, కాల్పుల విరమణ విధివిధానాలు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది.

హాట్‌లైన్‌లో ఇంకా ఏం చర్చించారనే వివరాలు సమగ్రంగా తెలియరాలేదు. చర్చల్లో ప్రధానంగా కాల్పుల విరమణ కొనసాగింపు, ఉద్రిక్తతల తగ్గింపు, పివోకే తదితర అంశాలపైనే చర్చలుజరిగాయనిసమాచారం. కాగా ఏప్రిల్ 22న పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం సమీపంలోగల బైసరన్ లోయలో పర్యాటకులే లక్ష్యంగా కాల్పులకు తెగబడ్డారు. ఆ కాల్పుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. అందుకు ప్రతీకారంగా భారత్ పాక్‌లోని, పీవోకేలోని ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సింధూర్ పేరుతో సర్జికల్స్ స్ట్రైక్స్ చేసింది. అదే సమయంలో పాకిస్థాన్ సైన్యం అత్యుత్సాహంతో భారత్‌పై దాడులకు పాల్పడింది.

ఈ దాడులను భారత్ సమర్థంగా తిప్పికొట్టింది. రెండు దేశాల మధ్య దాడులు, ప్రతి దాడులతో పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తంగా మారాయి. ఈ క్రమంలో పాకిస్థాన్ డీజీఎంవో భారత్‌కు కాల్పుల విరమణ ప్రతిపాదన చేశారు. అందుకు భారత్ కూడా అంగీకరించింది. సోమవారం మధ్యాహ్నం డీజీఎంవోలు చర్చలకు ప్లాన్ చేశారు. అయితే మధ్యాహ్నం జరగాల్సిన చర్చలు సాయంత్రానికి వాయిదాపడ్డాయి. సాయంత్రం ఇరుదేశాల డీజీఎంలోలు చర్చలు జరిపారు.

# మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డిని విచారణ చేసిన పోలీసులు

>> చేయడానికి ప్రయత్నించాను. పోలీసుల భద్రతా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే నా పై కేసులు నమోదు చేశారు. వైసీపీ అధినేత జగన్‌కు భద్రత కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారు. దీనిని మేము ప్రశ్నిస్తే మా పై కేసులు పెట్టారు అని ప్రకాష్ రెడ్డి ధ్వజమెత్తారు. తమనేత వైఎస్ జగన్ పర్యటన కోసం రామగిరి మండలంలో హేలిప్యాడ్ ఏర్పాట్లు నేను పర్యవేక్షించలేదని, ఇందుకోసం పోలీసుల అనుమతిని కూడా నేను కోరలేదని ఆయన చెప్పారు. హెలికాప్టర్‌పై అభిమానులు చొచ్చుకు వచ్చే సమయంలో డీఎస్పీ దగ్గరున్నా మైకు తీసుకొని నేనే కంట్రోల్ కూడా చేశానని, అయితే నేనే రెచ్చగొట్టినట్టు పోలీసులు నాపై కేసు పెట్టడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. సికేపల్లి పోలీస్ స్టేషన్‌లో పోలీసుల విచారణలో మొత్తం 102 ప్రశ్నలు అడిగారు అని, అన్నింటికీ సమాధానం చెప్పాను అని ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి చెప్పారు. మొత్తం మీడియా, పోలీసులు పాపిరెడ్డి పల్లెలో జరిగిన కురుబ లింగమయ్య హత్యను పక్కదారి పటిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చమీడియా ఈ కేసును సైడ్ ట్రాక్ చేస్తోందని, లింగమయ్య హత్య సంఘటనను, పక్కనపెట్టి హెలికాప్టర్ ఘటనని చూపిస్తోందని ఆయన ప్రశ్నించారు. మీడియానే అన్నీ డిసైడ్ చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. హెలికాప్టర్‌పై దాడి కేసులో హైకోర్టు 41ఎ నోటీసులు ఇచ్చి విచారించమని చెప్పింది అని, అయితే నన్ను అరెస్ట్ చేయమని, లాక్కురండి అని చెప్పారని మీడియాలో ప్రచారం చేశారని ఆయన ఆక్రోసం వెళ్ళగక్కారు.అసలు లింగమయ్య హత్య పరిటాల శ్రీరామ్ పై ఎందుకు కేసులు పెట్టలేదని ప్రకాష్ రెడ్డి ప్రశ్నించారు.లింగమయ్య హత్య జరిగిన తర్వాత శ్రీరామ్ విదేశాలకు పారిపోయాడని, చంద్రబాబు హయాంలో అసలు లా అండ్ ఆర్డర్ ఉందా ఆయన ప్రశ్నించారు.

# పూర్తిగా గిరిజనులకే

>> సూచించారు. ఈ నేపథ్యంలో తిరిగి ఈ ఉత్తర్వుల ద్వారా లభించే లబ్దిని గిరిజ నులకు తిరిగి అందించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఇందులో భాగంగా న్యాయ పరమైన అంశాలు, సుప్రీంకోర్టు తీర్పు, గిరిజన హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలను అధ్యయనం చేయాలని సిఎం అన్నారు.

**ముఖ్యమంత్రి ముందు మూడు ఆప్షన్లు**

జీవో నెంబర్ 3 పునరుద్ధరణపై ప్రస్తుతం ఉన్న మూడు అవకాశాల గురించి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మొదటి ఆప్షన్‌గా ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో 100 శాతం రిజర్వేషన్లు స్థానిక గిరిజనులకు కల్పించడం, రెండవ ఆప్షన్‌గా స్థానిక గిరిజనులకు వారి యెక్క జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వడం, మూడవ ఆప్షన్‌గా సుప్రీంకోర్టు సూచించినట్టు 50 శాతం మించకుండా స్థానిక గిరిజనులకే రిజర్వేషన్లు కల్పించి వారి హక్కులను పరిక్షించడం వంటి అవ కాశాలను అధికారులు సిఎం దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై సిఎం మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో గిరిజనుల హక్కులకు కట్టుబడి ఉన్నామని ఎన్నికలసమయంలో చెప్పినట్లు జీ.వో నెంబర్ 3 పునరుద్ధరించడం లేదా అదే స్థాయిలో గిరిజను లకు న్యాయం చేయడానికి కట్టుబడి ఉన్నాం. ఈ విషయంలో జాతీయ స్థాయిలో రాజ్యాంగ, న్యాయ నిపుణులతో కూడా సంప్రదిం పులు జరపాలి" అని సిఎం అన్నారు. గిరిజనుల జీవన ప్రమాణాలు పెంచేందుకు విద్యవైద్య సదుపా యాలు కల్పిస్తూ, ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నామని సీఎం అన్నారు. వారికి న్యాయం చేసేందుకు ఉన్న ఏ ఒక్క అవకాశాన్ని వదులు కునే ప్రసక్తేలేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# ఎపి భవన్‌కు చేరిన 400మంది విద్యార్థులు

>> సరిహద్దుల్లోని రాష్ట్రాల్లో నివాసం ఉంటున్న ఏపీ వాసులు ఎలాంటి ఇబ్బందుల్లో ఉన్నా సాయం కోసం 011-23387089, మొబైల్ నెంబర్లు 9871999430, 9871999053లలో సంప్రదించవచ్చని ఏపీ భవన్ రెసిడెంట్ కమీషనర్ తెలిపారు. ఏదైనా అదనపు సమాచారం,సహాయం కావాలంటే ఏపీ భవన్ డిప్యూటీ కమీషనర్ ఎంవీఎస్ రామారావు 9871990081,లైజన్ ఆఫీసర్ వి.సురేష్‌బాబు 9818396787లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 13-05-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
కృ.పాడ్యమి రా.12.35
విశాఖ ఉ.9.08
వర్జ్యం మ.1.34-3.21
దు.ఉ.8.13-9.05, 2) రా.11.40-12.32
శుభసమయం : ఉ.7.30-8.00
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** బంధువులను కలిసి కష్ట సుఖాలను పంచుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

**వృషభం :** ఉద్యోగాలలో స్వల్పమార్పులు వుంటాయి. విందు, వినోదాలు, శుభ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**మిథునం:** బాకీలు వసూలవుతాయి. సేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. ఆకస్మిక ధనలాభం.

**కర్కాటకం:** ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలలో అంచనాలు నిజం చేసుకుంటారు.

**సింహం:** చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. ఉద్యోగాలలో పదోన్నతులు, హోదాలు పొందుతారు.

**కన్య :** కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**తుల :** అనుకోని అవకాశాలు పొందుతారు. వాటిని సద్వినియోగం చేసుకోండి. ప్రయాణాలు లాభిస్తాయి.

**వృశ్చికం:** నిరుద్యోగుల యత్నాలు మందగిస్తాయి. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు.

**ధనుస్సు:** ఉద్యోగాలలో సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

**మకరం:** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది.

**కుంభం:** మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. భూవివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**మీనం:** వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పొందుతారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

ong3page.qxd:13-05Pg3exHMNWJQEPSVLR-ff.qxd 01/01/01 10:39 AM Page 1



# కాలువల తవ్వకం పనులు మే నెలాఖరుకు పూర్తి చేయాలి

### - జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా కాలువల్లో పూడిక తీత, గుర్రపుడెక్క,తూటికాడ తొలగింపు,షట్టర్లు, గేట్ల మరమ్మత్తులు, గ్రీజు పెట్టడం వంటి నిర్వహణ పనుల కోసం ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ 344 కోట్ల రూపాయలు విడుదల చేశారని,ఈ పనులను స్వీయ పర్యవేక్షణ చేస్తూ, మే చివరి నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. సోమవారం విజయవాడలో జలవనరుల క్యాంపు కార్యాలయం నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సిఈలు, ఎస్ఈలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారాయన.ఈ సమావేశంలో ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్, కడా కమీషనర్ రాంసుందర్ రెడ్డి, ఈఎన్సీ ఎం.వెంకటేశ్వర రావుతో పాటు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. గుర్రపుడెక్క, తూటకాడ వంటి వాటి తొలగింపుకోసం, మందుల పిచికారీకి డ్రోన్లు సైతం వినియోగించుకోవాలని సూచించారాయన. అవసరమైన చోట్ల 7 రోజుల వ్యవధితో షార్ట్ టెండర్లు పిలవడానికి అనుమతిచ్చిందని, నిర్వహణ మరియు మరమ్మత్తు పనులను చేపట్టడం యొక్క ప్రధాన లక్ష్యం, 2025 ఖరీఫ్ ప్రారంభానికి ముందు నీటిపారుదల వ్యవస్థలను సాధారణ స్థితికి తీసుకురావడం అని ఆయన అధికారులకు సూచించారు. గేట్లు, షట్టర్లు, వంటి మెకానికల్ పనులను తప్పనిసరిగా అసిస్టెంట్ ఇంజనీర్ పరిశీలించి, సక్రమంగా పనిచేసే స్థితిలో ఉన్నాయనే ధ్రువీకరణ పత్రాన్ని, చీఫ్ ఇంజనీర్ కు ఇవ్వాలని ఆదేశించారు. సాగు నీటి సంఘాలు ఆధ్వర్యంలో, వారి పరిధిలోని పనులను, మే నెలాఖరుకు పూర్తిచేయాలి.ఇలా పనులను సకాలంలో పూర్తిచేయడానికి చీఫ్ ఇంజనీర్లు, సూపరిండెంట్ ఇంజనీర్లు నిరంతరంగా పర్యవేక్షణ చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అన్ని పనులూ, సీజన్ మొదలయ్యే నాటికి పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించిన మంత్రి నిమ్మల రామానాయుడు, గతంలో మాదిరిగా కాకుండా మే చివరి నాటికి, అన్ని అత్యవసర పనులు, నాణ్యత తో పూర్తి చేయాలన్నారు.



ఇరిగేషన్ అధికారుల టెలీకాన్ఫరెన్స్ లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



## పొరుగు దేశాల మధ్య సమస్యల పరిష్కారానికి యుద్ధమే కీలకం కాదు

### - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** పొరుగు దేశాల మధ్య సమస్యలను పరిష్కరించుకోవడాని యుద్ధమే కీలకం కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వ్యాఖ్యానించారు.మన దేశంలో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ ఉన్మాదాల శిబిరాలపై ఆపరేషన్ సింధూరను సీపీఐ సమర్ధించిందన్నారు.అయితే యుద్దంపై తమ పార్టీ లైన్ తమకుందన్నారు.అందుకే అనివార్యమైతే తప్ప యుద్ధం సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ వద్దన్నారు.దీనిపై ఆయనను పాకిస్థాన్‌కు పంపించాలంటూ బీజేపీ సీనియర్ నేత ఎమ్మెల్సీ సోము వీర్రాజు మతిభ్రమించి విమర్శలు చేయడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఖండించారు.ట్రంప్ చెబితే ప్రస్తుతం భారత్ పాక్ యుద్ధం ఆగిందా? లేదా?, భారతదేశ సార్వభౌమాధికారాన్ని, ప్రజల విచక్షణను గాలికి వదిలి ట్రంప్ చెప్పిన మాటలు విని యుద్ధం ఆపేయడం నిజం కాదా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి అమెరికా వెళ్లి గురువు ట్రంప్‌తో ఉంటే మంచిదని హితవు పలికారు.దేశం ఉనికి ప్రమాదం వస్తే వామపక్షాలు ప్రభుత్వానికి మద్దతుగా ఉంటామన్నారు.మన దేశ ప్రజలపై యుద్ధం ప్రభావం ఉండకూడదన్నారు.

## ఎపి-ఇఎపిసెట్ హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

**విజయవాడ,మే 12,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ-ఈఏపీసెట్-2025కు సంబంధించిన హాల్‌టిక్కెట్లను ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఇంజనీరింగ్ అగ్రికల్చర్,ఫార్మసీ విభాగాలకు కలిపి మొత్తం 3,61,299 మంది ధరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పరీక్షలు ఈ నెల 19 నుండి ప్రారంభం కానున్నాయి. సందేహాలకు 0884-2359599,2342499 నంబర్లలలో సంప్రదించాలని అధికారులు సూచించారు.



## అమరావతి నిర్మాణపనులు పునఃప్రారంభం ఆనందం

### - మంత్రులు అచ్చెన్న, కొల్లురవీంద్ర

**తిరుమల,మే 12 ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి అభివృద్ధి పనులు కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో పునఃప్రారంభం కావడం ఆనందంగా ఉందని రాష్ట్రమంత్రులు కె. అచ్చెన్నాయుడు, కొల్లురవీంద్ర తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధిపథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని మంత్రులు ఉద్ఘాటించారు. రాష్ట్రప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు చెప్పారు. ప్రతిష్టాత్మకమైన ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాజెక్టులు అమలవుతున్నాయన్నారు. పోలవరం కూడా పూర్తిచేసేలా సిఎం చంద్రబాబుకు శక్తిని ఇవ్వాలని వేడుకున్నామన్నారు. సోమవారం ఉదయం తిరుమలేశుని ఆలయంలోనికి చేరుకున్న మంత్రులు విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# తిరుపతి ఐఐటికి మహర్దశ

## రూ.2300కోట్లు నిధులు మంజూరు

### అంతర్జాతీయ స్థాయికి తీర్చి దిద్దుతాం: డైరెక్టర్ ప్రొ.సత్యనారాయణ

**శ్రీకాళహస్తి,మే 12 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన తిరుపతి ఐఐటికి మహర్ధశ వస్తుందని రాబోవు రోజుల్లో అంతర్జాతీయ స్థాయిలో ఐఐటిని తీర్చి దిద్దుటకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు డైరెక్టర్ ప్రోఫెసర్ సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆయనను ప్రభాతవార్త పలకరించినపుడు ఐఐటి రాబోవు 4 సంవత్సరాల్లో చేపట్టబోయే ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు వివరించారు. రాబోవు నాలుగు సంవత్సరాలకు గాను కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తిరుపతి ఐఐటికి రూ.2300కోట్లు నిధులు మంజూరు చేసినట్లు సమాచారం అందిందన్నారు. రాబోవు నాలుగుసంవత్సరాల్లో ఐఐటికి మహర్ధశ వస్తుందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం 2015లో మంజూరు చేసిన ఐఐటిల్లో తిరుపతి పేరుతో ఒక ఐఐటిని, అలాగే ఐసర్‌ను ఏర్పాటుకు మంజూరు చేసారన్నారు. ఐఐటిని 539 ఎకరాల్లో నిర్మాణానికి ప్రణాళికలు రచించి అమలు చేసామన్నారు.2017నుంచి నిర్మాణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు. సుమారు 4 సంవత్సరాల పాటు తిరుపతిలోని ఓ ప్రైవేటు కళాశాలలతో అతిధిగా విద్యాసంవత్సరాలను గడిపామన్నారు.అలాగే హస్టల్‌ను ప్రైవేటు భవనాల్లో గడిపామన్నారు. రెండేళ్ళ క్రితం ఏర్పేడు మండల కేంద్రంలో సొంత భవనాల్లోకి ప్రవేశించామన్నారు. 2017 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సర వరకు రూ.1100 కోట్లు వెచ్చించినట్లు ఓ ప్రశ్నకు సమాధానంగా డైరెక్టర్ సత్యనారాయణ వివరించారు. సకల సదుపాయాలతో సంపూర్ణ స్థాయిలో తిరుపతి ఐఐటి నిర్వహిస్తున్నామని వివరించారు. సొంత భవనాల్లోకి ప్రవేశించిన తరువాత ఎన్నో ఆవిష్కరణలు ఎన్నో ఒప్పందాలు జరిగాయన్నారు.అంతేకాక విద్యార్థులను అంతర్జాతీయ స్థాయిలో తీర్చి దిద్దుటకు ప్రయత్నిస్తున్నామని అయితే తన సిబ్బంది సహకారం ఎంత చెప్పినా తక్కువే అన్నారు.




తిరుపతి ఐఐటి దృశ్యం

# మాజీ ఎంపి దరూరు పుల్లయ్య గుండెపోటుతో కన్నుమూత

### - కాంగ్రెస్ నుండి రెండు సార్లు ఎంపిగా ఎన్నిక

**ఉరవకొండ, మే 12 ప్రభాతవార్త** అనంతపురం మాజీ పార్లమెంటు సభ్యులు, సాగునీటి రంగ నిపుణులు దరూరు పుల్లయ్య (86) గుండె పోటుతో సోమవారం మధ్యాన్నం కన్నుమూశారు. కంప్లి కొట్టాల గ్రామంలోగల తమ పంట పొలాలను చూడటానికి వెళ్లి అక్కడే గుండెపోటుకు గురై తుదిశ్వాస విడిచారు. ఆయన స్వగ్రామం ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామం. ఆయనకు భార్య దరూరు సత్యవతి, కుమారుడు దరూరు రమేష్ (ఛాయాపురం గ్రామం మాజీ సర్పంచ్), ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. చాలా కాలంగా ఆయన ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. దరూరు పుల్లయ్య 1939 జూన్ 20న మద్రాసు ప్రెసిడెన్సీలో జన్మించారు. చెన్నైలోని లయోలా కళాశాలలో చదువుకున్నారు. మద్రాసు న్యాయ కళాశాలలో న్యాయ శాస్త్రంలో పట్టా పొందారు. కాంగ్రెస్ పార్టీ తరపున ఆయన 1977, 1980లో రెండుసార్లు 6వ, 7వ లోక్‌సభకు అనంతపురం నియోజకవర్గం నుండి ఎన్నికయ్యారు. 1994లో కాంగ్రెస్ పార్టీ తరపున ఉరవకొండ అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ చేతిలో ఓడిపోయారు. కొన్ని సంవత్సరాల తరువాత తెలుగుదేశం పార్టీలో చేరి ప్రత్యక్ష రాజకీయాల్లో పాలొ ంటూ ప్రత్యేక వర్గాన్ని నిర్వహించారు. సాగునీటి రంగంపై అపారమైన అనుభవం కల్గిన దరూరు పుల్లయ్య రాష్ట్రంలోని ప్రధానమైన జలాశయాలు,

ప్రాజెక్టులు వాటి పుట్టుపూర్వోత్తరాలపై అనేక అధ్యయనాలు చేశారు. కరువు పీడిత రాయలసీమ, ముఖ్యంగా అనంతపురం జిల్లాలో కరువును, వెనుకబాటు తనాన్ని రూపుమాపడానికి ప్రభుత్వాలకు ఎంతో విలువైన సలహాలు, సూచనలు చేసి అనేక ఉద్యమాల్లో సైతం పాల్గొని తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు.

హంద్రీనీవా సుజల స్రవంతి పథకంకు అమలుకు ఆయన కృషి చేశారు. జిల్లా అభివృద్ధి కోసం పార్టీలు పక్కనబెట్టి కమ్యూనిస్టు యోధులు వి.కె.ఆదినారాయణరెడ్డితో కలిసి పనిచేశారు. వి.కె మరణానంతరం వి.కె.ట్రస్టు ఏర్పాటు చేయడంతోపాటు ఆయన పేరుమీద వి.కె ట్రస్టు భవనం నిర్మాణానికి ఎంతో కృషి చేశారు. దాదాపు 15 సంవత్సరాలుగా ఆయన ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా బళ్లారిలోనే నివశిస్తున్నారు.

# రాజకీయ కక్ష సాధింపులకు పోలీసులా? దిగజారిన శాంతిభద్రతలు : సజ్జల

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థను నీరుగారుస్తూ, రాజకీయ కక్షసాధింపులకు వినియోగిస్తున్న కూటమి ప్రభుత్వ విధానాలపై వైయస్‌ఆర్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.వైయస్‌ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం అందుబాటులో ఉన్న పార్టీ నాయకులతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రాజకీయ కక్షసాధింపు చర్యలు, పోలీసులను వినియోగించుకుంటున్న తీరు, దిగజారిన శాంతిభద్రతలు, తాజాగా మాజీ మంత్రి విడదల రజిని పట్ల స్థానిక సీఐ అమానుషంగా వ్యవహరించిన వైనంపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు రాష్ట్రంలో పోలీసులు పరిధి దాటి వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చట్టాన్ని చేతిలోకి తీసుకుంటూ, రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థనే నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వ విధానాలపై ఉదాహరణలతో సహా సమావేశంలో ప్రస్తావించారు. తాజాగా మాజీ మంత్రి విడదల రజిని పట్ల పోలీస్ అధికారి వ్యవహరించిన తీరు రాష్ట్రంలో పోలీసుల ద్వారా ప్రభుత్వం చేయిస్తున్న దౌర్జన్యకాండకు నిదర్శనమని పలువురు నాయకులు మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలు, పోలీస్ యంత్రాంగాన్ని తప్పుదోవలో నడిపిస్తున్న వైనంను ప్రజలు ముందు పెట్టేందుకు వైయస్‌ఆర్‌సీపీ ఒక కార్యాచరణను సిద్దం చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కూటమి సర్కార్ రాష్ట్రంలో ప్రశ్నించే గొంతులను నొక్కేస్తోందని, ఎవరైనా ప్రభుత్వ వైఫ్యలాలను నిలదీస్తే పోలీసులను ప్రయోగించి తప్పుడు కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. పోలీసులు సైతం కేసుల నమోదులో చట్టపరమైన నిబంధనలను పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించడం దారుణని అన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాష్ట్రంలో పరిస్థితులు దిగజారి పోయాయని, డీజీపీకి ఫిర్యాదు చేసే అవకాశం కూడా ఇవ్వక పోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎన్నిసార్లు డీజీపీ అపాయింట్‌మెంట్ కోరినా స్పందించ పోవడం దేనికి సంకేతమని నిలదీశారు. ఈ మొత్తం వ్యవహారంను వైయస్‌ఆర్‌సీపీ సీరియస్‌గా తీసుకుంటోందని, వ్యవస్థలను కాపాడేందుకు బాధ్యత గల ప్రతిపక్షంగా దీనిపై స్పందిస్తుందని అన్నారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, మేరుగు నాగార్జున, జోగి రమేష్, విడదల రజిని, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మొండితోక జగన్మోహన్‌రావు, అన్నాబత్తుని శివకుమార్, పార్టీ నాయకులు దేవినేని అవినాష్, వేమారెడ్డి, పోతిన మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షల వివరాలు

**విజయవాడ,మే12.ప్రభాతవార్త ప్రతినిధి:** టైపురైటింగ్ మరియు షార్ట్ హ్యాండ్ పరీక్షల తేదీలను ప్రకటించినట్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక విద్య మరియు శిక్షణ బోర్డు కార్యదర్శి జి.వి.రామచంద్ర రావు, సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షార్ట్ హ్యాండ్ పరీక్షను ఈ ఏడాది జూలై 12 మరియు 13వ తేదిలలో, టైప్ రైటింగ్ పరీక్షను, ఈ ఏడాది జూలై 19 మరియు 20 వ తేదిలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ ను మే నెల చివరి వారంలో జారిచేయనున్నట్లు ఆయన చెప్పారు. పూర్తి వివరాలు మరియు పరీక్షలకు సంబంధించిన తాజా సమాచారం కొరకు అభ్యర్థులు రాష్ట్ర సాంకేతిక విద్య మరియు శిక్షణ బోర్డు, మంగళగిరి, అధికారిక వెబ్ సైట్ ను సందర్శించాలని జి.వి.రామచంద్ర రావు కోరారు.

## పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాల్ టిక్కెట్లు రెడీ

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థుల హాల్ టికెట్లు విడుదలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ హాల్ టికెట్లను సంబంధిత వెబ్ సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకో వచ్చని విద్యార్థులకు ప్రభుత్వం సూచించింది. విద్యార్థులు.. తమ వివరాలను ఎంటర్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపింది. అలాగే మన మిత్ర యాప్ ద్వారా వాట్సాప్‌లో సైతం ఈ హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చని వివరించింది. రెగ్యులర్, ఓపెన్ స్కూల్ విద్యార్థులు ఎవరైనా వీటి ద్వారా హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చని పేర్కొంది. విద్యార్థులు.. తమ వివరాలను ఎంటర్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపింది. అలాగే మన మిత్ర యాప్ ద్వారా వాట్సాప్‌లో సైతం ఈ హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చని వివరించింది. రెగ్యులర్, ఓపెన్ స్కూల్ విద్యార్థులు ఎవరైనా వీటి ద్వారా హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చని పేర్కొంది.పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 19 నుంచి 28వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరగనున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం ఒక ప్రకటనలో వెల్లడించింది.



## తిరుమల రెండోఘాట్‌లో 'చిరుత'!

### - ద్విచక్రవాహనదారులు బెంబేలు

**తిరుమల,మే 12ప్రభాతవార్తప్రతినిధి:** వేసవి కాలంలో అటవీప్రాంతంలో నీరు,ఆహారం దొరకక దారితప్పిన చిరుతపులులు ఏకంగా ఘాట్‌రోడ్లపై, కాలినడక మార్గాల్లో భక్తులకు కనిపిస్తున్నాయి. అటవీప్రాంతం వదలి భక్తుల సంచారం ప్రాంతాల్లో వచ్చేస్తుండటంతో భయంతో వణికిపోతున్నారు. తాజాగా సోమవారం ఉదయం 9గంటల ప్రాంతంలో తిరుపతి నుండి తిరుమలకు వచ్చే రెండోఘాట్‌లో వినాయకుడి గుడి సమీపంలో ఓ చిరుతపులి అడవిలోంచి ఘాట్‌రోడ్డు దాటడాన్ని ద్విచక్రవాహనదారులు గమనించారు. వెంటనే భయంతో విజిలెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. సాధారణంగా శేషాచలంఅటవీ ప్రాంతంలో ఆగస్ట్-సెప్టెంబర్ మాసాలు వన్యప్రాణుల సంతానోత్పత్తి జరుపుకునే అవకాశం ఉన్నందున తిరుమల ఘాట్‌రోడ్లలో చిరుతపులుల సంచారం ఉంటుంది. అయితే వేసవిలో వర్షాభావ పరిస్థితులతో కుంటల్లో నీరులేక,ఆహారం దొరక్క జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి.

### రెండుటన్నుల పుష్పాలు, పత్రాలతో

## కపిలేశ్వరునికి పుష్పసోయగం

**తిరుమల,మే 12ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రసిద్ధ శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం 2టన్నులు పత్రాలు, 2టన్నులు పుష్పాలతో శోభాయమానంగా పుష్పయాగ మహోత్సవం నిర్వహించారు. ఇందులో చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, కనకాంబరాలు, జాజి,రోజా,తామర, మల్లి, వృక్షి, బిల్వపత్రం, తులసి, పన్నీరు ఆకులతో కపిలేశ్వరస్వామి, కామాక్షిఅమ్మవారి ఉత్సవమూర్తులకు పుష్పాలతో స్పృశించారు. అంతకుముందు ఉదయం సుప్రభాతంతో మేల్కొలిపిన అర్చకులు పాలు,పెరుగు, తేనె, చెరకురసం, విబూది, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో కలశస్నపనతిరుమంజనం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్,కర్నాటక ,తమిళనాడునుండి దాతలు విరాళంగా పంపిన పుష్పాలు, పత్రాలతో విశేషంగా అభిషేకించారు. ఆలయంలో ఇటీవల బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులవల్లగానీ, అర్చకులవల్ల, అధికారుల వల్ల ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పత్రపుష్పయాగం జరిపించడం పరిపాటి. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ దేవేంద్రబాబు, ఉద్యానవనవిభాగం డిప్యూటీ డైరెక్టర్ ఎస్. శ్రీనివాసులు, ఎఇఒ సుబ్బరాజు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, భక్తులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల భద్రతే ప్రధానం

### 15మందికి మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డులు

**గుంతకల్లు రైల్వే,మే 12,ప్రభాతవార్త** ప్రస్తుత వేసవికాలంలో రైలు ప్రయాణికుల భద్రత, రక్షణలకై రైల్వే సిబ్బంది నిబద్ధత మరింత చిత్తశుద్ధిలతో పనిచేయాలని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అన్నారు. స్థానిక డిఆర్ఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన భద్రతా, సమయ పాలన సమీక్ష సమావేశంలో అదనపు డిఆర్ఎం సుధాకర్, సీనియర్ డిఎస్ఓడి సూర్యనారాయణలతో కలిసి డివిజన్ పరిధిలో జరుగుతున్న రైల్వే పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతా నిమిత్తం అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లలో మార్గదర్శకాల మేరకు పనిచేయాలని సూచించారు.




# తిరుమల సమాచారం

## కల్తీనెయ్యి ఘటనపై ఛార్జిషీటు!

### - 15మంది నిందితులుగా పేర్కొన్న సిట్

**తిరుమల,మే 12 ప్రభాతవార్తప్రతినిధి:** హిందువులకు ఎంతో విశ్వాసమున్న తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూప్రసాదం తయారీలో కల్తీనెయ్యి వినియోగించారనే సంచలన కేసులో సిబిఐ సిట్ అధికారులు ఛార్జిషీటు దాఖలుచేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే నెల్లూరు ఏసిబి కోర్టులో సిట్ దాఖలు చేసిన మొదటి ఛార్జిషీట్‌లో 15మందిని నిందితులుగా పేర్కొంది. ఇందులో ఆరుగురిని ఇప్పటికే సిట్ అరెస్టుచేసి, అన్ని కోణాల్లో సమగ్రంగా విచారణ చేపట్టి ఆధారాలు సేకరించింది. మిగిలిన వారిలో నెయ్యిసరఫరాకు చెందిన సరఫరాదారులు, నిర్వాహకులు, ఉద్యోగులు ఉన్నారు. ఏఆర్‌డైయిరీ, బోలేబాబాడెయిరీ, వైష్ణవిడెయిరీల ఉద్యోగులను నిందితులుగా చేర్చిన విషయం తెలిసిందే. ఇద్దరు టిటిడి ఉద్యోగులను ఇప్పటికే అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచింది.20మందిని టిటిడి ఉద్యోగులను సాక్షులుగా పేర్కొంది. సిబిఐ సిట్ అధికారులు పూర్తిగా గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వంలోని పూర్వటిటిడి ధర్మకర్తలమండలి పెద్దలు, టిటిడి ఉన్నతాధికారి, కొనుగోలుకమిటీ ఏమేరకు నిబంధనలు పాటించి నెయ్యిసరఫరాకు టెండర్లు పిలిచారు, టెండర్లలో పాల్గొన్న ఐదుసంస్థలు, కాంట్రాక్టర్ల వివరాలు సేకరించారు. కల్తీనెయ్యికి సూత్రధారులు,పాత్రధారులు ఎవరని తేల్చేపనిలో మూలాలు కదిలించనున్నారు. ఇప్పుడు నెయ్యిసరఫరాకు కీలకంగా అనుమతించడంలో పూర్వ టిటిడి బోర్డు పెద్దలు, ఓ ఉన్నతాధికారికి నోటీసులు ఇవ్వాలని ఆలోచనలో ఉన్నారనేది సమాచారం.




## నిండుపౌర్ణమిన వేడుకగా గరుడసేవ

**తిరుమల,మే 12ప్రభాతవార్తప్రతినిధి:** చల్లట వాతావరణంలో ఆకాశం ప్రశాంతంగా మబ్బులతో ఉన్న వేళ పౌర్ణమి ఘడియల్లో పున్నమివెలుగుల్లో సోమవారం రాత్రి శ్రీమలయప్పస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగించుకుని సహస్రదీపాలంకరణసేవలో వయ్యారంగా పూజలందుకున్నారు. అక్కడ నుంచి బయలుదేరి వాహనమండపం చేరు కున్నారు. వాహన మండపం వద్ద ఆలయ అర్చకులు విశేష అలంకారభూషితుడైన మలయప్పను కొలువుదీర్చి వేదమంత్రాల నడుమ కర్పూర హారతులిచ్చారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణల మధ్య గరుడవాహనం మెల్లగా ఆలయం ముందునుంచి కదులుతూ మాఢవీధుల్లో ఊరేగింది. ఈ వాహనసేవలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, అర్చకులు,ఆలయ పేష్కార్ రామకృష్ణ,భక్తులు పాల్గొన్నారు.



## స్వర్ణరథంపై పద్మావతి అమ్మవారు

**తిరుమల,మే 12ప్రభాతవార్తప్రతినిధి:** వేసవిలో తిరుచానూరు పద్మావతిఅమ్మవారికి వేడినుండి ఉపశమనం కల్పించడానికి జరుగుతున్న వసంతోత్సవాల్లో రెండవరోజు సోమవారం ఉదయం స్వర్ణరథంపై సిరులతల్లి ఊరేగారు. ఉదయం పద్మావతిదేవిని సుప్రభాతంతో మేల్కొలిపిన ఆలయ అర్చకులు నిత్యకైంకర్యాలు ముగించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని విశేష అలంకరణ చేసి స్వర్ణరథంపై వేంచేపుచేశారు. ఇక్కడ అర్చకులు వేదమంత్రోచ్ఛరణల నడుమ కర్పూర హారతులిచ్చి అమ్మవారి స్వర్ణరథం ఆలయ మాఢవీధుల్లో ఊరేగించారు. స్వర్ణరథంపై అమ్మవారిని దర్శిస్తే తలచిన పనులు నెరవేరడంతో బాటు మరోజన్మఉండదని అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం 2.30గంటల నుండి అమ్మవారి ఉత్సవర్లకు శుక్రవారంపుతోటలో పసుపు, కుంకుమ, పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్ళతో విశేష స్నపనతిరుమంజనం అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని ఆలయ మాఢవీధుల్లో ఊరేగించి భక్తులను కటాక్షింపజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు బాబుస్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ గోవిందరాజన్, ఆలయ సూపరింటెండెంట్ రమేశ్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సుభాస్కర్, సుబ్బరాయుడు భక్తులు పాల్గొన్నారు.

**AMARAVATI DEVELOPMENT CORPORATION LIMITED (ADCL)**
(CIN Number : U93000AP2015SGC105535), Email : ccdmc.amaravati@gmail.com
54-15-1, Venkateswara Nagar, Ring Road, Vijayawada, NTR Dist, Andhra Pradesh-520008.

**Request for Proposal**

NIT No. 409/ADCL/IPD/2025 Dated: 12.05.2025

Request for Proposal (RFP) for Engagement of Project Management Consultant (PMC) for (i) Construction of Roads, Storm Water Drains, Water Supply Network, Sewerage Network, Utility Ducts for Power & ICT, Reuse Waterline, Pedestrian Tracks, Cycle Track, Avenue Plantation & Street Furniture in E16, N1, N2, N3A&3B, N5 Roads in Amaravati and (ii) Construction of Road, Storm water Drainage, and Utilities for (a) E15 Road Extension to Old National Highway Mangalagiri and (b) E13 Road Extension to National Highway-16; including DLP 2 years in Andhra Pradesh.

The RFP can be downloaded on AP e-procurement portal from 13.05.2025 to 04.06.2025 up to 15.30 Hrs. Due date for submission of Bid is 04.06.2025 up to 16.00 Hrs, Technical Bid opening is on 04.06.2025 @16.30 Hrs. For further details please refer to www.apeprocurement.gov.in

Sd/- Chairperson and Managing Director, ADCL, Vijayawada

**డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ - విశాఖపట్నం**
గ్రౌండ్ & ఫస్ట్ ఫ్లోర్, 31-31-21, సాయిబాబా వీధి, నారాయణ భవన్, డాబా గార్డెన్స్, విశాఖపట్నం - 530 020.

**ఓ.ఎ.నెం.85/2025**

డెట్ రికవరీ ట్రిబ్యునల్ (ప్రక్రియ) రూల్స్, 1993 యొక్క సబ్-రూల్ (2ఎ)తో చదువబడే, చట్టం యొక్క సెక్షన్ 19 లోని సబ్ సెక్షన్ (4) ప్రకారం సమన్లు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (గణపవరం), ప్రాతినిధ్యం వహించువారు మేనేజర్ & అధీకృత సంతకందారు ... దరఖాస్తుదారు

మరియు

గూడే తిరుపతయ్య

టు,

**శ్రీ గూడే తిరుపతయ్య,** తండ్రి : వెంకట స్వామి, ఫ్లాట్ నెం.101, 2వ అంతస్తు, బృందావనం అపార్ట్‌మెంట్, జాస్మిన్ సౌత్ బ్లాక్, ఏటుకూరు, గుంటూరు జిల్లా - 522003. **వేరొక చిరునామా:** డి.నెం.7-83, గూడేవారిపాలెం, పెదవలపూడి, ప్రకాశం జిల్లా - 523111. ... ప్రతివాది

**పేపరు ప్రచురణ ద్వారా ప్రతివాదులకు సమన్లు**

గౌరవనీయ ప్రిసీడింగ్ ఆఫీసర్ / రిజిస్ట్రార్ వారి సమక్షమున **ఓ.ఎ.నెం.85/2025, తేది.28.05.2025న** జాబితా (లిస్టెడ్) చేయటమైనది.

రుణం **రూ.32,92,611.84** పై వసూలు కొరకు మీ పైన వేసిన దావా (ఓ.ఎ) ననుసరించి, చట్టం యొక్క 19(4) సెక్షన్ క్రింద సదరు దరఖాస్తు పైన గౌరవనీయ ట్రిబ్యునల్ సమన్లు / నోటీసు జారీ (దరఖాస్తు డాక్యుమెంట్లు కాపీలు వగైరాతో మా సమక్షమున అందచేయబడతాయి) చేయబడినది.

చట్టం యొక్క 19వ సెక్షన్ (4) వ సబ్-సెక్షన్ తదనుగుణంగా, మీరు, ప్రతివాదులు ఈ క్రింది అంశాలు గమనించవలెను:

1) సమన్లు జారీ చేసిన 30 రోజులలోగా కోరిన ఉపశమనం ఎందుకు మంజూరు చేయకూడదో కారణం చూపాలి.
2) ఒరిజినల్ దరఖాస్తు వరుస సంఖ్య 3ఎ లో సూచించిన ఎస్సెట్స్ లేదా ఆస్తులు కాకుండా ఇతర ఆస్తులు మరియు ఎస్సెట్స్ వివరాలను వెల్లడించాలి.
3) ఆస్తులు ఎటాచ్‌మెంట్ కొరకు దరఖాస్తు విచారణ మరియు డిస్పోజల్ పెండింగ్‌లో ఉన్నందున, సెక్యూర్డ్ ఎస్సెట్స్ లేదా అటువంటి ఇతర ఎస్సెట్స్ మరియు ఆస్తులు ఒరిజినల్ దరఖాస్తు వరుస సంఖ్య 3ఎ లో సూచించిన వాటితో లావాదేవీలు చేయుట లేదా విక్రయించుట నుండి మిమ్మల్ని నిరోధించడమైనది.
4) ఒరిజినల్ దరఖాస్తు వరుస సంఖ్య 3ఎ లో సూచించిన లేదా బహిరంగ పరచిన సెక్యూర్డ్‌గా ఇచ్చిన ఎస్సెట్స్ మరియు / లేదా ఇతర ఎస్సెట్స్ మరియు ఆస్తులు పైన మీరు సాధారణ వ్యాపారం మినహా, వాటిని ట్రిబ్యునల్ ముందస్తు అనుమతి లేకుండా విక్రయించుట, లీజు లేదా ఇతరత్రా లావాదేవీల ద్వారా మీరు బదిలీచేయ వీలులేదు.
5) సెక్యూర్డ్ ఆస్తులు లేదా ఇతర ఆస్తులు అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయానికి మీరు బాధ్యత వహించాలి మరియు అట్టి విక్రయ ఆదాయాన్ని సదరు ఆస్తులు సెక్యూరిటీ ఇంటరెస్ట్ కలిగియున్న బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థలు నందు నిర్వహిస్తున్న ఖాతా నందు జమ చేయవలెను.

ఇందుకు సంబంధించి లిఖిత స్టేట్‌మెంట్‌ను దాని కాపీని దరఖాస్తుదారునికి దాఖలు చేస్తూ **తేది.28.05.2025న ఉదయం 10.30 గంటలకు** ప్రిసైడింగ్ ఆఫీసర్/ రిజిస్ట్రార్ సమక్షంనకు హాజరు కావలసినదిగా కూడా మీకు సూచించడమైనది అట్లు చేయనిచో దరఖాస్తు మీ పరోక్షమున విచారించబడుతుంది మరియు నిర్ణయించబడుతుంది.

(ఇది నా స్వహస్తాలతో మరియు ట్రిబ్యునల్ ముద్రికతో 05 మే, 2025న ఇవ్వడమైనది)

సం/- అధీకృత అధికారి వారి సంతకం
సమన్లు జారీ చేయు వారు

వార్త

ధైర్యం, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఈ మూడింటితోనే చాలా మంది సామాన్యులు నాయకులైనారు.

-మహాత్మాగాంధీ

# దాయాదికి తీవ్ర హెచ్చరికలు!

భారత్‌పాక్ పరస్పర దాడుల తర్వాత ప్రధాని మోడీ జాతినుద్దేశించి చేసిన ప్రసంగం ఉగ్రవాదులకు ఒక హెచ్చరిక చేసినట్లయింది. అదే క్రమంలో ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ ఉగ్రస్థావరాలకు అన్ని హంగులు కల్పిస్తున్న దాయాదికి తీవ్ర స్థాయి హెచ్చరికలు కూడా చేసింది. పహల్గావ్ దాడి ప్రపంచాన్ని మొత్తం కుదిపేసిందని, మన మహిళల నుదుట సింధూరం దూరంచేస్తే మూల్యం ఏ స్థాయిలో ఉంటుందో కూడా చూపించామని చెపుతూనే మోడీ ఉగ్రవాదులకు, పాకిస్తాన్ పాలకులకు గట్టి హెచ్చరికలు పంపించారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా, ఎక్కడ ఉన్నా కూడా మట్టిలో కలిపేస్తామని ముందు నుంచీ చెపుతున్న మోడీ పొరుగుదేశంతో చర్చలంటూ ఉంటే కేవలం ఉగ్రవాదం, ఉగ్రవాదుల దుశ్చర్యలపైనే ఉంటాయని, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను అప్పగించిన తర్వాతనే ఏ చర్చలయినా ఉంటాయని చెపుతూ వచ్చారు. సోమవారం రాత్రి జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో కూడా మోడీ ఇచ్చిన సందేశం ఉగ్రవాదంపై మరింత స్పష్టతనిచ్చింది. కేవలం ఒక్కరాత్రిలోనే భారత సత్తాను చూసిన పాకిస్తాన్ బెంబేలెత్తిపోయిందని, అగ్రరాజ్యాలను ఆశ్రయించి ప్రాధేయపడిందని ఇదంతా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడంవల్లనే కాదా అన్న ప్రశ్నలు కురిపించారు. పాక్ స్వయంగా కాల్పుల విరమణకు వద్దామని ప్రాధేయపడితేనే అంగీకరించామన్న సంకేతాలు కూడా ఇచ్చారు. కాల్పుల విరమణ తర్వాత మరే ఇతర చిన్న సంఘటన జరిగినా కూడా కూకటివేళ్లతో ఇకపై పెకలించివేస్తామన్నారు. ఆపరేషన్ సింధూర్ అంటే ఒక పేరు కాదని, ఒక ప్రతిజ్ఞ అని అది ఎలా ఉంటుందో ఈ మూడు రోజుల దాడుల్లోనే తెలిసివచ్చేలా చేసామని, భవిష్యత్తులో దాడులుచేయాలంటే ఇకపై ఎలా ఉంటుందో పాక్ తెలుసుకోవాలన్న సంకేతాలు మోడీ ప్రసంగంలో కనిపించాయి. ఒక్కరాత్రిలోనే పాక్ గుండెలను ఎగిసి తన్నామని భయంతో, రక్షణ కోసం ప్రపంచదేశాలను ఆశ్రయించిందని కూడా గుర్తుచేసిన మోడీ ఉగ్రవాదంపై భారత్ విధివిధానాలు ఇక ఎంతమాత్రం మారబోవని తెగేసి చెప్పారు. ఇదే సంకేతాలు ఇతర ప్రపంచదేశాలకు కూడా పంపించారు. అటు చైనా అయినా ఇటు బంగ్లా దేశ్‌కు కూడా ఈ సంకేతాలు బలంగా వెళ్లాయనే చెప్పాలి. యుద్ధరంగంలో ప్రతిసారి ఓటమి చవిచూసినా పాకిస్తాన్‌కు బుద్ధిరాలేదు. ఇపుడు ఆపరేషన్ సింధూర్‌లో కూడా పలాయనం తప్పలేదు. అణ్వాయుధాలను బూచిగా చూపించి ఉగ్రవాదులను పంపిస్తామన్నా, దాడులు చేస్తామంటే ఎంతమాత్రం భారత్ ఉపేక్షించదని, భారత్ అందుకు సర్వసన్నద్ధంగా నిరంతరం ఉంటుందన్న హెచ్చరికలను మోడీ పంపించారు. ఉగ్రస్థావరాలను ధ్వంసంచేసి 100 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టామని, ఉగ్రవాదుల మృతదేహాలను చూసి పాక్ ఆర్మీ అధికారులు కన్నీళ్లు పెట్టుకున్నారంటే ఉగ్రవాదాన్ని ఆదేశం ఎంతమేర ప్రోత్సహిస్తున్నదో అవగతం అవుతోందని, ప్రపంచదేశాలు పాకిస్తాన్ వైఖరిని కూడా అర్థంచేసుకోవాలని మోడీ తన ప్రసంగంలో పిలుపునిచ్చినట్లయింది. వాస్తవానికి ఓ పక్క దాడులు జరుగుతున్నా మరోపక్క నిరంతరం డిజిఎంఒలు, త్రివిధ దళాల అధిపతులు, రక్షణమంత్రి, విదేశాంగ మంత్రులతోపాటు జాతీయభద్రతా సలహాదారులతో నిత్యం సమీక్షలు జరిపిన మోడీ ఎప్పటికప్పుడు దాడుల సమాచారాన్ని రప్పించుకున్నారు. యుద్ధతంత్రంలో అనుసరించాల్సిన వ్యూహాలు కూడా వారితో చర్చించారు. పాకిస్తాన్ వైపు నుంచి ఒక్కతూటా పేలితే మీరు క్షిపణిని పేల్చండంటూ త్రివిధ దళాలకు స్వేచ్ఛనిచ్చారు. భారత్ పాక్‌ల మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరళ్ల హాట్‌లైన్ చర్చలపరంగా అనుసరించాల్సిన వ్యూహాలను కూడా వారికి ఉద్బోధించారు. తర్వాత కూడా మోడీ అత్యున్నతస్థాయి సమీక్షలు నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణను కూడా సిద్ధంచేయాలని సూచించారు. మూడురోజులపాటు పాకిస్తాన్‌పై జరిపిన దాడుల్లో కేవలం పౌరజీవనానికి అంతరాయంలేని విధంగా లక్ష్యాలను ధ్వంసం చేసిన విధానాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. అదే క్రమంలో సరిహద్దుల్లో కాల్పులకు తెగబడటం, 26 కీలక స్థావరాలను టార్గెట్ చేసుకుని ఉపక్రమించడం వంటి చర్యలతోపాటు భారత్‌లోని విద్యాసంస్థలు, మందిరాలు, మసీదులు గురుద్వారాలపైనా పాక్‌చేసిన దాడులను దృశ్యమాధ్యమంలో కూడా ప్రపంచానికి చేరవేసేలా వ్యూహాలు అమలుచేయడం వెనుక ప్రధాని ఆలోచనే ఉందని తెలుస్తోంది. భారత్‌పై ఇప్పటి వరకూ మూడు సార్లు యుద్ధాలుచేసిన పాకిస్థాన్ ఏ ఒక్క యుద్ధంలో కూడా గెలవలేదు సరికదా తోకముడిచింది. ఇపుడు ఆపరేషన్ సింధూర్‌లో కూడా అదేతీరులో వ్యవహరించింది. ఇకపై దాడులతీరును పరికిస్తే భారత్ తన స్వదేశీ తయారీ ఆయుధ సామగ్రిని వినియోగించడం ద్వారా రక్షణరంగ వ్యవస్థలో కూడా భారత్ స్వయం సమృద్ధితో కొనసాగుతున్నదన్న సందేశంఇచ్చారు. డిఆర్డీవో రూపొందించిన ఆకాశ్ క్షిపణి అయినా ఇజ్రాయిల్ పరిజ్ఞానంతో భారత్‌లోనే తయారుచేసిన డ్రోన్లు అయినా మన రక్షణ రంగం ఇతర దేశాలకు తీసిపోదన్న భావనను కూడా కల్పించారు. ఈ క్రమంలో కాల్పుల విరమణ జరిగినప్పటికీ ఆపరేషన్ సింధూర్ ఇక్కడితో ఆగిపో లేదని చేసిన హెచ్చరికలు కూడా పాక్‌కు అనునిత్యం భయంతో వణికించేవేనని చెప్పవచ్చు. ఇకపై ఎలాంటి దాడులు జరిగినా యుద్ధచర్యలుగానే పరిగణిస్తామని, పర్యవసానాలు ఇలాగే ఉంటాయని, మోడీ తన ప్రసంగంద్వారా భారత్‌ను శాసించాలనిచూసే వారికి హెచ్చరికలు పంపించినట్లయింది.

జీవించడం వల్ల గొప్పగా ఏదీ గణనలోకి రాదు. కాని మన అల్పకాలపు జీవితంలో మనం ఏం చేశాం అన్నదే గణనలోకి వస్తుంది.



నెహ్రూ

ఒకరితో స్నేహం చేసేటప్పుడు నెమ్మదిగా ప్రారంభించాలి. స్నేహం కలిసిన తర్వాత మరెన్నడూ విడిచిపెట్టకూడదు.



సోక్రటీస్

# ప్రజావాక్కు



### డ్రాగన్ విషపు చూపు

కేవలం ఇరవై అయిదు నిముషాలలో ఆపరేషన్ సింధూర్ తొమ్మిది ఉగ్రవాదుల ప్రదేశాలలో కాల్పులు జరిపి వంద మందిని చంపామని భారత్ ప్రకటించింది. చాలా సంతోషం. ఇంకా వందలకొద్ది మిగిలే ఉన్నారని అంటున్నారు. పాకిస్తాన్ తాను తలచుకుంటే ప్రపంచాన్నే నాశనం చేయగలమని అంటున్నది. మన ప్రధాని మోడిని ఒదలిబెట్టబోమని అని ఏవేవో కారు కూతలు కూస్తున్నది. వీటిని తేలిగ్గా తీసిపారవేయక నిత్యం అప్రమత్తతను కలిగివుండాలి. దొంగదెబ్బలు తీయడంలో ఘటికురాలీ ఉగ్రదేశం. ఎన్నో అనుభవాలను చవి చూసింది మన దేశం. అలాగే డేంజరస్ డ్రాగన్ విషపు చూపుల పట్ల కూడా అహర్నిశలుజాగ్రత్తలు పాటించాలి. మన పూర్వ ప్రధాని ఇందిరా గాంధి ఈ రెండు సరిహద్దు దేశాల కదలికల్ని ఎప్పటికప్పుడు ఓ కంటితో గమనిస్తూండాలనే వారు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### ఐక్యత ముఖ్యం

తాము మాత్రమే దేశ సమస్యలను పరిష్కరించగల సమర్థులమని మరొకరికి అది చేతకాదని గొప్పలు చెప్పుకోవటం పార్టీలను, వ్యక్తులను లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేయడం రాజకీయాలు మాట్లాడటం తప్పు. దేనికైనా సమయం, సందర్భం ఉంటుంది.దేశంపై ఉగ్రదాడి జరిగినప్పుడు పార్టీ నాయకులు సంయమనం పాటించాలి. అన్ని పార్టీల వారు ఉగ్రవాద సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేయాలి.

-మిథునం, హైదరాబాద్

### పథకాలతో ప్రయోజనాలు

ఇటీవల తెలంగాణ ప్రభుత్వము తెస్తున్న రెండు పథకాలలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇది భూమి లేని నిరుపేదల పాలిట వరం. ఎందుకంటే రాజ్యగంలో ప్రస్తావించిన అధికరణ 41 ద్వారా పౌరుల పనికి హక్కును కల్పిస్తూ మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం ద్వారా పౌరులను కనీస సమయం పనిలో కచ్చితంగా భాగాస్వాములను చేస్తూ మీవెంట మేమున్నాం అనే భరోసాను కల్పిస్తుంది. మరొకవైపు వడ్డీలేని రుణాలను మహిళలకు పెద్దమొత్తంలో అందిస్తూ మహిళలలో నాయ కత్వ బాధ్యతను సమిష్టి తనాన్ని పెంచుతూ మహిళలను ఆర్థిక వ్యవస్థలో భాగాస్వాములను చేయాలి.

-భారత అవినాష్, జనగామ

### కులగణన

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని ఎప్పటి నుంచో కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతోంది. దేశంలోని ప్రతిపక్ష పార్టీలు కూడా ఇదే కోరుతూవస్తున్నాయి.ఎంత మంది కోరినా కేంద్రంలో పనిచేస్తున్నదిబిజెపి ప్రభుత్వం పట్టించుకోలేదు. కులగణన చేపట్టే ప్రయత్నాలు చేయలేదు. తమకసలు కులగణన చేపట్టే ఉద్దేశ్యమే లేనట్టు వ్యవహరించింది. అలాంటిది హఠాత్తుగా దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలనే నిర్ణయం ఎందుకు తీసుకుంది. పహల్గాం దాడి నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికా? లేక బీహార్ ఎన్నికల్లో లబ్ధి పొందడానికా? లేక మరైదానా కారణం ఉందా? అనే అనుమానాలు చాలా మందికి కలుగుతున్నాయి. ఈ నిర్ణయం ఎప్పుడో తీసుకుని ఉంటే ఎవరికి ఎలాంటి అనుమానాలు వచ్చేవి కావు.

- ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### ప్రజలు అన్ని గమనిస్తున్నారు

తెలంగాణలో కె.సి.ఆర్, ఆంధ్రలో జగన్ పదవుల్లో ఉన్నంత కాలం ఇష్టానుసారంగా ప్రవర్తించారు. ప్రజలను నానా కష్టాలు పెట్టారు. అందుకే ప్రజలు వారిని చాపలా చుట్టి మూలన పడేశారు. మోడీని హెచ్చరించి వదిలేశారు. అధికారం శాశ్వతమనుకుంటు అహాంకారం ప్రదర్శిస్తే వారికి పట్టిన గతే ప్రస్తుత పాలకులకీ పడుతుంది.

-ఎం.ఎస్.శర్మ, హైదరాబాద్

### సీనియర్లకు ఎక్కువ వేతనాలుండాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యా శాఖకు సంబంధించి మే జూన్ నెలల్లో స్కూల్స్ ప్రారంభమయ్యే నాటికి టీచర్లకు ప్రమోషన్లు ఇవ్వడానికి, ట్రాన్స్ఫర్లు చెయ్యడానికి ప్రభుత్వం సమాయత్తమవుతుంది. ఈ నేపథ్యంలో ఎవరు ప్రాతినిధ్యం వారు చేస్తూ ఉన్నారు.ప్రమోషన్లు ఇప్పుడు ప్రాతిపదిక సీనియారిటీ అవ్వాలి కానీ గత కొన్ని దశాబ్దాలుగా అలా జరగడం లేదు. ప్రమోషన్లలో రిజర్వేషన్లు, కుంటివారు గుడ్డివారు మొదలగు అంగవైకల్యం ఉన్నవారు,మనోవైకల్యం ఉన్నవారు, ఆటగాళ్లు పాటగాళ్లు అనేక రకాల చట్టాలను లోని లోపాలను అడ్డుగా పెట్టుకుని ప్రమోషన్లు పొందుతూ ఉన్నారు. తత్ఫలితంగా పాఠశాల పర్యవేక్షణ సమంగా జరగడం లేదు. ప్రమోషన్లు ప్రక్రియ ప్రారంభించినప్పుడు ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకు డైరెక్ట్ రిక్రూట్మెంట్ వాళ్ళకి పోస్టింగ్ ఇవ్వరాదు.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

# క్రమబద్ధీకరణలో నిరుద్యోగులకూ న్యాయం జరగాలి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో నియామకాలపై వైస్ ఛాన్సలర్లతో సమీక్ష నిర్వహించారని, కాంట్రాక్టు ఉద్యోగుల్ని మినహాయించి మొత్తం 1588 పోస్టుల్లో కేవలం 402 సహాయ అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయనున్నట్లు వార్తలువచ్చాయి. ఇదే జరిగితే ఏండ్ల తరబడి అధ్యాపక వృత్తిలో కొనసాగా లని ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు మరోసారి నిరాశే మిగులుతుంది. గతంలో ఆర్థికశాఖ చేత ఆమోదం పొందిన పోస్టులు కాకుండా చాలా మంది అధ్యాపకులు ఇటీవలి కాలంలో పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో మరొక సారి ఖాళీలను గుర్తించి పూర్తి స్థాయిలో యూనివ ర్సిటీ అధ్యాపకుల్ని భర్తీ చేసినపుడే బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన విద్యను అందించినట్లు అవుతుంది. యూజీసీ నుండి కూడా రావాల్సిన నిధులు సకాలంలో విడుదలయ్యే అవకాశం ఉంటుంది. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు లోబడి పారదర్శకంగా అధ్యాపకుల నియామకాలు చేపట్టాలని తెలంగాణ నిరుద్యోగ యువత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తోంది.**

డాక్టర్. అశోక్ మంద

తెలంగాణ ఉద్యమానికి ఆయువు పట్టుగా నిలిచిన యూనివర్సిటీల్లో అధ్యాపకుల భర్తీ జరిగి దాదాపు 14 ఏండ్లు గడిచింది. గత ప్రభుత్వం అధ్యాపకుల భర్తీ కోసం యూనివర్సిటీ కామన్ రిక్రూట్‌మెంట్ బిల్లు తెచ్చినా అది పలు కారణాల వల్ల కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం యూనివర్సిటీల్లో అధ్యాపకుల భర్తీ కోసం జి.వో నం.21 తీసుకువచ్చింది. ఈ జీ.ఓ. నిబంధనల ప్రకారమే నియామకాలు జరుగుతాయి. జి.వోలో వంద మార్కులకు గాను డిగ్రీ, పీజీలకు కలిపి 20 మార్కులు కేటాయిస్తూ, పీహెచ్‌డికి కేవలం పది మార్కులే కేటాయించడం, వివిధ సబ్జెక్టుల్లో జాతీయ స్థాయిలో నెట్ ఉత్తీర్ణతకు, రాష్ట్ర స్థాయిలో సెట్ ఉత్తీర్ణతకు సమానంగా మార్కులు కేటాయించడం వల్ల ఉద్యోగార్థులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి దేశవ్యాప్తంగా నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటీ టెస్ట్(నెట్)లో ఉత్తీర్ణత సాధించడం, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే స్టేట్ ఎలిజిబులిటీ టెస్ట్(సెట్)తో పోల్చితే కఠినంగా ఉంటుంది. ఇదిలా ఉంటే ఏండ్ల తరబడి అధ్యాపక పోస్టుల భర్తీ చేయకపోవడం వల్ల యూనివర్సిటీలతో పాటు వాటి అనుబంధ కళాశాలల్లో కాంట్రాక్ట్, పార్ట్ టైం అధ్యాపకులతో విద్యార్థులకి బోధించడం అనివార్యమైంది. ఇప్పుడు వాళ్లు కూడా తమకు ఉద్యోగ భద్రత కావాలంటూ, రెగ్యులరైజ్ చేయాలని ఆందోళన చేపడుతున్నారు. యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్, పార్ట్ టైం లేదా తాత్కాలిక అధ్యాపకుల క్రమబద్ధీకరణ అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 16లో పేర్కొన్న సమాన అవకాశాల సూత్రాన్ని ఉల్లంఘిస్తుంది. ఈ ఆర్టికల్ ప్రకారం ప్రతి పౌరుడికీ ప్రభుత్వ ఉద్యోగాలకు సమాన హక్కు ఉండడమే కాకుండా నియామకాలు పారదర్శకంగా, పోటీ ఆధారంగా జరగాలి. కాంట్రాక్టు లేదా తాత్కాలిక అధ్యాపకులను నేరుగా క్రమబద్ధీకరిస్తే, యూజీసీ నిబంధనల ప్రకారం నెట్/సెట్, పిహెచ్‌డి వంటి అర్హతలు సాధించిన అభ్యర్థులకు అవకాశాలు తగ్గుతాయి. తెలంగాణలో వేలాది మంది అభ్యర్థులు జే.ఆర్ ఎఫ్, నెట్ ఉత్తీర్ణతతో పాటు పిహెచ్‌డి పూర్తి చేసి యూనివర్సిటీ అధ్యాపక ఉద్యోగాల కోసం ఏండ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. ఒక వేళ క్రమబద్ధీకరణద్వారా ఈ ఖాళీలు భర్తీ అయితే ఇక నిరుద్యోగులకు మిగిలేది ఏముంటుంది?. ఆయా సబ్జెక్టుల్లో విషయ పరిజ్ఞానం, నెట్/సెట్, పీహెచ్‌డి లేని వారిని క్రమబద్ధీకరిస్తే, అది విద్యా ప్రమాణాలను తగ్గించడమే కాకుండా, అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం చేసినట్లు అవుతుంది. దీనివల్ల యూనివర్సిటీలలో బోధనా నాణ్యత కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది. క్రమబద్ధీకరణకు వ్యతిరేకంగా గతంలో హైకోర్టు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు నిరుద్యోగ యువత పక్షాన నిలిచి వారికి అనుకూలంగా ఉన్నాయి. 2024 నవంబర్‌లో తెలంగాణ హైకోర్టు, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జారీ చేసిన జివో నం.16ను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది. ఈ జివో ద్వారా విద్యాశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించింది. అయితే హైకోర్టు, ఈ ప్రక్రియ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16లకు విరుద్ధమని, సమాన అవకాశాలను హరిస్తుందని స్పష్టం చేసింది. ఈ తీర్పు యూనివర్సిటీ నియామకాలకు కూడా వర్తిస్తుంది. ఎందుకంటే యూనివర్సిటీలు కూడా ప్రభుత్వ నిధులతో నడుస్తాయి. నిమాయక ప్రక్రియ నియమ నిబంధనలు



రాజ్యాంగ మౌలిక సూత్రాలకు కట్టుబడి ఉండాలి. గతంలో సుప్రీంకోర్టు కూడా ఇలాంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు తప్పనిసరిగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ లేదా ఇతర ప్రభుత్వ నియామక సంస్థల ద్వారా పారదర్శకంగా జరగాలని ఉన్నత న్యాయస్థానాలు సూచించాయి.యూనివర్సిటీల విషయంలో, యూజీసీ నిబంధనల ప్రకారం నియామకాలు జరగాలని, ఒప్పంద, తాత్కాలిక ఉద్యోగులకు ప్రత్యేక హక్కు ఉండదని కూడా కోర్టులు వివిధ సందర్భాల్లో స్పష్టం చేశాయి. ఆయా ఉద్యోగాలకు కావాల్సిన అర్హతలు, అభ్యర్థుల మధ్య పోటీ ఆధారంగా నియామకాలను చేపట్టాలని తెలిపాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవలే అధ్యాపకుల భర్తీ కోసం తీసుకువచ్చిన జి.వో 21లో కొన్ని మార్పులు చేయాలని ఉద్యోగార్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. వారి సూచనలకు సానుకూలంగా స్పందించి యూజీసీ నిబంధనలకు అనుగుణంగా మార్పులు చేస్తే వేలాది మంది అభ్యర్థులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది. కాంట్రాక్టు లేదా తాత్కాలిక అధ్యాపకుల క్రమబద్ధీకరణ వల్ల పోరాడి సాధించుకున్న తెలంగాణ స్వరాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాల్ని పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అంతేకాకుండా, క్రమబద్ధీకరణ ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం, రాజకీయ ఒత్తిళ్లు, నిరుద్యోగ యువతలో తీవ్ర అసంతృప్తిని పెంచుతాయి. కొంతమంది పైరవీల ద్వారా కూడా గతంలో అర్హతలు లేకుండానే కాంట్రాక్టు ఉద్యోగులుగా చెలామణి అవుతున్నారనే వాదనలు కూడా ఉన్నాయి. వీటన్నిటి వల్ల నిరుద్యోగ యువత నుండి ప్రభుత్వం మీద వ్యతిరేకత వ్యక్తం అయ్యే అవకాశం ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వ యూనివర్సిటీలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడాలంటే, అత్యుత్తమ ప్రతిభావంతులైన అధ్యాపకుల్ని భర్తీ చేయాల్సి ఉంటుంది. కాంట్రాక్టు, పార్ట్ టైం అధ్యాపకుల్లో కూడా చాలామంది ప్రతిభావంతులు, అన్ని అర్హతలు కలిగిన వాళ్లు కూడా ఉన్నారు. కానీ వీరి కన్నా ఎన్నో రెట్ల మంది అభ్యర్థులు అధ్యాపక వృత్తిలో కొనసాగటానికి కావాల్సిన అన్ని అర్హతలున్నా కూడా జీవనోపాధి లేకుండా నిరుద్యోగులుగా బయట మిగిలే ఉన్నారు. వారి పరిస్థితిఅగమ్య గోచరంగా మారింది. యూనివర్సిటీ స్థాయి బోధనలో నాణ్యతా ప్రమాణాలు పెంచాలంటే పారదర్శకతతో కూడిన నియామక ప్రక్రియ ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. కాంట్రాక్టు, పార్ట్ టైం అధ్యాపకుల సేవలను గౌరవిస్తూనే, నిరుద్యోగ యువతకు న్యాయం చేయడానికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాల్ని అన్వేషించాలి. ఉదాహరణకు, కాంట్రాక్టు, పార్ట్ టైం అధ్యాపకులకు పోటీ పరీక్షల్లో వయో పరిమితి సడలింపుతోపాటు బోధనా అనుభవానికి గాను మార్కులు ఇవ్వడం ద్వారా వారికి అవకాశం కల్పించవచ్చు. ఈ మధ్యే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో నియామకాలపై వైస్ ఛాన్సలర్లతో సమీక్ష నిర్వహించారని, కాంట్రాక్టు ఉద్యోగుల్ని మినహాయించి మొత్తం 1588 పోస్టుల్లో కేవలం 402 సహాయ అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయనున్నట్లు వార్తలువచ్చాయి. ఇదే జరిగితే ఏండ్ల తరబడి అధ్యాపక వృత్తిలో కొనసాగాలని ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు మరోసారి నిరాశే మిగులుతుంది. గతంలో ఆర్థికశాఖ చేత ఆమోదం పొందిన పోస్టులు కాకుండా చాలా మంది అధ్యాపకులు ఇటీవలి కాలంలో పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో మరొక సారి ఖాళీలను గుర్తించి పూర్తి స్థాయిలో యూనివర్సిటీ అధ్యాపకుల్ని భర్తీ చేసినపుడే బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన విద్యను అందించినట్లు అవుతుంది. యూజీసీ నుండి కూడా రావాల్సిన నిధులు సకాలంలో విడుదలయ్యే అవకాశం ఉంటుంది. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు లోబడి పారదర్శకంగా అధ్యాపకుల నియామకాలు చేపట్టాలని తెలంగాణ నిరుద్యోగ యువత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తోంది. •

# శాంతి చర్చలు సఫలమయ్యేనా?

కనుమ ఎల్లారెడ్డి

దాదాపు మూడు సంవత్సరాలకు పైగా జరుగుతున్న రష్యా, ఉక్రెన్ యుద్ధంలో ఇరుదేశాలు నష్టపోయాయి. కాకపోతే ఉక్రెన్‌కు భారీ నష్టం సంభవించింది. యుద్ధ నిర్వహణలో రెండు దేశాల సైనిక వ్యవస్థ పలు సమస్యలు ఎదుర్కొన్నాయి. యుద్ధవీరుల లక్ష్యం కూడా శాంతిని కోరు కోవడమే. ఈ దిశలో టర్కీ రాజధాని ఇస్తాంబుల్‌లో టర్కీ అధ్యక్షుడు ఎర్దోగాన్ రెండు దేశాలను సమన్వయ పరచి చర్చలు ప్రారంభిస్తారు. ఈ చర్చలకు పుతిన్, జెలెన్ స్కి ఒప్పుకోవడం ముదావహం. ఈ గురువారం నుంచి ఇస్తాం బుల్‌లో చర్చలు మొదలవుతాయి. మేం మానవతా దృక్ప థంతో వ్యవహరిస్తున్నాం. అందుకే ఈస్టర్ డే, విక్టరీ డే సందర్భంగా కాల్పుల విరమణ పాటించి తమ పారదర్శకత నిరూపించుకున్నాం అని పుతిన్ వ్యాఖ్యణించారు. కాని దురదృష్టం ఉక్రెన్ వీటిని పెడ చెవిన పెట్టిందని పుతిన్ వాపోయారు. అయినా సమర్థవంతంగా ఉక్రెన్ దాడులను అడ్డుకున్నామని పుతిన్ చెప్పారు. ఇప్పుడు రష్యా ప్రకటించిన శాంతి చర్చలకు సిద్ధం అని జెలెన్స్కి వ్యాఖ్యానించడం అతనికి యుద్ధంపై గల నష్టం తెలిసి వచ్చినట్లుంది.యుద్ధం ద్వారా అశాంతే రగులుతుందని, అభివృద్ధి కుంటు పడుతుందని అటు జెలెన్ స్కికి ఇటు పుతిన్‌కు తెలియడం గమనార్హం. ఇరు దేశాలు పట్టు విడుపులకు,మాటల పంతాలకు పోక శాంతిని కాంక్షించాలి. రష్యా, ఉక్రెన్ యుద్ధం ముగింపుకు విశ్వం అంతా ఎదురుచూస్తోంది. దానికిమొదటి అడుగు కాల్పుల విరమణ. రెండు దేశాలు కాల్పుల విరమణకు చర్యలు తీసుకోవాలి. అందుకు ఉక్రెన్ అంగీకరించడం, సోమవారం నుంచి మొదలయ్యే ముప్పై రోజుల కాల్పుల విరమణకు రెండు దేశాలు సంసిద్ధత వ్యక్తం చేశాయి. ఒక వేళ ఉల్లంఘిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ఉల్లం ఘిస్తే ఆంక్షలు విధిస్తాం అని బ్రిటన్ వెల్లడి చేయగా, పలు వురు ఐరోపా నాయకులు కూడా కాల్పుల విరమణే శాంతి ని ప్రొది చేస్తుందని వక్కాణించారు. ఇప్పుడు బంతి రెండు దేశాల మధ్య ఉంది. శాంతా, యుద్ధామా అనేది రష్యా, ఉక్రెన్ దేశాలు నిర్ధారించుకోవాలి.అంది వచ్చిన అవకాశాన్ని ఎవరు వదులుకోకూడదు. యుద్ధం ఆగాలని టర్కీ చేస్తున్న రాయబారం ఫలించాలని, ఇస్తాంబుల్‌లో శాంతి చర్చలు ఫలించాలని కోరుకుందాం. ఈ దిశలో రష్యా, ఉక్రెన్ దేశాలు కూడా శాంతికి ప్రాముఖ్యత ఇవ్వడం శుభ పరిణామం. మూడు ఏళ్లకు పైగా సాగుతున్న యుద్ధంలో ముఖ్యంగా పౌరులు, వారి బంధువులు నష్టపోయారు. రెండు దేశాలలో పసి పిల్లలు, గర్భిణీస్త్రీలు మరణించారు, వారు ఎదుర్కొన్న అవస్థలు వర్ణించలేం. యుద్ధం ఎప్పుడు ఆగునా అని ఎదురు చూస్తున్నారు. రెండు దేశాలకు పర్యాటకులు రాక పోవడంతో ఆదాయం కూడా గణనీయంగా తగ్గి పోయింది. యుద్ధ నష్టం పూడ్చుకోవటంతోనే సరిపోయింది. అనేక చారిత్రక కట్టడాలు, సుందర భవనాలు నేల మట్టం కావడం దురదృష్టం. ఈ విపత్కర పరిస్థితులు చూసే టర్కీ ముందుకు వచ్చి రెండు దేశాల అధ్యక్షులతో చర్చించి

# సోషల్ మీడియా వేదికగా అమరావతిపై మరో కుట్ర?

అన్నవరపు బ్రహ్మయ్య

అధికారం కోల్పోయినప్పటికీ వైఎస్ఆర్ నేతలు ప్రజలను భయపెట్టే విధంగా మాట్లాడుతూనే వున్నారు. అయినా ప్రధాన మంత్రి పర్యటన అనంతరం వైఎస్ఆర్‌సిపి నాయకుల వ్యాఖ్యాలను, మాటలను ప్రజలు అవాకులు చవాకులుగానే భావిస్తున్నారు. మరల ఏదో రకంగా అమరావతిపై, అధికార తెలుగుదేశం పార్టీపై సోషల్ మీడియా వేదికగా కుట్రపన్నుతున్నారు. ఉదాహరణకి విశాఖపట్నంలో ఉర్సా సంస్థకు ఎకరం 50నుంచి కోటి రూపాయల వంతున స్థలం కేటాయిస్తే 99 పైసలకే ఎకరం కేటాయించినట్టు అభూతకల్పనలు ప్రచారం చేశారు. ఒక మతప్రచారకుడు మద్యం మత్తులో రోడ్డు ప్రమాదంలో మరణిస్తే దానిని హత్యగా ప్రచారం చేస్తున్నారు. ముంబాయి నటి కాడంబరి జత్వాని కేసులో అరెస్టు అయినా పోలీసు ఉన్నతాధికారి అడ్డుపెట్టుకొని కులపరమైన విద్వేషాలు ప్రచారం చేసే పనిలో వున్నారు. నటి జత్వానిపై ఫిబ్రవరి 2వ తేదీన ఉదయం 6.30 గంటలకు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత కేవలం అర గంటకే అంటే 7 గంటలకు పోలీసులు విమానంలో ముంబాయి బయలు దేరి వెళ్లారు. కేసు బుక్ చేసిన అరగంట ముంబాయి వెళ్లడం ఒక వింత అయితే, ఫిబ్రవరి 2వ తేదీన నమోదు చేసిన కేసు నిమిత్తం జనవరినెలలో విమాన టిక్కెట్లు బుక్ చేయడం మరో వింత. ఈఅంశాల గురించి వివరణ ఇవ్వ కుండా పిఎస్ఆర్ ఆంజనేయులు సత్యసంధుడు అంటూ అరెస్టును కులపరమైన విషయంగా ప్రచారం చేయడానికి సిద్ధం అయ్యారు. అమరావతి వరదలకు మునిగిపోయిందని, అమరావతి ప్రాంత భూములు నిర్మాణాలకు పనికి రావంటూ అవాకులు చవాకులు పేలుతున్నారు. తాజాగా తెలంగాణ నుంచి విడిపోయిన సమయంలో కూడా ఆంధ్ర లో నూతన రాజధాని ప్రాంతం నిర్ణయంకోసం ఏర్పాటు చేసిన కమిషన్ ఎంపిక చేసిన అయిదు ప్రాంతాలలో విజయవాడగుంటూరు ప్రాంతం కూడా వుంది. ప్రధాన మంత్రి మోడీ అమరావతి పనుల పునః ప్రారంభించిన అనంతరం రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్పార్టీ నేతల తీరు చూస్తుంటే మూడు రాజధానుల భ్రమనుంచి బయటకు వస్తున్నట్టు కనిపించడం లేదు.నాడు అధికారంలో వుండగా సజ్జల రామకృష్ణారెడ్డి నిర్వహించిన పాత్రను నేడు అంబటి రాంబాబు నిర్వహిస్తున్నారు. అమరావతి అభివృద్ధికి వైఎస్ ఆర్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తే నాడు ప్రతిపక్షంలో వున్న తెలుగుదేశంపార్టీ అడ్డుపడింది అంటూ ప్రధాన మంత్రి పర్య టన అనంతరం అంబటి మాట్లాడిన తీరుతో ప్రజలు విస్తు పోతున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలో వున్న అయిదు సంవత్సరాలు చంద్రబాబు నిర్మించిన సచివాలయ భవనాల నుంచి పరిపాలన సాగించిన బొత్స సత్యనారాయణ, అంబటిరాంబాబు, గుడివాడ గుర్నాథం వంటి మంత్రులు అమరావతిలో భవనాలు ఎక్కడ వున్నాయి. అంతా స్మశానమే అని వ్యాఖ్యానించిన నేతలు, తాము అధికారంలో వుండగా అమరావతి అభివృద్ధికి కృషి చేశామనని చెప్పడం చూస్తుంటే నవ్విపోదురుగాక నాకేమి సిగ్గు అన్నట్టువుంది. రాష్ట్ర విభజన అనంతరం తొలివిడతలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు



నాయుడు ఆ సమయంలో ఎన్డీఎ కూటమిలో సభ్యునిగా లేకపోయినప్పటికీ దేశప్రధాన మంత్రిని గౌరవించాలనే మర్యాదతో మోడీతో అమరావతి పనులకు శంకుస్థాపన చేయించడమే కాకుండా ఆనాటి సభకు తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరును కూడా ఆహ్వానించారు. రెండో విడత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున అధికారంలోకి వచ్చిన జగన్మోహనరెడ్డి అమరావతికి ద్రోహం చేస్తూ మూడు రాజధానుల ప్రతిపాదన ముందుకు తెచ్చా రు. అమరావతికి భూమిలిచ్చిన రైతులుచేసిన తిరుగులేని పోరాటం, న్యాయపరమైన అభ్యంతరాల నేపథ్యంలో జగన్మోహనరెడ్డి అమరావతి అభివృద్ధికి తట్టెడు మట్టికూడా వేయకపోగా ప్రారంభానికి సిద్ధంగావున్న అనేక భవనాలను పాడుపెట్టారు. మూడో విడత తెలుగుదేశం,బిజెపి,జనసేన పార్టీలతో కూడిన ఎన్డీఎ కూటమి అధికారంలోకి వచ్చింది. కూటమిలో భాగస్వామిగా వున్న బిజెపి కేంద్రంలో అధికారంలో వున్న నేపథ్యంలో అందిస్తున్న సహకారంతో రాజధాని అమరావతి మరల ఊపిరిపోసుకోవడం ప్రారంభమైంది. మే 2వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్రమోడీ రూ.64,721 కోట్ల రూపాయల అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమ రావతికి అవుటర్ రింగ్ రోడ్, మెట్రో రైల్వే, అమరావతితో జాతీయ రోడ్డుల అనుసంధానం, అమరావతి నూతన రైల్వే లైను ఏర్పాటు వంటి అనేక అభివృద్ధిపనులకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. అమరావతి అభివృద్ధికి ఇంత పెద్దమొత్తం నిధులను సమీకరించడంలో సహకరించిన ప్రధాన మంత్రి మోడీ చేత పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయించడాన్ని కూడా రాజకీయం చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. నిజానికి రాజధాని అమరావతి (విజయవాడ, గుం టూరు)పై కుట్ర ఈనాటిది కాదని చెప్పవచ్చు. 1953లో మద్రాసు రాష్ట్రం నుంచి వేరుపడి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన సమయంలో కూడా ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు ప్రకటన వెలువడిన తర్వాత సాంకేతిక అంశాలను నిర్ణయించడానికిభారత ప్రభుత్వం నాడు రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వున్న కె.ఎన్. వాంఛను నియమించింది. మద్రాసు నుంచి విడిపోయి కొత్తగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు తొలిగా రాజధానిగా విజయవాడనే నిర్ణయించారు. కాని, రాజధాని విజయవాడలో ఏర్పాటు చేయడం వల్ల ఒక సామాజిక వర్గం ప్రాబల్యం పెరిగి వారు ఆర్థికంగా స్థిరపడతారనే కారణంతో పాటు కమ్యూనిస్టులు బలపడతారనే ప్రచారంకూడా చేశారు.రాయలసీమకు చెందిన ఆనాటి నాయకులుకర్నూలులో రాజధాని ఏర్పాటు చేయాలని పట్టుపట్టారు. మద్రాసు నుంచి విడిపోయి కొత్తగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు ముందుగా నిర్ణయించినట్టుగా విజయవాడ కాకుండా కర్నూలులో ఏర్పాటు చేయడంలో వివిధ రాజకీయకారణాలతో పాటు సామాజికవర్గాల రాజకీయపోరు కూడా వుందనినాడు పలుపత్రికల్లో వార్తాకథనాలువచ్చాయి. రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధానిగా అమరావతి ఎంపికకు అసెంబ్లీ సాక్షిగా మద్దతు పలికారు.రాజధాని పరిధిలోని ఉండవల్లిలో ఇల్లు నిర్మించు కున్నానంటూ ఎన్నికల వేళ జగన్మోహనరెడ్డి మోసపూరిత మాటలను నమ్మిప్రజలు అధికారం కట్టపెట్టారు. ఏరుదాటేవ రకు ఓడమల్లన్న ఏరుదాటిన తర్వాత బోడిమల్లన్న అన్న రీతిలో జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే రాజధాని ఒక రియల్ ఎస్టేట్‌అని లేనిపోని సాకులు చెబుతూ మూడురాజధానులు అంటూ మాటమార్చారు. అమరావతి కోసం ఉద్యమం నిర్వహించిన రైతులు, ప్రధానంగా మహిళలను అధికార బలంతో అణచివేయాలని చూశారు.చివరకు రాజధాని కోసం భూములు ఇచ్చిన ఎస్సిల రైతులపై ఎస్‌సి, ఎసిటి అట్రా సిటీకి పెట్టారు. చూసిన నేతలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో సాధారణ, తటస్థ ప్రజలు ఆపార్టీ నేతల చేష్టలు, మాటలకు,భీతిచెందారు. ఆ కారణంగా చంద్రబాబు ఏమిస్తారు, ఏమిచేస్తారు అని కాకుండా రాజ ధాని నిలిస్తే

# సీతారామయ్యను అభినందించిన కమ్మసేవా సంఘం

**ఒంగోలు, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కామేపల్లి సీతారామయ్య జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా ఘనంగా అభినందించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సీతారామయ్య మాట్లాడుతూ మిత్రులందరి సహకారంతో బ్యాంకును అభివృద్ధి చేస్తానని, రాష్ట్రంలో ఉత్తమ బ్యాంకుగా నిలుపుతానని అన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కమ్మవారి సేవా సమాఖ్య ట్రస్ట్ చైర్మన్ మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ రైతుబిడ్డకు దక్కిన గౌరవం అని, సీతారామయ్య హయాంలో రైతులకు విస్తృతంగా సేవలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అలా హనుమంతరావు, చిడిపోతు వెంకటేశ్వర్లు, కాట్రగడ్డ రఘుపతి రావు,పాటిబండ్ల వెంకటేశ్వర్లు, పోతినేని శ్రీనివాస రావు, గోగినేని శ్రీనివాసరావు, మోటుపల్లి వెంకటేశ్వర్లు చౌదరి, మ్నన్న సుబ్బారావు, గోగినేని కిషోర్,నంబూరి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు



**మంత్రి డోలా శుభాకాంక్షలు తెలిపిన సీతారామయ్య..**

తూర్పు నాయుడుపాలెంలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామిని నూతన పిడీసీసీబీ చైర్మన్ సీతారామయ్య మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# మూగ జీవాల పట్ల కరుణ చూపాలి - కంది రవిశంకర్

**ఒంగోలు టౌన్, మే 12, ప్రభాతవార్త**



సీజర్ రెస్కూ స్ప్ర అండ్ కేర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డు కాలనీలో మూగ జీవాల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెలు ఏర్పాటు కార్యక్రమాన్ని జనసేన నేత కంది రవిశంకర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండు వేసవిలో త్రాగునీటికై మూగ జీవాలు అలమటించకుండా నీటి తొట్టెలు ఏర్పాటు చేయడం స్ఫూర్తి_దాయకమని, మనుషులతో ప్రేమతో మెలిగే మూగ జీవాల పట్ల కరుణ చూపాలని, మహోన్నత సేవా కార్యక్రమం చేపట్టిన జంతు ప్రేమికులు జగన్నాథం విష్ణువర్ధన్ అభినందనీయుడన్నారు. కార్యక్రమంలో హెల్ప్ ఫర్ యానిమల్స్ సొసైటీ అధ్యక్షులు సికందర్, టి.అరుణ, బీరం అరుణ, హరిశంకర్, ప్రభుకుమారి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంక్ ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం

**ఒంగోలు టౌన్, మే 12, ప్రభాతవార్త**



కార్పొరేషన్ బ్యాంక్‌లో క్యాషియర్‌గా పనిచేసిన మెడబలిమి బ్రహ్మయ్య వయోభారంతో మరణించగా కుటుంబ సభ్యులను ప్రకాశం జిల్లా బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ నేతలు పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా సంఘ ప్రధాన కార్యదర్శి పికె రాజేశ్వరరావు మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా బ్రహ్మయ్య సేవలు అందించారని, కమ్యూనికేషన్, కంప్యూటర్ టెక్నాలజీ లేని రోజుల్లో ఉద్యోగులు ఎంతో కష్టపడ్డారని, అందువల్లనే బ్యాంకింగ్ వ్యవస్థ పటిష్టంగా వుందని, ఇదే స్ఫూర్తితో నేటితరం మెలుగుతూ ఉన్నత స్థానాలు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నేతలు సిబి రావు, యువి రత్నం, చిడితోటి శోభన్ తదితరులు పాల్గొన్నారు.

# మౌళిక వసతులు కల్పించాలి - సిటిజన్ ఫోరమ్ డిమాండ్

**ఒంగోలు టౌన్, మే 12, ప్రభాతవార్త**



దశాబ్దకాలంగా రాజీవ్‌నగర్‌లో ఇళ్ల నిర్మాణం పెరిగినా మౌలిక వసతులు లేక జనం ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షానికే నీరు నిలిచి పోవడం వలన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఇదే విషయమై సిటిజన్స్ ఫోరమ్ అధ్యక్షులు కొల్లా మధు మీడియాతో మాట్లాడుతూ రోడ్లు, డ్రైన్‌ల నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేను కోరగా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారని, ఐదు మాసాలు దాటినా పనులు ప్రారంభం కాకపోవడం అందరిని నిరాశ పరిచిందన్నారు. ఏడాదిలో నగర పాలక సంస్థ ఎన్నిలు ఉన్నందున అధికారులు అప్రమత్తం కావాలన్నారు. పనులు చేపట్టకుంటే ప్రజలకు ఇబ్బందులు, ప్రభుత్వానికి చెడ్డపేరు అని గుర్తెరగాలన్నారు.

# రక్తదానం చేయండి..ప్రాణదాతలు కండి

**ఒంగోలు టౌన్, మే 12, ప్రభాతవార్త**



స్థానికంగా ప్రైవేట్ హాస్పిటల్‌లో గర్భాశయ సమస్యతో శస్త్రచికిత్స నిమిత్తం పేషెంట్‌కు రక్తం అవసరం కాగా బిజెపి నేత ధనిశెట్టి రాము నాయుడు స్వచ్ఛంధంగా ముందుకు వచ్చారు. రక్తదానం అనంతరం రాము నాయుడు మీడియాతో మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు సకాలంలో సేవలు అందుతుండటం మంచి పరిణామం అన్నారు. 14వ పర్యాయం రక్తదానం చేశానని, ప్రజా సేవలో ఎంతో సంతృప్తి ఉందన్నారు. రక్తదాన కార్యక్రమాలలో యువత ఉత్సాహంగా పాల్గొని ప్రజలకు బాసటగా నిలవాలన్నారు.

# నిధుల బకాయిల విడుదలపై హర్షం

**ఒంగోలు టౌన్, మే 12, ప్రభాతవార్త**




నిధుల బకాయిల విడుదలపై సిహెచ్‌ఓలు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట వారు మీడియాతో మాట్లాడుతూ సమస్యలపై ఉద్యమిస్తున్న తమకు నర్సెస్ డే బహుమానంగా ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నట్లు భావిస్తున్నామని, ఇందుకు గాను రాష్ట్ర ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. వేతన సవరణ, పిఎఫ్ అంశాలపై సానుకూల స్పందన ఆశిస్తున్నామని, ప్రజలకు వైద్య సేవలు అందించడానికి అంకితభావంతో ఉన్నామన్నారు.

# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# స్టార్టప్, ఐపి మేనేజ్‌మెంట్‌పై వర్క్‌షాప్

**ఒంగోలు టౌన్, మే 12, ప్రభాతవార్త**



క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో స్టార్టప్, ఐపి మేనేజ్‌మెంట్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఐటి అసిస్టెంట్ ప్రొఫెసర్ సందీప్ తన ప్రసంగంలో స్టార్టప్ ప్రారంభించడం, సక్సెస్ సాధించడం, ఐపి మేనేజ్‌మెంట్ గురించి సోదాహరణంగా వివరించారు. కార్యక్రమాన్ని హెచ్ఓడి డాక్టర్ మౌళిచంద్ర, కోఆర్డినేటర్స్ శివనాగరాజు, డాక్టర్ ధరణి పర్యవేక్షించారు.

# ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పేదలకు సక్రమంగా అందించాలి

**- జిల్లా సమీక్ష మండలి సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఆనం, డోలా, కలెక్టర్, జడ్పీ చైర్మన్ బూచేపల్లి, ఎంపి మాగుంట, ఎమ్మెల్యేలు**





**ఒంగోలు, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం అములు చేస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులైన పేద వర్గాల ప్రజలకు సమగ్రంగా అందించడంతో పాటు ప్రకాశం జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో సమగ్రమైన ప్రణాళికలతో పని చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా సమీక్ష మండలి సమావేశం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ, డ్రింకింగ్ వాటర్, పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన, పీజీఆర్ఎస్ తదితర అంశాలపై క్షుణ్ణంగా సమీక్షించి ఆయా కార్యక్రమాల అమలులో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారానికి ఇన్‌ఛార్జ్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, అధికారులకు దిశా నిర్ధేశం చేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, శాసనమండలి సభ్యులు తూమాటి మాధవరావు, ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, దర్శి, యర్రగొండపాలెం, ఎస్ఎన్‌పాడు, కందుకూరు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్‌రావు, కందుల నారాయణరెడ్డి, డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, టి.చంద్రశేఖర్, బీఎన్ విజయ్‌కుమార్, ఇంటూరి నాగేశ్వరరావు, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, ఏపీ స్టేట్ అగ్రికల్చర్ మిషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఏపీ మాల వెల్ఫేర్ కోఆపరేటీవ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పి.విజయకుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, వే.పాలెం, దర్శి నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లు ఎరిక్షన్‌బాబు, డాక్టర్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లా నీటి యాజమాన్య సంస్థ, డ్రింకింగ్ వాటర్, పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన, పీజీఆర్ఎస్ తదితర శాఖల ద్వారా అమలు జరుగుతున్న కార్యక్రమాల అమలులో క్షేత్ర స్థాయిలో ఉన్నటువంటి సమస్యలపై పూర్తిగా అవగాహన కల్పించుకొని కూలంకుషంగా చర్చించడంతో పాటు ఆ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యంతప్రాధాన్యత ఇస్తుందన్నారు. తొలుత ఉపాధి హామీ పథకం ద్వారా అమలు జరుగుతున్న పనుల పోరోగతిపై చర్చించడం జరిగిందని, ఉపాధి లేని పేద వర్గాల ప్రజలకు ఉపాధి హామీ పథకం ద్వారా ఖచ్చితంగా ఉపాధి కల్పించడంతో పాటు జరుగుతున్న పనులు సత్వరం పూర్తి చేసేలా అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. ఎక్కడా ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడరాదని, రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, అందుకనుగుణంగా వేసవిలో సురక్షిత తాగునీటి సరఫరాపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలోని 17 మండలాల్లో కరువు ఉందని, అధికారులు నివేదికలు ఇచ్చారని, ఆ ప్రాంతాలతో పాటు జిల్లాలోని మిగతా ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి సమగ్రమైన ప్రణాళికతో జిల్లా యంత్రాంగం మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి నాయకత్వంతో ముందుకు సాగాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజలందరికి రక్షిత మంచినీరు అందించేందుకు ఏఏ గ్రామాల్లో రక్షిత తాగునీటి పథకాలకు మరమ్మత్తులు చేయించాల్సి ఉంది. అందుకవసరమైన నిధుల లభ్యత, తదితర వివరాలతో వెంటనే ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. జలజీవన్ మిషన్ కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చినటువంటి ఒక వరమని, గడిచిన 5 సంవత్సరాల కాలంలో జలజీవన్ మిషన్ కార్యక్రమం కింద పనులు చేపట్టలేదని, రాష్ట్ర ప్రభుత్వం నుండి రాష్ట్ర గ్రాంటు నిధులు మంజూరు చేయకపోవడంతో చాలా పనులు ఆగిపోయాయని, జలజీవన్ మిషన్ కార్యక్రమం ఈ సంవత్సరం ముగింపు దవకు వచ్చే పరిస్థితుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రత్యేకంగా చొరువ తీసుకుని జలజీవన్ మిషన్ పథకాన్ని రాష్ట్రంలో మరో రెండేళ్లు పొడిగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ, ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ఈ పథకంను రాష్ట్రంలో 2028 వరకు పొడిగించడం జరుగుతుందని ప్రధాన మంత్రి హామీ ఇవ్వడం జరిగిందని ఆనం వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికి కుళాయి ద్వారా తాగునీరు ఇవ్వాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని, అందులో భాగంగానే జలజీవన్ మిషన్ కార్యక్రమాన్ని గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. కరువు పీడిత ప్రాంతంగా ఉన్నటువంటి ప్రకాశం జిల్లాలో తాగునీటి పథకాలను మరింత వేగవంతం చేయడానికి కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. సంక్షేమ ఫలాలు పేద వర్గాల ప్రజలకు, మధ్యతరగతి రైతు కుటుంబాలకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లాలో నెలకొని ఉన్న పొగాకు రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ఈ రోజు పొగాకు బోర్డు అధికారులతో పొగాకు రైతులతో మాట్లాడటం జరుగుతుందని మంత్రి తెలిపారు. రైతులకు అండగా ఉంటూ వారి ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. పట్టణ, నగర ప్రాంతాలలో నిర్ధకమైన ఖాళీగా ఉన్నటువంటి స్థలాలను అభివృద్ధి చేయుటకు ఏ విధమైన ప్రాజెక్ట్స్ పెడితే వనరులు సమకూరుతాయన్న అంశంపై ఒంగోలు పార్లమెంటు సభ్యులు వారు నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ ఎన్‌బీసీసీ అనే సంస్థ తీసుకురావడం జరిగిందని, ఆ సంస్థ వారు వివరాలను కూడా వివరించడం జరిగిందని, ఈ విషయాన్ని సమగ్రంగా పరిశీలన చేయాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వ సహకారం కూడా ఉంటుందని మంత్రి తెలిపారు.

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు చర్చించిన అంశాలను పూర్తి చేసేలా కృషి చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల తాగునీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు జిల్లాలో ఫారం పాండ్స్ నిర్మాణాలు పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు తెలిపారు. మూగ జీవాలకు కూడా తాగునీటిని అందించే లక్ష్యంతో ఉపాధి హామీ పథకం కింద పశువుల నీటి తొట్టెల నిర్మాణాలను జిల్లాలో చేపట్టినట్లు మంత్రి తెలిపారు.
- జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో పంచ ప్రధాన్యాత కింద ఉపాధి హామీ పథకం పనులు మ్మురంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు చర్చించిన అంశాలను పరిగణలోకి తీసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.
- ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు ఉపాధి హామీ పనులు క్షేత్ర స్థాయిలో పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. పట్టణ నగర ప్రాంతాలలో ఖాళీగా ఉన్నటువంటి స్థలాలను అభివృద్ధి చేయుటకు నేషనల్ బిల్డింగ్ కనస్ట్రక్షన్ కార్పొరేషన్ వారిచే పరిశీలన చేయించడం జరుగుతుందని తెలిపారు.











# ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడిఉంది

**- జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఒంగోలులో నూతనంగా నిర్మించిన దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమీషనర్ వారి కార్యాలయంను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డితో కలిసి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ దాదాపు కోటి రూపాయల ఖర్చుతో భవన నిర్మాణం చేయడం జరిగిందన్నారు. ప్రతి జిల్లాలో ఒక దేవాదాయ శాఖ కార్యాలయం ప్రారంభం చేయాలనేది కూటమి ప్రభుత్వం యొక్క నిర్ణయం అన్నారు. దేవాదాయ శాఖకు సంబంధించి సొంత భవనం ప్రతి జిల్లాలో ఉండాలనేది చంద్రబాబునాయుడు నిర్ణయం అని అన్నారు. ఈ మధ్యలోనే నెల్లూరులో ఒక కార్యాలయం ప్రారంభించడం జరిగిందన్నారు.త్వరలో తిరుపతి జిల్లాలో రీజనల్ జాయింట్ కమీషనర్ కార్యాలయం, అసిస్టెంట్ కమీషనర్ కార్యాలయం కూడా ప్రారంభం జరగబోతుందన్నారు. మా కూటమి ప్రభుత్వం వచ్చిన పది మాసాలలో దేవాదాయ శాఖకు సంబంధించి ఎన్నికల హామీల్లో ప్రకటించిన దాదాపు హామీలు నెరవేర్చడం జరిగిందన్నారు. దూపదీప నైవేద్యాల కింద గత ప్రభుత్వ హయాంలో రూ.5వేలు ఉంటే నెలకు మా కూటమి ప్రభుత్వంలో దాదాపు రూ.5,600లు దేవాలయాలకు నెలకు పదివేల రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు. మరొక 300 ఆలయాలకు ప్రతిపాదనలకు వచ్చాయి. వాటికి కూడా పరిశీలిస్తున్నా మన్నారు. సీజీఎఫ్ పథకం కింద ఆలయాల పునరుద్ధరణ కొరకు విధులు మంజూరు ప్రక్రియ కూడా కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ నియోజకవర్గాలు, శాసనసభ నియోజకవర్గాల నుంచి వచ్చినటువంటి వినతులను క్షుణ్ణంగా పరిశీలించి ఆలయాల అభివృద్ధికి, ధూప దీప నైవేద్యాలకు నిధులు మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రాంతాల వారీగా మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్‌ను పరిగణలోకి తీసుకొని నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి సంవత్సరం దాదాపు 100 కోట్ల రూపాయలు ఆలయాల నిర్మాణం కోసం పునరుద్ధరణ కోసం కేటాయించడం జరుగుతుందన్నారు. వేదపండితులకు ఎన్నికల హామీల్లో ప్రకటించినట్లుగా సంభవన కింద ఒక్కొక్కరికి రూ.3వేలు క్రింద మూడు సంవత్సరాలు పాటు ఇచ్చేందుకు ప్రభుత్వం చొరువ తీసుకుంది, ఆ ప్రక్రియ గత నెలలోనే ప్రారంభమైందన్నారు. ఆలయాల్లో ఉన్న అర్చకులకు రూ.15వేల రూపా



యలు, ఆలయాల్లో పని చేసే నాయి బ్రాహ్మణులకు రూ.20వేల రూపాయలు ఇచ్చేందుకు ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేశామన్నారు. రాష్ట్రంలో ప్రధాన దేవాలయాలలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారన్నారు. దేవాదాయ శాఖలో ప్రక్షాళన ప్రారంభమైందన్నారు. పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఆలయంలో చెట్లు కూడా నాటించేందుకు అధికారులను ఆదేశించామన్నారు. ఆలయంలో జరిగే ప్రతి కార్యక్రమం కూడా ఆగమపండితుల నిర్ణయం ప్రకారమే జరుగుతోందన్నారు. దేవాదాయ శాఖ అధికారులకు జోక్యం లేకుండా స్వామివారి నిత్య కార్యక్రమాలలో ఆగమపండితులదే తుది నిర్ణయం అంటూ ఆదేశాలు జారీ చేశామన్నారు.

**ఏపీ ప్రజలకు గుడ్ న్యూస్.. ఆ ఛార్జీల పెంపుపై**

# మంత్రి కీలక ప్రకటన

**ఒంగోలు, ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లాలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించారు. అక్కడ పలు అభివృద్ధి కార్యక్రాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెంపుపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. కూటమి ప్రభుత్వానికి విద్యుత్ ఛార్జీలు పెంచే ఆలోచన లేదని, విద్యుత్ ఛార్జీలను పెంచకూడదనే విషయంలో మా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. యాక్సిస్ గ్రూప్ ఫీల్డ్ ఎనర్జీ విషయంలో ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో పాలకులు విద్యుత్ వ్యవస్థను దుర్వినియోగం చేశారని ఆయన ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులను శుభ్రం చేయడానికే తమకు సమయం సరిపోతుందని ఆయన అన్నారు. గత ప్రభుత్వం విద్యుత్ శాఖను ఆదాయ వనరుగా వాడకుందని ఆయన ఆరోపించారు. యాక్సిస్ ఎనర్జీ యూనిట్‌కు రూ.5.12లకు గత ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ ఒప్పందాన్ని సవరించి రూ.4.60లకే యూనిట్ విద్యుత్ సరఫరా చేసేలా ఒప్పందం చేసుకున్నామని ఆయన అన్నారు. ప్రజలపై ఎక్కువ భారం పడకుండా.. వారికి తక్కువ ధరకే విద్యుత్‌ను అందించాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.రాయలసీమ, ప్రకాశం జిల్లాలో రెన్యువబుల్ ఎనర్జీకి పెద్దపీట వేశామని మంత్రి అన్నారు. రాయలసీమ ప్రాంతం రెన్యువబుల్ ఎనర్జీకి అనుకూలంగా ఉంటే ప్రాంతం అని.. 2014-19లో రెనోవబుల్ ఎనర్జీ ద్వారా 7వేల మెగావాట్ల ఉత్పత్తిని చేసి చూపించామని ఆయన తెలిపారు. తప్పు చేసిన వారికి రెడ్‌బుక్ వర్తిస్తుందని వారు ఖచ్చితంగా శిక్షను అనుభవిస్తారని ఆయన అన్నారు. ఇది ప్రజల ప్రభుత్వమని, ప్రజలు స్వేచ్ఛగా తిరగాలనే కారణంగానే ఎవరిని ఇబ్బంది పెట్టడం లేదని మంత్రి గొట్టిపాటి అన్నారు.

## మారుతీ భవన్ అభివృద్ధికి కన్నెబోయిన వారి విరాళం



**అద్దంకి , మే 12, ప్రభాతవార్త**

ముని ్సపల్ వైస్ చైర్మన్ కన్నెబోయిన అనంతలక్ష్మి వీరయ్య దంపతులు సింగరకొండలోని మారుతీ భవన్ అభివృద్ధికి ఎసి,గీజర్. మంచం,లను ఆలయ ఎసి తిమ్మనాయుడుకు అందజేశారు.

## రాతిముఖమండపానికి సందిరెడ్డి వారి విరాళం



**అద్దంకి , మే 12 ప్రభాతవార్త**

ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన సింగరకొండ లోనిశ్రీ ప్రసన్నాంజనేయస్వామి రాతి ముఖ మండపానికి పిడిసిసి బ్యాంకు మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్,ధర్మపత్ని భారతిలు కీ॥శే॥ సందిరెడ్డి హనుమంతరావు, మెల్లంపూడి లక్ష్మయ్య వారి జ్ఞాపకార్థం రు.1.00,116లు ఆలయ ఎసి తిమ్మనాయుడుకు అందజేశారు.

## ముఖమండపానికి నేరెళ్ళ వారి విరాళం



**అద్దంకి , మే 12 ,ప్రభాతవార్త**

ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి రాతి ముఖమండప నిర్మాణానికి అద్దంకికి చెందిన నేరెళ్ళ సుబ్బారావు జ్ఞాపకార్థం వారి కుమారుడు, కుమార్తెలు నేరెళ్ళ వెంకటశేషగిరి, శ్రీనివాసరావు, వెంకట సుజాత, శశికళలురు.1.01,116లు ఆలయఎసి తిమ్మ నాయుడుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు చుండూరి మురళీ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మీనరసింహాస్వామికి వెండి కలిశ చెంబు బహుకరణ



**అద్దంకి , మే 12 ప్రభాతవార్త**

సింగరకొండపై వేంచేసియున్న శ్రీలక్ష్మీనరసింహా స్వామి వారికి కోనంకికి చెందిన ఉప్పలపాటి శారద సుబ్బారావులు 206 గ్రాముల వెండితో తయారు చేసిన కళశ చంబును ఆలయ అధికారులకు అందజేశారు. దీని విలువ రు.22,500లు వుంటుదని అంచనా.

## పలువురిని పరామర్శించిన మంత్రి గొట్టిపాటి



**కొరిశపాడు ,మే 12, ప్రభాతవార్త**

మండలంలోని కుర్రవానిపాలెం గ్రామంలో వజ్జా సీతారామయ్య, నాదెండ్ల వెంకటరత్నంలు ఇటీవల మృతిచెందగా వారి వారి నివాస గృహాలకు వెళ్ళి మృతుల కుటుంబసభ్యులను విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు.

## మాజీ సర్పంచ్‌కి మంత్రి గొట్టిపాటి పరామర్శ



**జె.పంగులూరు , మే 12, ప్రభాతవార్త**

రామకూరు గ్రామ మాజీ సర్పంచ్ మానం సుబ్బారావు అనారోగ్యంతో వుండగా, సోమవారం విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ వారి గృహానికి వెళ్ళి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని పరామర్శించారు.

## అద్దంకిలో వైద్యశాలను ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి



**అద్దంకి , మే 12, ప్రభాతవార్త**

అద్దంకి పట్టణంలోని శ్రీనగర్‌లో డాక్టర్ వేణుగోపాలరెడ్డి, డాక్టర్ సుస్మితల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆర్థో, స్కిన్, ట్రామా కేర్, వైద్యశాలను సోమవారం విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించి, వారికి ఆయన తన ఆశీస్సులను అందజేశారు.

## రోటరీ ట్రెజరర్‌కు వివాహా వార్షికోత్సవ శుభాకాంక్షలు



**అద్దంకి ,మే 12, ప్రభాతవార్త**

రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ కోశాధికారి మలాది శ్రీనివాసరావు 48వ వివాహ వార్షికోత్సవ పురస్కరించుకొని వేలమూరిపాడు రోడ్డులో గల పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఏర్పాటు చేసే పార్కులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు చప్పిడి వీరయ్య, చుండూరి మురళీ సుధాకరరావు, మహమ్మద్ రఫీ, డాక్టర్ ఫణీంద్రబాబు, ఊటుకూరు రామకోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధువరులకు మంత్రి గొట్టిపాటి శుభాకాంక్షలు



**అద్దంకి , మే 12, ప్రభాతవార్త**

పట్టణంలోని 19వ వార్డు దామావారిపాలెంలో విక్కుర్తి కొండలరావు కుమార్తె వివాహం ఇటీవల జరుగగా, సోమవారం విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ వారి నివాసానికి వెళ్ళి నూతన వధువరులను ఆశ్వీరదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# నేడు పొదిలిలో విద్యుత్ అదాలత్

**పొదిలి(కొనకనమిట్ల), మే 12, ప్రభాతవార్త**

పొదిలిలో ఈనెల 13న ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు విద్యుత్ అదాలత్ జరుగుతుందని దర్శి ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్(ఆపరేషన్) పి.శ్రీనివాసులు తెలిపారు. కన్జూమర్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ ఫోరం విజయవాడ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానియేల్, ఫారం సభ్యులు ఒంగోలు ఆపరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కే.వెంకటేశ్వర్లు, విద్యుత్ అధికారులు పాల్గొంటారన్నారు. దర్శి డివిజన్లోని పొదిలి, దర్శి, దొనకొండ, కొనకనమిట్ల, మర్రిపూడి, తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు తదితర మండలాల విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను రాత పూర్వకంగా తెలియజేయాలన్నారు. సర్వీస్ కనెక్షన్, పూర్తి అడ్రస్, సెల్ నెంబర్ తో అర్జీ ఇవ్వాలన్నారు. అందులో విద్యుత్ అంతరాయాలు హెచ్చుతగ్గులు, మీటర్ సమస్యలు, బిల్లుల సమస్యలు,విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఏ సమస్యనైనా ఈ సమావేశంలో తెలియజేయాలన్నారు. సమావేశంలో నమోదు చేసుకున్న సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## ఘనంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు జన్మదిన వేడుకలు



**కురిచేడు, మే 12, ప్రభాతవార్త**

స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ శ్రేణులు సోమవారం నాడు ఘనంగా జరిపారు. మండల పార్టీ అధ్యక్షులు పిడతల నెమిలయ్య ఆధ్వర్యంలోఈ కార్యక్రమం జరిగింది. కేక్ కట్ చేసి తమ పార్టీ అధ్యక్షునకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు కాట్రాజు నాగరాజు, నాయకులు గడ్డం బాలయ్య, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ మొఘల్‌మస్తాన్‌వలి, దాసరి ఏడుకొండలు,డిష్ వెంకటేశ్వర్లు, పెద్దిరెడ్డి,ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మిన్నెకల్లులలో లక్ష్మిశెట్టి వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న పానెం చిన్న హనిమిరెడ్డి



**సంతమాగులూరు ,మే 12 ,ప్రభాతవార్త**

సంతమాగులూరు మండలం మిన్నెకల్లు గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన లక్ష్మిశెట్టి వారి వివాహ వేడుకల్లో అద్దంకి వైసీపీ ఇన్‌చార్జి పానెం చిన్న హనిమిరెడ్డి స్తానిక నాయకులతో కలసి పాల్గొన్నారు. నూతన వధూవరులు అనిల్‌కుమార్, అనంత మహలక్ష్మిలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో హనిమిరెడ్డితో పాటు జడ్పీటీసీ అడవిశ్రీనివాసరావు, మండల వైసీపీ అద్యక్షులు ఊట్లనాగేశ్వరరావు, కారసాని వెంకటకోట్టిరెడ్డి, బండి కోట్టిరెడ్డి,ఓగెబొయిన వీరయ్య,యర్రంరెడ్డి బ్రహ్మరెడ్డి,అంకిరెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమితులైన ఆలపాటి సురేష్‌కు అభినందనల వెల్లువ

**- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి కృతజ్ఞతలు**





**సంతమాగులూరు ,మే 12, ప్రభాతవార్త**

ఆంద్రప్రదేశ్ సీ.రాఘవాచారి ప్రెస్‌అకాడమీ చైర్మన్‌గా నియిమితులైన ఆలపాటి సురేష్ కు ఏపీయూడబ్ల్యుజే నుండి అభినందనల వెల్లువ కొనసాగుతుంది. ఆలపాటి సురేష్ మెదటినుండి ఏపీయూడబ్ల్యుజే లో కొనసాగుతుండటంతో పాటు ఏజెచూ జాతీయ కార్యవర్గ సభ్యులు గా కూడా ప్రస్తుతం ఉన్నారు. సీనియర్ జర్నలిస్ట పోరాట యోదుడు అయిన ఆలపాటి సేరేష్‌ను ప్రెస్ అకాడమీ చైర్మన్ గా ఎంపికచేసిన ముఖ్యంత్రి నారాచంద్రబాబునాయుడును కూడా కలం కార్మికులు కమృతజ్ఞతలు తెలిపారు.అభినందనలు ,కృతజ క్షతలు తెలిపినవారు ఏపీయూడబ్ల్యుజే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అద్యక్షులు ఐ వీ సుబ్బారావు, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అద్యక్షులు శివ, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర ఉపాద్యక్షులు సేరేష్ కుమార్ రెడ్డి, బాపట్ల జిల్లా అద్యక్షులు చెన్నుపాటి రాంబాబు, గుంటూరు జిల్లా అద్యక్షులు ఎస్ ఎన్ మీరా,ఉమ్మడి ప్రకాశం జిల్లా మాజీ ఉపాద్యక్షులు బలుపునూరి కృష్ణారెడ్డి,బాపట్ల జిల్లా ఏపీయూడబ్ల్యుజే కార్యవర్గ సభ్యులు, సంతమాగులూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కంచర్ల సుబ్బారావు, సంతమాగులూరు ప్రెస్ క్లబ్ కార్యవర్గం కార్యదర్శి షేక్ కాలేషాగారి వలి, సహయ కార్యదర్శి నాగూర్, కోశాధికారి మొగిలిసుబ్బారావు,ఒర్సు కొండలు, బాలాంజనేయులు,ఖాదర్‌మస్తాన్,శేషు,వినోద్ , సీనియర్ పాత్రికేయులు అంగలకుదిటి కోటేశ్వరరావు, బి.వెంగళరెడ్డి,నెల్లూరి ఆశోక్ కుమార్ తదితరులు ఉన్నారు.

## పారిశ్రామిక ఫీడర్‌కు నూతన వీసీబీ ఏర్పాటు

**- మంత్రి రవికుమార్ చొరువతో సమస్యకు శాశ్వత పరిష్కారం**



**బల్లికురవ, మే 12, ప్రభాతవార్త**

బల్లికురవ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో పారిశ్రామిక ఫీడర్‌కు రూ.30లక్షల రూపాయలు వెచ్చించి నూతన వీసీబీ ఏర్పాటు చేయడంతో పాటు నాలుగు కిలో మీటర్ల పొడవున ప్రత్యేక విద్యుత్ లైను ఏర్పాటు చేశారు. సుదీర్ఘ కాలంగా లోఓల్టేజి సమస్యలతో పారిశ్రామిక రంగాల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతే కాకుండా ఈదురు గాలులు, వర్షపు జల్లులు వచ్చిన ప్రతిసారి పారిశ్రామిక ఫీడర్‌తో కలిసి టౌన్ ఫీడర్ ఉండటంతో బల్లికురవ మండల కేంద్రానికి కూడా తరచూ లోఓల్టేజి సమస్య విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయాలు ఏర్పడేవి. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరువతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ లైనుకు అద్దంకి ఈఈ మస్తాన్‌రావు సోమవారం సాయంత్రం విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసరావు, బల్లికురవ, మార్టూరు విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలి



**మార్టూరు, మే 12, ప్రభాతవార్త**

ఏబీపీపీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర అధ్యక్షులు శంకరాచారి అన్నారు. ఏబీపీపీ బాపట్ల జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం సాయంత్రం మార్టూరులోని ఘటేశ్వర స్వామి దేవాలయంలో జరిగింది. ముఖ్య అతిధిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షులు శంకరాచారి మాట్లాడుతూ ఏబీపీపీ మార్టూరు శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారని అదే విధంగా బాపట్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈనెల 19వ తేదీన సింగరకొండ పుణ్య క్షేత్రంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో మహా కుంభాభిషేకం జరగనున్నదని ఈ సందర్భంగా 108 పుణ్య క్షేత్రాలు నుండి దేశంలోని అన్ని జీవనదుల నుండి సేకరించిన జలంతో 108 మంది పుణ్యస్త్రీలు 108 కళాశాలతో ప్రదర్శన చేసి దేవాలయ సంప్రోక్షణ ఉంటుందని పుణ్యస్త్రీల కళాశాల ప్రదర్శనకు సంబంధించి బాధ్యతను దేవాదాయ శాఖ అధికారులు ఏబీపీపీకి కేటాయించడం జరిగిందని కనుక సభ్యులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలన్నారు. అదే విధంగా ఆ రోజు ఏబీవీపీ ఆధ్వర్యంలో తాగునీరు, మజ్జిగ పంపిణీ జరుగుతుందని దాతలు సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీపీపీ బాపట్ల జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, ట్రెజరర్ కే.సత్తిబాబు, టి.శ్రీకాంత్, ఏబీపీపీ మార్టూరు అధ్యక్షులు ఏన్‌వి రామారావు, ఉపాధ్యక్షులు ఆత్మకూరి రామచంద్రరరావు, కార్యదర్శి టి.శ్రీనివాసరావు, ఎం.అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## గార్లపాటి మహాలక్ష్మమ్మకు మంత్రి గొట్టిపాటి ఘన నివాళి





**అద్దంకి ,మే 12, ప్రభాతవార్త**

భాస్కర్ సప్లైయర్స్ అధినేత గార్లపాటి శ్రీనివాసరావు మాతృమూర్తి మహాలక్ష్మమ్మ ఇటీవల మృతిచెందారు. సోమవారం విద్యుత్‌శాఖమంత్రి గొటి ్టపాటి రవికుమార్ మహాలక్ష్మమ్మ రెండవ కుమారుడు గార్లపాటి కృష్ణమూర్తి నివాసానికి వెళ్ళి ఆమె చిత్రపటానికి మంత్రి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మహాలక్ష్మమ్మ కుమారులైన గార్లపాటి శ్రీనివాసరావు, గార్లపాటి కృష్ణమూర్తిలను మంత్రి పరామర్శించారు. మంత్రి వెంట అద్దంకి పట్టణానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులతోపాటు, టిడిపి ముఖ్యనాయకులు, కార్యకర్తలు వున్నారు.

## హెడ్ కానిస్టేబుల్ వెంకట సుబ్బారెడ్డి మృతి



**త్రిపురాంతకం, మే 12 ప్రభాతవార్త**

మండలంలోని పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జి వెంకట సుబ్బారెడ్డి (60) గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడు సుబ్బారెడ్డి స్వస్థలం పెద్దారవీడు మండలం శివాపురం గ్రామం. ఇతను పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో 1991లో జాయిన్ అయ్యి అప్పటి నుంచి డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తూ ఉన్నారు. ఈ సందర్భంగా డిపార్ట్‌మెంట్ వారు మాట్లాడుతూ సుబ్బారెడ్డి విధులపట్ల అంకితభావంతో పనిచేసేవారని ఆయన డిపార్ట్‌మెంట్‌కు చేసిన సేవలు కొనియాడారు.

## ప్రసన్నాంజనేయస్వామికి లక్ష తమలపాకుల పూజ



**అద్దంకి , మే 12, ప్రభాతవార్త**

ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామికి విశాఖ నక్షత్రం సోమవారం వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని లక్ష తమలపాకుల పూజా కార్యక్రమం అత్యంతవైభవంగా జరిగింది. ఈ పూజా కార్యక్రమాలు గుంటూరుకు చెందిన న్యూ మార్నింగ్‌స్టార్ ట్రావెల్ యజమానులు పొనకాల శ్రీనివాసరావు, యశోద దంపతులు నిర్వహించారు. పూజాలు అనంతరం వేదపండితులు, అర్చకులు, ఉభయదాతలకు, భక్తులకు ఆశ్వీరచనాలను, తీర్ధ ప్రసాదాలను అందజేశారు. ఈ పూజలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పేద విద్యార్ధికి ల్యాప్‌టాప్ బహుకరణ



**మార్కాపురం రూరల్, మే 12, ప్రభాతవార్త**

పట్టణానికి చెందిన శ్రీ అమలక లక్ష్మీనారాయణ స్వామి వికాస తరంగిణి మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ మార్కాపురం శాఖ ఆధ్వర్యంలో ఓ పేద విద్యార్థికి సోమవారం రూ.40వేల విలువగల నూతన లాప్‌టాప్‌ను బహుకరించారు. నంద్యాల జిల్లా సిరివెళ్ల మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఎస్ పవన్ కుమార్ ఇంజనీరింగ్‌రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఆర్థికంగా ఇబ్బంది పడుతూ విషయాన్ని వారి దృష్టికి తీసుకురాగా ఆ విద్యార్ధికి తమవంతు సహకారాన్ని అందించారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణారెడ్డి, కనకదుర్గ, జీవనజ్యోతి, చెన్నారెడ్డి, జి వరలక్ష్మి, సుబ్బారెడ్డి, రామకృష్ణ తదితరులు సహకారం అందించిన వారిలో ఉన్నారు.

## ఏపి లైవ్ స్టాక్ ఏజెన్సీ చైర్మన్‌గా షేక్ రియాజ్



**మార్కాపురం రూరల్, మే 12, ప్రభాతవార్త**

ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు షేక్ రియాజ్ ఆంధ్రప్రదేశ్ లైవ్ స్టాక్ ఏజెన్సీ చైర్మన్‌గా నియమితులైనట్లు జనసేన పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మంగళగిరి నందు రియాజ్‌ను సోమవారం పలువురు జిల్లా జనసేన పార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కలిసిన వారిలో ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాధిక్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాయబ్ కమాల్, ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ ఇస్మాయిల్ బేగ్, షేక్ ఖాదర్ జహీర్,(హల్చల్)లు ఉన్నారు. వారు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

## మైనార్టీ కార్పోరేషన్ రుణాలు పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానం

**- ఎంపిడిఓ వెంకటరామిరెడ్డి**



**రాచర్ల, మే 12 ,ప్రభాతవార్త**

మైనార్టీ కార్పోరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు పొందేందుకు అర్హత కలిగిన ముస్లిం మైనారిటీ సభ్యుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మండల ఎంపిడిఓ సూరె వెంకటరామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముస్లిం మైనారిటీలు, మైనారిటీ కార్పోరేషన్ ద్వారా సబ్సిడి రుణాలు పొందేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, కాబట్టి సభ్యులు మీ యొక్క ఆధార్ కార్డు, బియ్యం కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు మరియు మీయొక్క సెల్ నెంబర్ తీసుకొని మీసేవా కేంద్రాలకు వెళ్లి ఆన్‌లైన్ ద్వారా ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకునే సభ్యులు 21సంవత్సరాల వయసు నుండి 55సంవత్సరాల లోపు కలవారై ఉండాలన్నారు. స్లాబ్ -1, లక్షరూపాయల వరకు, స్లాబ్ -2 లక్షరూపాయల నుండి మూడు లక్షల వరకు, స్లాబ్ -3 మూడు లక్షల నుండి 5లక్షల వరకు రుణాలు పొందేందుకు అవకాశం ఉందని అర్హతగల ముస్లిం మైనారిటి సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఘనంగా బుద్ధ భగవానుడి జయంతి వేడుకలు



**గిద్దలూరు, మే 12 ,ప్రభాతవార్త**

ప్రకాశంజిల్లా గిద్దలూరు పట్టణం లోని శ్రీశ్రీ భగవాన్ కాశిరెడ్డి నాయన ఆశ్రమం నందు గాయత్రి మాత ఆలయం ఆవరణము నందు పౌర్ణమి సందర్భంగా గాయత్రి మాత యజ్ఞం నిర్వహించడం జరిగింది. అదేవిధంగా బుద్ధ భగవానుడి జయంతివేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం వేమన తపోవనం వ్యవస్థాపకులు పూనూరు హనుమంతారెడ్డి పాల్గొని మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు శాక్య వంశపు రాజరికానికి దూరంగా ఉంటూ 29సంవత్సరముల వయసులో ఇంటిని వదిలిపెట్టి సన్యాసము స్వీకరించి సత్యాన్వేషణకై బోధి వృక్షము క్రింద కూర్చుని 49రోజులు కఠోరమైన ధ్యానము చేసి జ్ఞానము పొంది జ్ఞానాన్ని అందరికి పంచాలనే ఉద్దేశంతో అష్టాంగ మార్గాలను బోధించారు. వాటి ద్వారా మానవుడు ధర్మ మార్గాన్ని అనుసరిస్తూ వన్యప్రాణుల యందుభూతదయ కలిగి ఉండి జీవహింస చేయకూడదని,నీతి నిజాయితీ, ఆప్యాయత లను కలిగి ఉండి జ్ఞానసాధనకు కృషిచేసే శాంతి ఓర్పు ద్వారా జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని బోదించారు. ఆయన బోధించిన జ్ఞానాన్ని ధర్మచక్ర ప్రవర్తన అంటారని హనుమంతారెడ్డి తెలిపారు. పాల్గొన్న భక్తులకు వేమన తపోవనం వారు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వంగల ప్రసూన అమ్మయ్య, ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ యోగా టీచర్ బిఎస్ నారాయణ రెడ్డి, సంఘ సేవకులు, ప్రధమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్‌వారు విశ్రాంత లెక్చరర్ వడ్డె వీరారెడ్డి, విశ్రాంత సూపరింటెండెంట్ పాలుగుళ్ళ కాశిరెడ్డి, బైరెడ్డి బాలిరెడ్డి,హెల్త్ అధికారి దుగ్గా రాజశేఖర్ రెడ్డి,లెక్చరర్ పంటశివమల్లారెడ్డి,ఎన్‌టివి విలేకరికాశిరెడ్డి, గాయత్రిమాత భక్తులు పాల్గొన్నారు.

## విధులకు వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురైన ఏఆర్ కానిస్టేబుల్ తిరుపతిరెడ్డి



**కంభం రూరల్, మే 12 ,ప్రభాతవార్త**

మండలంలోని తురిమెళ్ళ గ్రామం నుండి కంభం గ్రామానికి వాహనాల తనిఖీలో భాగంగా విధులకు వెళ్తున్న ఏఆర్ కానిస్టేబుల్ మాదిరెడ్డి తిరుపతిరెడ్డి మార్గమధ్యలోని పోరుమామిళ్ళపల్లె గ్రామ సమీపంలోని మూలమలుపువద్ద రోడ్డు ప్రమాదానికి గురైన సంఘటన సోమవారం ఉదయం 5గంటల సమయంలో జరిగింది. స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇవ్వడంతో 108సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడు తిరుపతి రెడ్డిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుండి గుంటూరుకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# 14న ఎంఎన్ఎం డిగ్రీ కాలేజీలో మెగా జాబ్ మేళా

**కనిగిరి, మే 12, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలోని జీసీ అండ్ వైపీ అండ్ డిగ్రీ కాలేజీ(ఎంఎన్ఎం) ఈనెల 14వ తేదీ బుధవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడ, శ్రీ సిటీలోని ప్రముఖ బ్లూ స్టార్ కంపెనీలో పనిచేయుటకు అధిక సంఖ్యలో పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ డిప్లమో చేసిన యువతీ, యువకులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు టీసీ, మార్కు లిస్టు, ఆధార్ కార్డు, రెండు ఫొటోలు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ తీసుకొని ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. ఇంటర్వ్యూలో పాసై ఉద్యోగం సాధించిన అభ్యర్థులకు ప్రతి నెల 17వేల జీతం, పీఎఫ్, ఈఎస్ఐ, క్యాంటీన్, బస్సు సౌకర్యం ఉంటుందని తెలిపారు. కావున నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఉద్యోగాలు సాధించాలని కోరారు. సమాచారం కోసం 970309973, 9494642286, 8008822821 నంబర్లను సంప్రదించాలన్నారు.

# పోలీసుల దురుసు ప్రవర్తనపై వైసీపీ ఎస్సీ విభాగం నిరసన

## - మహిళలపై దౌర్జన్యాలపై సీఎం బాధ్యత వహించాలి

## - కటికల వెంకటరత్నం




**కనిగిరి, మే 12, ప్రభాతవార్త**

రాష్ట్రంలో మహిళల పట్ల పోలీసులు చూపుతున్న అనుచిత ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తూ, వైఎస్సార్ కాంగ్రెసన పార్టీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం కనిగిరిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు, కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణయాదవ్ ఆదేశాల మేరకు ఒంగోలు బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర ఎస్సీ విభాగం కార్యదర్శి కటికల వెంకటరత్నం మాట్లాడుతూ తాడికొండ మండలంలోని కంతేరు గ్రామానికి చెందిన దళిత మహిల వలపర్ల కల్పనను అర్ధరాత్రి అరెస్టు చేయడం అన్యాయం అని, ఆమె వినమ్రంగా నైటీ మార్చుకుని వస్తానని చెప్పినా పోలీసులు వినకుండా అరెస్టు చేయడం దారుణం అని అన్నారు. వైస్ చైర్మన్ పులి శాంతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నుంచి వైసీపీకి చెందిన మహిళా నాయకులపై పోలీసుల దురుసు పెరిగిపోతుంది. సభ్యసమాజం తలదించుకునే ఘటనలు జరుగుతున్నాయి. మాజీ మంత్రి విడదల రజిని పట్ల సీఐ సుబ్బనాయుడు ప్రవర్తించిన తీరుకు మహిళా లోకమే సిగ్గుపడే స్థితి నెలకొంది అని తీవ్రంగా విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమంలో గూడూరి అనిల్ కుమార్, మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్ గఫార్, సూరసాని మోహన్‌రెడ్డి, సైకం ఏడుకొండలురెడ్డి, షకీలా, రాజేశ్వరి, బక్క భాగ్యరాజు, ముక్కు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ, పోలీసు వ్యవస్థపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# మాలకొండయ్యకు ఘనంగా నివాళులర్పించిన దారపనేని



**కనిగిరి, మే 12, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు పంచాయతీ పోతవరం గ్రామ టీడీపీ నాయకులు, ఒంగోలు వెంగమాంబ ఆటో ఫైనాన్స్ అధినేత చెనికల మాలకొండయ్య (చిన్నోడు) ఆకస్మిక మృతి పట్ల కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మాలకొండయ్య మృతి తీరని లోటు అని మాలకొండయ్యకు దారపనేని ఘనంగా నివాళులర్పించారు. మాలకొండయ్య సతీమణి, కుమారుడు మనోహర్‌కు దారపనేని మనోధైర్యం కల్పించారు. టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు మోరబోయిన గంగరాజు యాదవ్, గిద్దయ్య యాదవ్, మోపాడు నీటి సంఘం చైర్మన్ నరసింహారావు యాదవ్, మోహన్‌రావు యాదవ్, కొండయ్య యాదవ్, తూర్పు కోడిగుడ్లపాడు మాజీ ఎంపీటీసీ చెనికల పెద్దమాలకొండయ్య, చిన్న మాలకొండయ్య, కొండయ్య(కరణం) నాగేశ్వరరావు, శ్రీనివాసులు, మానం మల్లిఖార్జునరావు, తిరివీధి కేశవులు(కర్నూలు) ఖాజా, గోళ్ళ రమణయ్య(వైజాగ్), నూతలపాటి బాలయ్య, మానం నాగమల్లేశ్వరరావు, తోడేందుల వెంకటేశ్వర్లు, చెనికల నాగయ్య, సుధాకర్‌రెడ్డి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైసీపీ కార్యకర్తలకు దద్దాల నారాయణ యాదవ్ నివాళి

## - రూ.50 వేలు ఆర్థిక సహాయం



**కనిగిరి, మే 12, ప్రభాతవార్త**

కనిగిరి మండలం బడుగులేరు పంచాయతీకి చెందిన పట్టాభిరామపురం ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మర్రి అనోక్, పాలిపోగు పోలయ్య శనివారం పొగాకుబోర్డు సమీపంలో జరిగిన దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. ఒక కారు బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ వార్త తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కనిగిరి ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్ మృతుల భౌతికకాయాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. తాను ఎల్లప్పుడూ వారి కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు చెరో రూ.25వేలు చొప్పున మొత్తం రూ.50వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ విషాద సమయంలో మీరు ధైర్యంగా ఉండాలి. పార్టీ మీకు తోడుగా ఉంటుందని వారికి ధైర్యం చెప్పారు. అనోక్, పోలయ్య పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అనేక మంది స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు. ముఖ్యంగా ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, పాపనబోయిన కోటమ్మ(ఎంపీటీసీ), పాపనబోయిన నాగేశ్వరరావు, సైకం ఏడుకొండలురెడ్డి, ఆవుల తిరుపతిరెడ్డి(ఏటీఆర్), మర్రి స్టీఫెన్, బొజ్జా ఇసాక్, కొమ్మల యోసులు, మర్రి డేవిడ్, పాలిపోగు ఏసుదాసు, పాలిపోగు ఆరోను, మర్రి యోహాను, బలసాని నవయ్య, బొబ్బూరి పోలయ్య, మేకల వెంకటేశ్వర్లు, మోర రామిరెడ్డి, మోర వెంకటేశ్వర్లు, బత్తుల బాల గురవయ్య, రాచకుంట్ల ఆంజనేయులు, రాచకుంట్ల సుబ్బయ్య, రాచకుంట్ల చిన్న గురవయ్య, కాకర్ల వెంకటేశ్వర్లు, మర్రిబోయిన తిమ్మయ్య, ఈర్ల శ్రీను, కంటూ కేశవ తదితరులు ఉన్నారు.

# మురళి నాయక్ సంతాప సభ



**పొన్నలూరు, మే 12, ప్రభాతవార్త**

స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద సోమవారం ఆర్ఎస్ఎస్ పొన్నలూరు శాఖ ఆధ్వర్యంలో మురళి నాయక్ సంతాప కార్యక్రమం నిర్వహించారు. దేశ రక్షణలో భాగంగా ఆపరేషన్ సింధూరిలో రాష్ట్రానికి చెందిన జవాన్ మురళి నాయక్‌ను కోల్పోవడం అత్యంత బాధాకరమని, దేశం కోసం తన ప్రాణాలను అర్పించి అమరవీరుడైన శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలోని గోరంట్ల మండలానికి చెందిన మురళి నాయక్ ఆత్మకి శాంతి కలగాలని సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పొన్నలూరు పంచాయతీ సెక్రటరీ ఎం.నారాయణ, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## డీసీఎంఎస్ చైర్మన్ శ్యామలకు అభినందనలు తెలిపిన వెలిగండ్ల పాత్రికేయులు



**వెలిగండ్ల, మే 12, ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా డీసీఎంఎస్ చైర్మన్‌గా నియమితులైన మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు శ్యామల కాశిరెడ్డిని సోమవారం కనిగిరిలోని శ్యామల కాశిరెడ్డి క్యాంపు కార్యాలయంలో వెలిగండ్ల మండలానికి చెందిన పాత్రికేయులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. శ్యామలను కలిసిన వారిలో పాత్రికేయులు షేక్ మస్తాన్ షరీఫ్, కనియంపటి మధు, పందిటి మోహన్, అన్నపురెడ్డి కృష్ణారెడ్డి, చిలంకూరి నాగార్జునరెడ్డి ఉన్నారు.

## దద్దాలను మర్యాదపూర్వకంగా కలిసిన

# జిల్లా వైసీపీ లీగల్ సెల్ ప్రెసిడెంట్ నగరకంటి



**కనిగిరి, మే 12, ప్రభాతవార్త**

వైసీపీ ప్రకాశం జిల్లా వైసీపీ లీగల్ సెల్ ప్రెసిడెంట్ నగరకంటి శ్రీనివాసులు, లాయర్ నరసారెడ్డి సోమవారం కనిగిరి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణయాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి పూలబొకే అందజేశారు. అనంతరం నియోజకవర్గంలో లీగల్ సెల్ కమిటీల నియామకాలపై పలు విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణయాదవ్, లాయర్ నరసారెడ్డి, నగర కంటి శ్రీనివాసులని దుశ్శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రన వాలంటరీ సేవాదళ్ జనరల్ సెక్రటరీ ఆవుల భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డిపల్లి వైసీపీ నాయకులు సైకం ఏడుకొండలు రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజా సేవలో పోలీసు కానిస్టేబుల్ సురేష్






**మద్దిపాడు, మే 12, ప్రభాతవార్త**

శాంతి భద్రతల పరిరక్షణ కాకుండా ప్రజలతో స్నేహభావంతోటి మెలగాలని పోలీసు ఉన్నత అధికారులు అనేక సందర్భాల్లో పోలీసు శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయడమైంది. మద్దిపాడు పోలీసు కానిస్టేబుల్ సురేష్ ఒక అడుగు ముందుకు వేసి ప్రజలకు సేవ చేయాలనే దృఢ సంకల్పంతో సోమవారం నాడు వీలు నిర్వహించడం జరిగింది. మండల పరిధిలోనే ఏడుగుండ్లపాడు గ్రామ సమీపంలో శ్రీహర్షిణి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభోత్సవానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి వర్యులు గొట్టిపాటి రవికుమార్ కాన్వాయ్ వచ్చే క్రమంలో కష్టాలు సెంటర్ వద్ద విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బసవన్నపాలెం గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు అనారోగ్య కారణంగా కొష్టాలు సెంటర్లోనే ఆర్ఎంపీ డాక్టర్ వద్దకు వెళ్లే క్రమంలో జాతీయ రహదారిని క్రాస్ చేసి వెళ్ళవలసిన పరిస్థితి. రోడ్డు దాటే క్రమంలో వృద్ధుడు ఇబ్బంది పడుతున్నట్లు గమనించిన మద్దిపాడు పోలీసు స్టేషన్ పని చేస్తున్న కానిస్టేబుల్ జి.సురేష్ జాతీయ రహదారి అవతల వైపుకు జాగ్రత్తగా తీసుకెళ్లి వదిలిపెట్టారు. ఇది గమనించిన కొష్టాల సెంటర్లో ఉన్న ప్రజానీకం పోలీసులు చేస్తున్నటువంటి సేవను గుర్తించి పలువురు అభినందించారు.

# శ్రీపట్టాభిరామస్వామి వారికి భూమి వితరణ



**హనుమంతునిపాడు, మే 12, ప్రభాతవార్త**

మండల పరిధిలోని చిన్న ముప్పళ్లపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీ మాలపల్లెలో వెలసిన శ్రీ పట్టాభిరామస్వామి వారి దేవస్థానమునకు కి.శే దమ్ము పెద్ద చెన్నయ్య ధర్మపత్ని అచ్చమ్మ మనువడు కి.శేదమ్ము చెన్నరాయుడు జ్ఞాపకార్థం దమ్ము కొండయ్య సతీమణి అనసూయమ్మ 7 1/2 సెంటు భూమి దానం చేశారు. ఈ కార్యక్రమంలో శిలాఫలకాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు వెలిగండ్ల మండలం జంగం నరసయ్యపల్లి గ్రామానికి చెందిన తీట్ల నారాయణ ముప్పళ్లపాడు గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు కొటికల బాదుర్ల పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామ ప్రజలు భక్తులు స్వామివారికి వేద పండితులతో అభిషేకం నిర్వహించారు. అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో దమ్ము చెన్నకేశయ్య, ఉమ్మడి ప్రకాశం జిల్లా మాల జేఏసీ ప్రధాన కార్యదర్శి కొటికల బాలబాదుర్ల, కొటికల చిన్న బాదుర్ల, తెలుగుదేశం పార్టీ నాయకులు పెరుమాల బాల చెన్నయ్య, కోటపాటి శేషయ్య, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ కనిగిరి కన్వీనర్ దమ్ము వెంకటేష్, దమ్ము రామనాయుడు, కనిగిరి నియోజకవర్గం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సహాయ కార్యదర్శి దమ్ము శ్రీనివాసులు, దమ్ము బాలచంద్రుడు, శెట్టి వెంకట రామచంద్రయ్య, శెట్టి ఇజ్రాయిల్, కొటికల వెలుగొండయ్య, దమ్ము వరప్రసాద్, పెరుమాళ్ళ విజయ్ కిరణ్, కొటికల తిరుపతిరావు, కొటికల నారాయణరావు, కొటికల కొండయ్య, కొటికల బాలకేశవ, కొటికల బాలచంద్రుడు, కొటికల బాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సమీక్ష సమావేశంలో సమస్యలపై ప్రస్తావించిన ఎమ్మెల్యే కందుల



**మార్కాపురం, మే 12, ప్రభాతవార్త**

జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన డీఆర్సీ సమావేశంలో మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి పలు సమస్యలను తదితరుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని కోరారు. మార్కాపురం నియోజకవర్గంలోని అనేక గ్రామాలలో ప్రజలు, పశువులు నీటి కొరతతో తల్లడిల్లుతున్నారని తక్షణమే సమస్య పరిష్కారం కోసం నీటి సరఫరా చేసేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. గతంలో తాగునీరు సరఫరా చేసిన వాటర్ ట్యాంకర్ల వారికి బిల్లులు చెల్లించలేదని తక్షణమే బిల్లులు చెల్లించాలని కోరారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వేసిన గ్రావెల్ రోడ్లకు, సీసీ రోడ్లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని విన్నవించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని ఒక రకంగా సంక్రమించిన భూములకు తగు పరిశీలన చేసి సంబంధిత వారసులతో సంక్రమించేలా పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేయాలన్నారు. పీఎం సూర్య ఘర్ పథకంలో భాగంగా లబ్దిదారులకు సబ్సిడీ వెంటనే చెల్లించే విధంగా తగు చర్యలు చేపట్టాలని కోరారు. పొదిలి పట్టణానికి సాగర్ నీటి సరఫరాను వారానికి 28 గంటల నుండి కనీసం 36 గంటలకు పైగా కేటాయించి నీరు సరఫరా చేయాలని కోరారు. వెలుగొండ ప్రాజెక్టులో భాగంగా ఆర్ఆర్ ప్యాకేజీని ముంపు గ్రామ బాధితులకు అందించాలని కోరారు.

# 100 శాతం రుణాలు రికవరీకి నడుం బిగించండి

## - వెలుగు ఏపీఎం బాబురావు

**సంతనూతలపాడు, మే 12, ప్రభాతవార్త**

వెలుగు శాఖకు సంబంధించి సీఏఎఫ్, శ్రీనిధి, ఉన్నతి తదితర రుణాల వంద శాతం రికవరీకి వీఓఏలు నడుం బిగించాలని సంతనూతలపాడు మండల వెలుగు ఏపీఎం టి.బాబురావు పేర్కొన్నారు. సంతనూతలపాడులోని వెలుగు కార్యాలయంలో సోమవారం జరిగిన మండల వీఓఏల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మైక్రో క్రెడిట్ సంస్థలు భారిన పడకుండా ఎస్‌హెచ్‌జీ సభ్యులకు అవసరమైన రుణాలను సకాలంలో వీఓఏలు ఇప్పించాలని ఆయన తెలిపారు. మైక్రో సంస్థలుపై ఫిర్యాదులు చేయాలని ఏపీఎం బాబురావు ఈ సందర్భంగా హెచ్చరించారు. సమగ్ర జీవనోపాధులు ప్రణాళికకు సంబంధించి పక్కాగా నమోదు చేయాలని ఎంపీడీఓ సురేష్‌బాబు వెల్లడించారు. పక్కాగా నమోదు చేయాలన్నారు. మండలంలో రైతు ఉత్పత్తిదారుల గ్రూపులను ఖరీఫ్ సీజన్లో బలోపేతం చేయాలని ఏపీఎం బాబురావు కోరారు. ఖరీఫ్ అవసరాలు మేరకు రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళాసమైక్య అధ్యక్షురాలు పి.మేరీమ్మ,సీసీలు రామాంజనేయులు, వి.శ్రీనివాసులు,చెంచులక్ష్మీ, సీహెచ్.శ్రీనివాసరావు, మండలస్థాయిలో వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.



# నాగర్పమ్మ కొలుపులకు హాజరైన పాణ్యం



**బల్లికురవ, మే 12, ప్రభాతవార్త**

మండలంలోని ఎస్ఎల్‌గుడిపాడు గ్రామంలో వేంచేసి ఉన్న నాగర్పమ్మ కొలుపుల మహోత్సవం సోమవారం నిర్వహించారు. సమీప గ్రామాల ప్రజలు తమ ఇలవేల్పుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమానికి అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ పాణ్యం చిన్న హనిమిరెడ్డి హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆయన వెంట మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దేవినేని కృష్ణబాబు సర్పంచ్ పసలా నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మూరబోయిన ఏడుకొండలు, మక్కెన రామారావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

# హేరామ్.. కృష్ణపరమాత్మ.. చైర్మన్ సీట్‌కు క్యాహువా

## - మార్కాపురం మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం తీర్మానం

## - ఏకమైన టీడీపీ వైకాపా కౌన్సిలర్లు

## - మూకుమ్మడిగా ఒంగోలు తరలి వెళ్లిన కౌన్సిలర్లు

## - జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మాన పత్రం అందజేత





**మార్కాపురం, మే 12, ప్రభాతవార్త**

మున్సిపాలిటీ చైర్మన్ పీఠం సొంతం చేసుకోవాలన్న తెలుగుదేశం పార్టీ ప్రణాళిక కార్యరూపం దాల్చనుంది. మున్సిపాలిటీ వైకాపా చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి అతనిని గద్దె దింపాలన్న చదరంగపు క్రీడా కౌన్సిలర్ల ప్రతిపాదనతో అవిశ్వాసానికి దారితీశాయి. ఫలితంగా సోమవారం టీడీపీ వైకాపా కౌన్సిలర్లు ముకూమ్మడిగా ఒంగోలు తరలి జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి ప్రతిపాదనతో కూడిన అవిశ్వాస తీర్మానపు పత్రాన్ని అందజేశారు. ఆ అనంతరం ఒంగోలులోని ఎంపీ మాగుంట కార్యాలయంలో శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మంత్రుల రామనారాయణరెడ్డి, డోలా బాల వీరాంజనేయస్వామి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌లను మర్యాదపూర్వకంగా కలిసి రాబోయే మున్సిపల్ చైర్ పర్సన్ వక్కలగడ్డ రమ్య స్వాతి పేరును ప్రతిపాదించారు. ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీ కేంద్రంగా ఉన్న మార్కాపురం మున్సిపాలిటీ చైర్మన్‌గా వైసీపీ పార్టీ అభ్యర్థి చిర్లంచర్ల బాలమురళీకృష్ణ ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడవగా వైసీపీ పార్టీ చెందిన కొంత మంది కౌన్సిలర్లు ఆ పార్టీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. వైకాపా ప్రభుత్వం వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జరిగిన మార్కాపురం మున్సిపాలిటీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ విజయడంకా మ్రోగించడం జరిగింది. ఆ సమయంలో జరిగిన చైర్మన్ పదవుల పంజారంలో చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, ప్రముఖ శ్రీవైద్య నిపుణులు సీహెచ్ కనకదుర్గ పోటీ పడడంతో వారి ఇరువురి మధ్య సయోధ్య సమకూర్చి చేరు రెండున్నర సంవత్సరాలు చైర్మన్‌గా ఉండేలా నాటి నేతలు తీర్మానించారు. ఆ తదుపరి జరిగిన రాజకీయ పైరవీలు, పరిణామాలు వైకాపా పార్టీలో అంతర్గత కలహాలకు దారి తీశాయి. ఈ సమయంలో కౌన్సిలర్లు రెండు వర్గాలుగా చీలిపోవడంతో ఈ అవకాశాన్ని తెలుగుదేశం పార్టీ అందిపుచ్చుకోవాలని ఆలోచన చేసింది. ఇదిలా ఉండగా ఆ తదుపరి జరిగిన శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం, పలువురు వైకాపా కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలో చేరడం ఇప్పుడే జరిగిపోయింది. దీంతో మున్సిపాలిటీల్లో తెలుగుదేశం పార్టీ బలం పెరిగింది. రాష్ట్రంలోని అనేక మున్సిపాలిటీలలో అవిశ్వాసాలతో చైర్మన్ పీఠాన్ని తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకోగా అదే దోవలో మార్కాపురం మున్సిపాలిటీ అడుగులు వేసింది. శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మార్కాపురం మున్సిపాలిటీపై తెలుగుదేశం జెండా ఎగురవేసే దిశగా ప్రణాళికను రూపొందించుకున్నారు.



**1969లోనే తొలి అవిశ్వాసం తీర్మానం :**

మార్కాపురం మున్సిపాలిటీ 1964 అక్టోబర్ 1వ తేదీన తృతీయ శ్రేణి పురపాలక సంఘంగా ఆవిర్భవించింది. 1967 అక్టోబర్ 23న మున్సిపాలిటీలో తొలి పుర పోరు జరిగింది. నాడు జరిగిన ఎన్నికలలో గ్రందే రఘురామ గుప్తా తొలి మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. కేవలం 21 నెలల అనంతరం ఆయన అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టడం జరిగింది. ఈ ఘట్టంలో తొలి అవిశ్వాస తీర్మానం 1969లోనే మున్సిపాలిటీలో నమోదైంది.

**చిర్లంచర్ల కుటుంబానికి వెంటాడుతున్న అవిశ్వాసం :**



అవిశ్వాస పరీక్షలు చిర్లంచర్ల కుటుంబానికి వెంటాడు తున్నాయని చెప్పాలి. మార్కాపురం మున్సిపాలిటీ చరిత్ర పుట్టలను తిరిగేస్తే 1985మే నెలలో జరిగిన ఆనాటి మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల చెంచయ్యపై నాడు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం కారణంగా ఆయన 3-9-1981 నుండి 26-4-1985 వరకు మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశారు. తిరిగి ప్రస్తుత మున్సిపల్ చైర్మన్,చిర్లంచర్ల చెంచయ్య కుమారుడు అయినటు వంటి చిర్లంచర్ల బాలమురళీకృష్ణ స్వపక్షం ఆగ్రహానికి గురై, అధికార పార్టీ రాజకీయ చదరంగానికి పావు అయిన చైర్మన్ పదవి కాలం ముగిసే పది నెలల ముందుగానే అవిశ్వాసాన్ని ఎదుర్కొనున్నారు. అర్ధ శతాబ్ద కాలానికి పైగా చరిత్ర కలిగిన మార్కాపురం ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీలో ముచ్చటగా మూడో సారి అవిశ్వాస తీర్మాన కార్యం జరగడం చరిత్రలో మరో పేజీ చోటుచేసుకుంది.

# 75 శాతం హాజరు ఉంటే ఉచిత కుట్టుమిషన్లు పంపిణీ

## - ఎంపీడీఓ సురేష్‌బాబు



**సంతనూతలపాడు, మే 12, ప్రభాతవార్త**

కుట్టు మిషన్ల శిక్షణ కార్యక్రమానికి 75 శాతం హాజరు ఉంటేనే శిక్షణ తదుపరి ఆయా మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నట్లు సంతనూతలపాడు ఎంపీడీఓ డి.సురేష్‌బాబు పేర్కొన్నారు. సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల నూతన ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయం ప్రాంగణంలో మండల స్థాయిలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు జరుగుతున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. మహిళలు ఈ కుట్టు మిషన్ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఎంపీడీఓ సురేష్‌బాబు కోరారు. శిక్షణ తదుపరి బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రుణాలను కూడా మంజూరు చేయనున్నట్లు ఎంపీడీఓ సురేష్‌బాబు పేర్కొన్నారు. ఈ ఉచిత కుట్టు మిషన్ కేంద్రానికి ప్రతి రోజు మహిళలు గైర్హాజరు కాకుండా రావాలని ఎంపీడీఓ సురేష్‌బాబు కోరారు. ప్రస్తుతం ఉదయం, మధ్యాహ్నం వేళలలో రెండు బ్యాచ్‌లు వంతున మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణను ఇస్తున్నారు. రెండు బ్యాచ్‌లకు సంబంధించి 72 మంది మహిళలకు 60 మంది శిక్షణ ఇచ్చేస్తున్నారు. మూడు నెలల పాటు ఈ శిక్షణను ఇవ్వనున్నారు. నేటికి శిక్షణ ప్రారంభమై 15 రోజులు కావస్తున్నది. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కుట్టు మిషన్ కేంద్రంలో బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు వర్గాల మహిళలు శిక్షణ పొందుతున్నారు. ఈ కార్యక్రమానికి రిసోర్సు పర్సన్‌గా కే.లత వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు ఎన్.మాధవిలత, మహిళలు పాల్గొన్నారు.

## మహిళా ఇంజనీరింగ్ కళాశాలను ప్రారంభించిన రాష్ట్ర మంత్రులు




**మద్దిపాడు, మే 12, ప్రభాతవార్త**
మండల పరిధిలోని ఏడుగుండ్లపాడు గ్రామ సమీపంలోని శ్రీహర్షిణి మహిళ ఇంజనీరింగ్ కళాశాలను రాష్ట్ర విద్యుత్‌శాఖ గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామిలు సోమవారం నాడు ప్రారంభించారు. ప్రకాశం జిల్లాలో హర్షిని జూనియర్ కళాశాల డిగ్రీ కళాశాలల చైర్మన్ గోరంట్ల రవికుమార్ ఇటీవల నిర్మించిన మహిళ ఇంజనీరింగ్ కళాశాలను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సాంఘికసంక్షేమశాఖ మంత్రి బోలా బాలవీరాంజనేయ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ పేద విద్యార్థులను ఆదుకోవడంలో ఎప్పుడూ ముందుండే గోరంట్ల రవికుమార్ మహిళా కళాశాలను ప్రారంభించడం శుభ పరిణామమన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ నా నియోజకవర్గంలో మొదటి మహిళా ఇంజనీరింగ్ కళాశాల రావడం మా అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, దామచర్ల సత్య, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, వివిధ కళాశాల కరస్పాండెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాదాయ స్థలం ఆక్రమణ విషయంపై ఫిర్యాదుదారుకు విచారణ



**సింగరాయకొండ, మే 12,ప్రభాతవార్త**
పట్టణంలోని 605/తి సర్వే నెంబర్ లోని 12 సెంట్లు విస్తీర్ణం గల దేవాదాయ ధర్మాదాయ స్థలం ఆక్రమణకు గురైనదని సామాజిక కార్యకర్త సూర పోగు మోజెష్ మీ కోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేశారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 15 తేదిన విచారణకు హాజరు కావాలాని నోటిస్ అందజేశారు. మండలంలోని పాత సింగరాయకొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంకు సంబంధించిన సోమరాజు పల్లి గ్రామ సర్వే నంబర్ 605 /తి సర్వే నెంబర్లో, 12 సెంట్లు విస్తీర్ణం గల భూమి ఆక్రమణకు గురైనదని, ఆ స్థలంలో కాంప్లెక్స్ నిర్మాణం కొరకు పిల్లర్లు నిర్మాణం చేపడుతున్నారని ఆ నిర్మాణాలు తొలగించి దేవస్థానం భూమిని స్వాధీన పరుచుకుని దేవాలయ అభివృద్ధి కొరకు ఈ స్థలమును ఉపయోగించవలసినదిగా జిల్లా కలెక్టర్ కు మోజెస్ పిర్యాదు చేశారు. ఈ విషయం పై జిల్లా కలెక్టర్ సింగరాయకొండ తహసీల్దార్ ను విచారణకు ఆదేశించారు. ఈ మేరకు స్థానిక తహసిల్దార్ మోజేష్ ఈనెల 15వ తేదీన ఉదయం 11 గంటలకు తాసిల్దార్ కార్యాలయంలో తగిన ఆధారాలతో తహసీల్దార్ ఎదుట విచారణకు హాజరు కావాల్సిందిగా నోటీస్ జారీ చేశారు. ఈ నోటీసును రెవెన్యూ అధికారి ద్వారా అందజేశారు. ఫిర్యాదుదారు సరైన సమయానికి హాజరు కాని యెడలా రికార్డులు అనుసరించి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తాసిల్దార్ నోటీసు ద్వారా తెలిపారు. ఈ విచారణ సందర్భంగా తగిన నివేదికను ఇవ్వాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారిని ఆదేశించారు. గతంలో ఈ స్థలం ఆక్రమణకు గురి కాకుండా దేవాదాయ ధర్మాదాయ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

## పార్టీకి అంకిత భావంతో పని చేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వడం అభినందనీయం

**- దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గొట్టిపాటి లక్ష్మీ**



**దర్శి, మే 12, ప్రభాతవార్త**
కష్టకాలంలో పార్టీ వెంటే నిలబడి, ప్రజల్లో తెలుగుదేశం ఆశయాలను ముందుకు తీసుకెళ్లిన వారికి సముచిత స్థానం కల్పించి తెలుగుదేశం పార్టీ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందన్నారు. నామినేటెడ్ పదవులలో అన్ని సామాజిక వర్గాలకు సముచిత న్యాయం కల్పిస్తూ 22 కార్పొరేషన్లకు చైర్మన్లను ప్రకటించడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా నామినేటెడ్ పదవులు పొందిన ప్రతి ఒక్కరికి దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ హృదయపూర్వక అభినందనలు ఒక ప్రకటనలో తెలిపారు.

## మారెళ్ల గ్రామంలో అంకాలమ్మ తల్లి కొలుపుల కార్యక్రమంలో పాల్గొన్న గొట్టిపాటి లక్ష్మీ

**ముండ్లమూరు, మే 12, ప్రభాతవార్త**
ముండ్లమూరు మండలం మారెళ్ళ గ్రామంలో జరిగిన శ్రీ అంకాలమ్మ తల్లి కొలుపులు కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గొట్టిపాటి లక్ష్మీ పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు కూరపాటి శ్రీను, మండల మాజీ అధ్యక్షులు మందలపు వెంకట్రామయ్య, మాజీ ఎంపీటీసీ సుంకర రాఘవరెడ్డి, సుబ్బారెడ్డి, మారెళ్ల గ్రామటీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## విద్యుత్ శాఖ ఏడీఏగా పీవీఎన్ రవికుమార్

**దర్శి, మే 12, ప్రభాతవార్త**
దర్శి విద్యుత్ శాఖ ఏడీఏగా పీవీఎన్ రవికుమార్ సోమవారం నూతన బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో కైకలూరు ఏఈగా పని చేస్తూ పదోన్నతిపై దర్శికి వచ్చారు. ఇప్పటి వరకు దర్శిలో పని చేస్తున్న డీవీ కృష్ణారెడ్డి పామూరుకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కరెంటుకు సంబంధించి ఏ సమస్యలు ఉన్న వెంటనే ఆఫీసును సంప్రదించాలని, విద్యుత్ బకాయిల్ని క్రమం తప్పకుండా వసూళ్ల చేయాలన్నారు.



## డీఆర్‌సీ సమావేశంలో పాల్గొన్న డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

**దర్శి, మే 12, ప్రభాతవార్త**
ఒంగోలు కలెక్టరేట్‌లో డీఆర్‌సీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశానికి జడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పలు సమస్యలపై ప్రస్తావించారు.




## సైనికుల సంక్షేమం పట్ల పవన్ కళ్యాణ్ విపుల దృక్పథం

**- ఇంటి పన్ను మినహాయింపు నిర్ణయం అభినందనీయం**



**చీరాల, మే 12, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరుపున భారత సైన్యంలో సేవలందిస్తున్న జవాన్లకు ఇంటి పన్ను మినహాయింపు ఇవ్వాలని డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన ప్రతిపాదన ప్రశంసనీయం, ఈ నిర్ణయం నాటి ఉగ్రదాడులు తరువాత దేశ రక్షణలో పాల్గొంటున్న త్రివిధ దళాలు, బీఎస్ఎఫ్, ఇతర రక్షణ విభాగాల్లో పని చేస్తున్న సైనికుల పట్ల ప్రజల గౌరవాన్ని ప్రతిబింబిస్తుందని తెలుగుదేశం పార్టీ నాయకులు నక్కల వెంకట రమణారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ సేవ కోసం జీవితం అంకితమిచ్చే వీర జవాన్లు ఉన్నత స్థాయిలో గుర్తింపు పొందడం గర్వకారణం, వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తీసుకున్న ఈ నిర్ణయం పవన్ కళ్యాణ్ దేశభక్తి, ప్రజా సంకల్పానికి నిదర్శనమన్నారు. ఇది కేవలం ఆర్థిక ఊరట మాత్రమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వం నుండి రక్షణ సిబ్బందికి ఇవ్వబడిన గౌరవ సూచక సంకేతం కూడా, చంద్రబాబు నాయుడు నేతృత్వంలో పవన్ కళ్యాణ్ రాబోయే రోజుల్లో ఇలాంటి అనేక ప్రజా ప్రయోజనపరమైన కార్యక్రమాలు చేపడతారని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారన్నారు. దేశాన్ని కాపాడే రక్షకులకు గౌరవం తెలపడం మన సామాజిక బాధ్యత, ప్రభుత్వమే ఆ బాధ్యతను చొరువగా చేపట్టినందుకు ఇది ఒక చరిత్రాత్మక ముందడుగు అన్నారు.

## వినోదాత్మకంగా విజ్ఞాన శిబిరాలు



**చిన్నగంజాం, మే 12, ప్రభాతవార్త**
చిన్నగంజాం శాఖా గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు ముందుగా యోగా శిక్షణ కార్యక్రమం రామాంజనేయులు నిర్వహించారు. వారికి తడాసనం దాని వల్ల విద్యార్థులు కలిగే ఉపయోగాలు జ్ఞాపకశక్తి ఏకాగ్రత పెంపొందించింది. వారి చేత ఈ ఆసనాలను చేయించడం జరిగింది. అనంతరం విద్యార్థులకు కంప్యూటర్లో వర్డ్ ప్యాడ్ ఎలా ఉపయోగించాలి అనేటువంటి అంశాలను విద్యార్థులకు వై.రామాంజనేయులు వివరించారు. తదుపరి స్థానిక ఎల్ఐసీ డీఓ అయినటువంటి శ్రీరామచంద్రమూర్తి విద్యార్థులకు వేదిక మ్యాథమెటిక్స్ టేబుల్స్‌లో షార్ట్ కట్స్‌లో ఎలాగా ఉపయోగించాలని విద్యార్థులకు వివరించారు. అనంతరం వారు చెప్పిన తదుపరి 20 లోపు మల్టీఫిక్ లేషన్ చేసి షార్ట్ కట్ అంశాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం వారు చెప్పిన అంశాల మీద పరీక్ష నిర్వహించి పరీక్షలో గెలుపొందినటువంటి విద్యార్థులకు ఎల్ఐసీ డీఓ శ్రీరామచంద్రమూర్తి విద్యార్థులకు బహుమతులు అంజేశారు. అనంతరం విద్యార్థులకు వారు ఈ రోజు స్నాక్స్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ పాలకులు నరసింహాచార్యులు, రిసోర్స్ పర్సన్ వై.రామాంజనేయులు, శ్రీనివాసరావు, నరసింహారావు, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## కడవకుదురు పోలేరమ్మ తిరునాళ్ల సందర్భంగా ఘనంగా ఎడ్లబండి పోటీలు

**చిన్నగంజాం, మే 12, ప్రభాతవార్త**
కడవకుదురు గ్రామంలో కొలువై ఉన్న గ్రామదేవత పోలేరమ్మ తల్లి తిరునాళ్ల 14వ వార్షికోత్సవం సందర్భంగా ఎడ్ల బండి బలప్రదర్శన పోటీలు ఘనంగా జరిగాయి. ఈ ఎడ్ల బండి బల ప్రదర్శన పోటీల్లో పలు జిల్లాల నుంచి ఒంగోలు జాతి ఎడ్లతో పందెంలో పాల్గొన్నారు. ఎడ్ల బండి బల ప్రదర్శనలో మొదటి బహుమతిగా ఆలహరికృష్ణ యాదవ్ పెద్దపూడి అమృతలూరి బాపట్ల జిల్లా వారు 30 వేలతో మొదటి మహుమతి తో రావనేని శ్రీనివాసరావు గార్లపాడు కాకుమాను ఎంపీపీ గుంటూరు జిల్లా రూ.25000తో రెండో బహుమతి గెలుచుకున్నారు. మూడో బహుమతి చేకూరి ఉషారాణి సోపిరాల చిన్నగంజాం మండలం వారు రూ.20వేలు గెలుచుకున్నారు. నాల్గో బహుమతి బొడ్డు బాలకృష్ణ రాజుపాలెంఉలవపాడు నెల్లూరు జిల్లా వారు రూ.15000 గెలుచుకున్నారు. ఐదో బహుమతి పిన్నెబోయిన మహేంద్ర కొత్తమద్ది బోయినవారిపాలెం రూ.10వేలు గెలుచుకున్నారు. ఆరో బహుమతి కుమ్మరి నాగశ్రావణి, మున్నవారిపాలెం, జధ్బర్ల ఎలమంద వెంకట కృష్ణ, చెరుకుపల్లి బాపట్ల వారు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎబ్ల బల ప్రదర్శన పోటీ సభ్యులు, గ్రామ కాపులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## చిన్నగంజాం జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

**- ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ - మహిళ మృతి**

**- మరొకరికి తీవ్ర గాయాలు**



**చిన్నగంజాం, మే 12, ప్రభాతవార్త**
చిన్నగంజాం మండం కడవకుదురు గ్రామ జాతీయ రహదారి పై ఎం3 రెస్టారెంట్ దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చీరాల వైపు ద్విచక్ర వాహనం మీద వెళ్తున్న ఇద్దరిని వెనుక నుంచి వచ్చి ఐచర్ లారీ ఢీకొనడంతో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మరొక వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే 108 వాహనంలో చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు చీరాల మండలం ఈపురుపాలెం గ్రామానికి చెందిన కారంపూడి పద్మగా గుర్తించారు. ఆమె ఒక ఫంక్షన్‌లో వంట మనిషిగా పని చేస్తుంది. ఆ క్రమంలో చిన్నగంజాం మండలంలోని శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఒక పెళ్లి కార్యక్రమంలో వంటలు పూర్తి చేసుకుని ఇంటికి బయలుదేరింది. ఆ సమయంలో చీరాల వైపు వెళ్తున్న ఐచర్ లారీ వెనుక నుంచి వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. కారంపూడి పద్మ (45), అక్కడికక్కడే మృతి చెందగా కుంద్రుపాటి ప్రభుదాసుకు (50) కు తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వెళ్తున్న మండల తహశీల్దార్ జువ్వకుంట ప్రభాకరరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి వెంటనే 108కి క్షతగాత్రుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు కుమార్తె శివ పార్వతి ఇచ్చిన సమాచారం మేరకు కారంపూడి పద్మ భర్త కారంపూడి బిక్షాలు 17 సంవత్సరాల క్రితమే మరణించారని, కుమార్తెకు వివాహమైనట్లు తెలియపరిచారు. ఎస్సై శీలం రమేష్, సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతురాలు పంచనామ చేసి పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## లివర్‌కు ఎంతో మేలు చేసే తాటి ముంజలు

**దొనకొండ,మే 12,ప్రభాతవార్త**
లివర్‌కు ఎంతో మేలు చేసే తాటి ముంజలు..దొరికితే అస్సలు వదలొద్దు. జీర్ణ ప్రక్రియ బాగుంటుంది, సమయానికి ఆకలి వేస్తుంది, మలబద్ధకం ఉండదు. ఇది పీచు పదార్థం కనుక ఊబకాయం నివారిస్తుంది. ట్యూమర్లు, క్యాన్సర్లను సైతం తరిమికొడుతుందని ఇటీవలి పరిశోధనలో తేలింది.



## వైభవంగా రధోత్సవ కార్యక్రమం

**నాగులుప్పలపాడు, మే 12, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన నాగులుప్పలపాడు గ్రామంలోని వార్షిక తిరునాళ్లలో భాగంగా శ్రీ మద్దిరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణ మహోత్సవం అనంతరం సోమవారం సాయంత్రం రధోత్సవ కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. ఈ రధోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. రధోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు.

**ఎస్సై శ్రీకాంత్‌ను సన్మానించిన ధనూష్ :**
రధోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించిన ఎస్సై శ్రీకాంత్‌ను దేవస్థానం నిర్వాహకులు ధనుష్ ఆధ్వర్యంలో దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు.



## పొగాకు రైతులను ఆదుకోండి

**- తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి - గొట్టిపాటి లక్ష్మీ**



**దర్శి, మే 12, ప్రభాతవార్త**
ఒంగోలు ప్రకాశం భవన్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా అధ్యక్షతన సోమవారం జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, అదే విధంగా జిల్లా మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీ వీరాంజనేయస్వామి, పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్, పొగాకు బోర్డు ఈడీ సహచర ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, రైతులతో కలిసి పొగాకు రైతు సమస్యలపై జరిగిన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గొట్టిపాటి లక్ష్మీ పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో రైతులు పొగాకు పంట ఎక్కువగా సాగు చేస్తుంటారు. గత సంవత్సరం పొగాకు ధరలతో పోలిస్తే ఈ సంవత్సరం చాలా తక్కువగా ఉన్నాయని, ఈ సంవత్సరం రైతు పెట్టుబడులు భారీగా పెరగటం వలన, ధరలు ఆశాజనకంగా లేవని రైతులు ఆందోళన చెందుతున్నారు. కావున పొగాకు బోర్డు, ప్రభుత్వం పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని రైతులు తరుపున కోరారు. తాగునీటి సమ్య నివారించేందుకు నీటి సరఫరా ట్యాంకర్లను పెంచాలని సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు అవసరమైన నిధులు మంజూరు చేయాలన్నారు. ప్రస్తుతం ఇస్తున్న వాటర్ ట్యాంకులు అన్ని గ్రామాలకు సరిపోవడం లేదని ఆమె తెలిపారు. కరువు ప్రాంతాలుగా ఉన్న దొనకొండ , కురిచేడు మండలాలను దృష్టిలో ఉంచుకుని వాటర్ ట్యాంకులను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దర్శి పట్టణంలో గత వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన జగనన్న కాలనీలు నిరూపయోగంగా ఉన్నాయని, మూడు కిలోమీటర్ల దూరంలో ఉండడం వల్ల లబ్దిదారులు ఎవరు ఆసక్తి చూపడం లేదన్నారు. ప్రత్యామ్నాయ స్థలాలు చూపాలని కోరారు. సంబంధిత సమస్యలపై జిల్లా కలెక్టర్‌కి కూడా లక్ష్మీ వినతిపత్రాన్ని అందజేశారు. తొలుత ఆపరేషన్ సింధూర్ కాశ్మీర్ సరిహద్దులో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో అమరవీరుడైన వీర జవాన్ మురళి నాయక్ జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి, జిల్లా మంత్రి వర్యులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులతో కలిసి గొట్టిపాటి లక్ష్మీ సంతాపం తెలిపారు.

## ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన సునీత

**ముండ్లమూరు, మే 12, ప్రభాతవార్త**
ముండ్లమూరు మండల పరిషత్ అభివృద్ధిఅధికారిగా పి.సునీత సోమవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈమె బాపట్ల జిల్లా కొల్లూరు మండల డిప్యూటీ ఎంపీడీఓగా పని చేస్తూ పదోన్నతిపై ముండ్లమూరు ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముండ్లమూరు మండలాన్ని అభివృద్ధి చేయడానికి తమ వంతు కృషి చేస్తానని అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాల్ని అభివృద్ధి చేసేదుకు కృషి చేయాలన్నారు. ఈసందర్భంగా ఎంపీడీఓ పి.సునీతని మండల పరిషత్ అధికారులు, నాయకులు కలిసి అభినందనలు తెలిపారు.



## పార్టీ కార్యకర్తకి నివాళులర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

**ముండ్లమూరు, మే 12, ప్రభాతవార్త**
మండలంలోని బట్లపల్లి గ్రామంలో గుండెపోటుతో మరణించిన వైసీపీ కార్యకర్త మురళి మృతదేహానికి దర్శి నియోజకవర్గ ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి అండగాఉంటామని వారి కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ చింతా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.






దరిశి కూటమి ఇంచార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన నూనె వీరబాబు చందవరం మాజీ ఎంపిటిసి. దొనకొండ - ప్రభాతవార్త

## 216 జాతీయ రహదారి మీద అదుపు తప్పి కారు బోల్తా

**- తృటిలో తప్పిన పెను ప్రమాదం**

**చిన్నగంజాం, మే 12, ప్రభాతవార్త**
216 జాతీయ రహదారి మీద అదుపు తప్పి కారు బోల్తా పడిన ఘటనలో తృటిలో పెను ప్రమాదం తప్పింది. చిన్నగంజాం మండలం కడవకుదురు గ్రామంలో జాతీయ రహదారి మీద సోమవారం ఉదయం 6.40గంటల సమయంలో ఎం 3 రెస్టారెంట్ సమీపంలో కావలి నుంచి నిజాంపట్నం వెళ్తున్న కారు బోల్తా పడింది. కారు డ్రైవర్ పోలయ్య ఇచ్చిన సమాచారం ఉదయాన్నే నిద్ర మత్తులో ఉండటం వల్ల రోడ్డు మార్జిన్ దాటినోనటం వల్ల కారు గోతిలో పడిపోయింది. ఆ కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు చిన్న చిన్న గాయాలయ్యాయి. వెంటనే అక్కడ ఉన్న వారు హైవే అంబులెన్స్‌లో చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు.



13-5Pg5exJ.qxd:13-5Pg5exJ.qxd 01/01/01 8:47 AM Page 1



# మా దాడులు ఉగ్రవాదం పైనే..

## పాక్ ఆర్మీ వైఖరివల్లే ఉద్రిక్తతలు ఉధృతం

## దాయాది దాడులను సమర్ధంగా తిప్పికొట్టాం: ఎయిర్ మార్షల్ ఎకె భార్తి



**న్యూఢిల్లీ, మే 12:** పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్రవాద మౌలిక సదుపాయాలు, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ఫైట్ చేశామని, కానీ పాకిస్థాన్ మిలిటరీ ఆ ఉగ్రవాదులకు సపోర్టు ఇచ్చిందని, దీంతో ఉద్రిక్తతలు ఉధృతమైనట్లు ఎయిర్ మార్షల్ ఏకే భార్తి తెలిపారు. ఆపరేషన్ సింధూర్ గురించి ఇవాళ త్రివిధ దళాలు మీడియా సమావేశం నిర్వహించాయి. మూడు దళాలకు చెందిన డీజీ ఎంవోలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉగ్రవాదులను టార్గెట్ చేసిన సమయంలో పాకిస్థాన్ మిలిటరీ జోక్యం చేసుకున్నదని, ఉగ్రవాదులకు అనుకూలంగా వ్యవహరించిందని, అందుకే తాము రెస్పాండ్ అయినట్లు ఆయన తెలిపారు. పాకిస్థాన్‌లో జరిగిన నష్టాలకు ఆ దేశ ఆర్మీదే బాధ్యత అని ఆయన అన్నారు. తాము కేవలం ఉగ్రవాదులకు వ్యతిరేకంగా మాత్రమే పోరాడినట్లు చెప్పారు. భారతీయ వైమానిక రక్షణ వ్యవస్థ పాకిస్థాన్ దాడులను సమర్ధవంతంగా తిప్పికొట్టిందన్నారు. ఆకాశ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ అద్భుతంగా పనిచేసినట్లు భార్తి తెలిపారు. గత దశాబ్ద కాలంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం వల్ల ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ బలంగా తయారైందన్నారు. భారీ సంఖ్యలో డ్రోన్లు, ఏరియల్ వెహికిల్స్‌తో పాకిస్థాన్ దాడి చేసిందని, స్వదేశీయంగా అభివృద్ధి చేసిన యూఏఎస్ సిస్టమ్స్, శిక్షణ పొందిన ఇండియన్ ఎయిర్ డిఫెన్స్ సిబ్బంది తిప్పికొట్టినట్లు చెప్పారు. ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా ఇండియా టార్గెట్ చేసిన కేంద్రాల ఫోటోలను ఎయిర్ మార్షల్ ఏకే భార్తి ప్రదర్శించారు. మన మిలిటరీ బేస్‌లు, మన వ్యవస్థలన్నీ పూర్తిగా ఆపరేషన్‌లో ఉన్నాయని, భవిష్యత్తులో ఎటువంటి మిషన్ అయినా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని భార్తి తెలిపారు. మీడియా సమావేశంలో చైనాకు చెందిన పీఎల్15 ఎయిర్ టు ఎయిర్ మిస్సైల్ శకలాలను చూపించారు. ఇండియాపై అటాక్ చేసిన సమయంలో పాకిస్థాన్ ఆ మిస్సైల్‌ను వాడినట్లు తెలుస్తోంది. టర్కీకి చెందిన వైఐహెచ్, సోన్‌గార్ డ్రోన్ల శకలాలను కూడా ఇండియా ప్రదర్శించింది.

**ఆపరేషన్ సింధూర్ సూపర్ సక్సెస్**

ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని రక్షణ శాఖ అధికారుల వెల్లడించారు. ఉగ్ర స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. పాక్ భూభాగంలో నష్టానికి బాధ్యత వారి ఆర్మీదేనని పేర్కొన్నారు. ఈ మేరకు ఆపరేషన్ సిందూర్‌పై సోమవారం మధ్యాహ్నం నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆ సందర్భంగా పాకిస్థాన్‌పై దాడుల వీడియోలను రక్షణశాఖ అధికారులు ప్రదర్శించారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు పాకిస్థాన్ ప్రయోగించిన డ్రోన్లు, మానవరహిత వైమానిక వాహనాలు, క్షిపణులను సమర్థవంతంగా అడ్డుకున్నట్లు ఎయిర్ మార్షల్ ఏకే భార్తి వెల్లడించారు. మన సైన్యానికి, ప్రజలకు పెద్దగా నష్టం జరగకుండా చూశామని తెలిపారు. గగనతల రక్షణ వ్యవస్థలో స్వదేశీ తయారీ ఆకాశ్ కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. చైనా తయారీ పిఎల్15 వంటి క్షిపణులను పాకిస్తాన్ ప్రయోగిస్తే వాటిని కూల్చివేసినట్లు తెలిపారు. పౌర నివాసాలకు దూరంగానే దాడులు చేశామని, భారత్ దాడులపై పాకిస్థాన్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.

**ఏదో లేయర్ వాటిని అడ్డుకుంటుంది: లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్:** గత కొన్నేళ్లుగా ఉగ్రవాద కార్యకలాపాల తీరు మారినట్లు DGMO లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ తెలిపారు. అమాయక పౌరులను ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకుంటున్నారని చెప్పారు. భారత్ ఎయిర్‌ఫీల్డ్‌లను, లాజిస్టిక్స్‌ను లక్ష్యంగా చేసుకోవడం చాలా కష్టమని అన్నారు. గ్రిడ్ సిస్టమ్‌లో అన్ని లేయర్లు దాటగలిగినా ఏదో లేయర్ వాటిని అడ్డుకుంటుందని వెల్లడించారు. పాకిస్థాన్ జరిపిన గగనతల దాడులను తక్షణమే పసిగట్టి నిలువరించామని వైస్ అడ్మిరల్ ప్రమోద్ తెలిపారు. ఎయిర్ క్రాఫ్ట్ కేరియర్లు, రాడార్లు ఉపయోగించామని చెప్పారు. ఫ్లీట్, ఎయిర్ డిఫెన్స్‌ను సమర్థంగా వినియోగించామని పేర్కొన్నారు డ్రోన్లు, హైస్పీడ్ మిస్సైళ్లను వినియోగించినట్లు వెల్లడించారు. నౌకాదళ అడ్వాన్స్ రాడార్ల ద్వారా పాక్ డ్రోన్లను గుర్తించగలిగినట్లు తెలిపారు.

**19 రోజుల తర్వాత ప్రశాంతం**

భారత్, పాకిస్థాన్ సరిహద్దుల్లోని నియంత్రణరేఖ వెంబడి ప్రశాంత వాతావరణం నెలకొంది. గతరాత్రి ఇక్కడ ఎలాంటి కాల్పుల మోత మోగలేదని, షెల్లింగ్ జరగలేదని భారత సైన్యం వెల్లడించింది. పహల్గాం దాడి తర్వాత నుంచి ఎల్‌ఒసి వద్ద అలజడి నెలకొనగా 19 రోజుల తర్వాత నిన్న రాత్రి ప్రశాంతంగా గడిచిందని తెలిపింది. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత సైనిక ఘర్షణను ఆపేందుకు భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అయితే కొన్ని గంటలకే పాక్ దాన్ని ఉల్లంఘించి కాల్పులకు పాల్పడింది. దీనిపై భారత్ తీవ్రఆగ్రహం వ్యక్తంచేయడంతో దాయాది దేశం వెనక్కి తగ్గింది. దీంతో జమ్మూకశ్మీర్‌లో నిన్న రాత్రి ఎలాంటి కాల్పులు జరగలేదని భారత సైన్యం వెల్లడించింది. ఘర్షణలు తీవ్రస్థాయికి చేరడంతో భద్రతా దళాలు సరిహద్దు ప్రాంతాల నుంచి పౌరులను ఖాళీ చేయించారు. దీంతో గత కొద్ది రోజులుగా వారు సురక్షిత ప్రాంతాల్లోనే తలదాచుకుం టున్నారు. అయితే ఇప్పుడే స్వస్థలాలకు వెళ్లవద్దని సరిహద్దు గ్రామప్రజలను జమ్మూకశ్మీర్ యంత్రాంగం హెచ్చరించింది. పేలని షెల్స్ ఇంకా ఉంటాయని, వాటిని గుర్తించాల్సి ఉందని పేర్కొంది. ఇక, పాకిస్థాన్‌తో సరిహద్దులు పంచుకుంటున్న ఇతర రాష్ట్రాల్లోను నిన్న రాత్రి పరిస్థితులు సాధారణస్థితికి వచ్చాయి. డ్రోన్లు, కాల్పులు, బాంబుదాడులు జరగలేదు. అయినప్పటికీ భద్రతా బలగాలు పూర్తిస్థాయి అప్రమత్తతతో ఉన్నాయి.



## భారత్-పాక్ ప్రత్యక్ష చర్చలకు మా మద్దతు : యుఎస్

**వాషింగ్టన్, మే 12:** భారత్, పాకిస్థాన్ మధ్య మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధమని ప్రకటించిన అమెరికా తాజాగా ఇరుదేశాల మధ్య ప్రత్యక్ష చర్చలకు తాము మద్దతిస్తామని ప్రకటించింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత్-పాక్ అంశంపై యుకె విదేశాంగ మంత్రి డేవిడ్ లామీతో మాట్లాడారు. కాల్పుల విరమణ కొనసాగించడం, రెండు దేశాల మధ్య కమ్యూనికేషన్ మార్గాలను తెరిచి ఉంచడం ఎంతో ముఖ్యమని ఈ భేటీలో ఇరువురు నేతలు అభిప్రాయపడినట్లు అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి టామీ బ్రూస్ తెలిపారు. కాల్పుల విరమణ తర్వాత ఇరు దేశాలు ప్రత్యక్షంగా చర్చలు జరపడానికి అమెరికా సాయం చేస్తుందని మార్కో రూబియో ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి కొనసాగుతున్న ప్రయత్నాలను ప్రోత్సహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భారత్, పాక్‌ల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమెరికా విదేశాంగ శాఖ స్వాగతించింది. భారత్, పాక్ సంఘర్షణ నివారణకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ప్రకటించింది. భారత ప్రధాని నరేంద్రమోడీ, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ శాంతిమార్గాన్ని ఎంచుకోవడాన్ని అభినందిస్తున్నామని వ్యాఖ్యానించింది. భారత్, పాక్ ప్రత్యక్ష చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, విదేశాంగ మంత్రి మార్కో రూబియోలు కోరుకుంటున్నారని విదేశాంగ శాఖ వెల్లడించింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇటీవల భారత విదేశాంగ మంత్రి జైశంకర్, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో ఫోన్‌లో మాట్లాడిన విషయం తెలిసిందే. అవసరమైతే భారత్, పాకిస్థాన్ మధ్య చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తానని ఆయన ప్రతిపాదించారు. ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని మార్కో రూబియో స్పష్టం చేశారు.

## 17మంది నవజాత శిశువులకు సిందూర్ పేరు




**లక్నో,మే 12:** దేశవ్యాప్తంగా ఇప్పుడు ఆపరేషన్ సిందూర్ పేరు మారుమోగుతోంది. పహల్గాం ఉగ్రదాడితో రగిలిపోతున్న భారత్ మే 7న ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్ ఉగ్ర శిబిరాలపై దాడి చేసి 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసింది. పాక్ వెన్నులో వణుకుపుట్టిస్తూ ఇండియన్ ఆర్మీ చేపట్టిన ప్రతీకార చర్యపై దేశవ్యాప్తంగా ప్రశంసలు కురుస్తున్నాయి. కొందరైతే తమ నవజాత శిశువులకు సింధూర్ అనే పేర్లు పెడుతూ సైనిక జవాన్ల పట్ల తమకున్న గౌరవాన్ని చాటుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని కుషీనగర్ జిల్లాలో అసాధారణ రీతిలో ఈ సెంటిమెంట్ కనిపిస్తోంది. కేవలం రెండు రోజుల్లో 17 మంది ఆడ శిశువులకు వారి కుటుంబ సభ్యులు సిందూర్ అంటూ నామకరణం చేశారు. ఆపరేషన్ సిందూర్ తమ జీవితాల్లో ఎంతటి ప్రాముఖ్యత సంతరించుకుందో చాటుకున్నారు. సిందూర్ అనేది ఇప్పుడు కేవలం ఒక పేరు కాదని, ఒక భావోద్వేగానికి, దేశం పట్ల గౌరవానికి ప్రతీక అని కుషీనగర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌కే షాహి తెలిపారు. బెడిహరి గ్రామానికి చెందిన అర్చనా షాహి ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇటీవల ఆడశిశువుకు ఆమె జన్మనిచ్చారు. పాపకు సిందూర్ పేరు పెట్టాలని ముందే నిర్ణయించుకున్నట్టు చెప్పారు. పహల్గాం ఉగ్రదాడిలో పలువురు మహిళలు తమ భర్తలను పోగొట్టుకుని పసుపుకుంకుమలను కోల్పోయారని, ఆపరేషన్ సిందూర్ అందర్నీ గర్వంగా తలెత్తుకునేలా చేసిందని చెప్పారు. ఆ కారణంగానే తమ ఆడబిడ్డకు సిందూర్ పేరు పెట్టుకున్నామని చెప్పారు. కాగా, సిందూర్ పేరు తమకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని ఆమె భర్త అజిత్ షాహి తెలిపారు. పడ్రౌనా ఏరియాలోని మదన్ గుప్తా కుటుంబ సభ్యులు కూడా ఇదే సెంటిమెంట్ వ్యక్తం చేశారు. గుప్తా కోడలు కాజల్ గుప్తా కొత్తగా పుట్టిన తన ఆడశిశువుకు సిందూర్ పేరు పెట్టారు. ఈ పేరుతో ఆపరేషన్ సిందూర్ ఎప్పటికి తమకు గుర్తుండిపోతుందని, అందరూ గర్వించే క్షణాలుగా తాము ఆ సందర్భాన్ని సెలబ్రేట్ చేసుకుంటామని చెప్పారు. తనకు పుట్టిన ఆడశిశువుకు సిందూర్ పేరు పెట్టుకోవడం గర్వకారణంగా భావిస్తున్నట్టు భతాహి బాబు గ్రామానికి చెందిన మరో మహిళ తెలిపింది. సిందూర పెరిగి పెద్దయిన తర్వాత తన పేరుకు అర్థం తెలుసుకుని భరతమాతకు పేరు తెస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పింది. ఆపరేషన్ సిందూర్‌కు గౌరవ సూచకంగా తన శిశువుకు సిందూర్ పేరు పెట్టుకున్నట్టు పడ్రౌన ప్రాంతానికి చెందిన ప్రియాంక దేవి తెలిపారు.



## పాక్ మిరేజ్‌ను కూల్చివేసిన భారత్

**న్యూఢిల్లీ, మే 12:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' ను విజయవంతంగా చేపట్టిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన వీడియోను భారత ఆర్మీ తాజాగా విడుదల చేసింది. పాకిస్థాన్‌కు చెందిన మిరాజ్ యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు ఈ వీడియో ద్వారా భారత్ స్పష్టం చేసింది. 'గగనతలంలో శత్రువును ధ్వంసం చెయ్' అన్న క్యాప్షన్‌తో వీడియోను పంచుకుంది. ఈ వీడియోలో పాక్ మిరాజ్ శిథిలాలను కూడా చూపింది. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. మరోవైపు ఆపరేషన్ సిందూర్ గురించి ఇవాళ త్రివిధ దళాలు మీడియా సమావేశం నిర్వహించాయి. మూడు దళాలకు చెందిన డీజీ ఎంవోలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## భారత్ దాడులకు బంకర్‌లో దాక్కున్న పాక్ ఆర్మీచీఫ్



**ఇస్లామాబాద్, మే 12:** ఆపరేషన్ సింధూర్ దెబ్బకు పాకిస్థాన్‌కు ముచ్చెమటలు పట్టినట్లుగా భారత ఆర్మీ విడుదలచేసిన విడియోలను బట్టి అర్థం అవుతోంది. భారత్ చేసిన దాడులకు సంబంధించిన చిత్రాలను, విడియోలను భారత్ డిజిఎంఒ విడుదలచేసారు. విడియోల్లో పాకిస్థాన్‌కు భారీ నష్టం జరిగినట్లు కనిపించింది. ఇదిలా ఉండగా భారత్ జరిపిన దాడుల్లో నూర్ ఖాన్ వైమానికస్థావరం తీవ్రంగా నష్టపోయి నట్లు చైనా విడుదల చేసిన ఉపగ్రహ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. ఇక ఆ సమయంలో పాకిస్థాన్ ఆర్మీ ఆసిమ్ మునీర్ బంకర్‌లో దాక్కునట్లు తెలుస్తోంది. శనివారం తెల్లవారు ఝామున భారత క్షిపణులు నూర్‌ఖాన్ వైమానిక స్థావరంపై విరుచుకుపడి ఊహించనిరీతిలో దెబ్బ తీసాయి. దీనితో ఆసిమ్‌మునీర్ బెంబేలెత్తి పోయాడు వెంటనే రావల్పిండిలోని జనరల్ హెడ్‌క్వార్టర్స్‌లోని స్ట్రాంగ్ బంకర్‌లోకి తీసుకెళ్లిపోయినట్లు సమాచారం. నూర్‌ఖాన్ అత్యంత సున్నితమైన సైనిక ప్రాంతం. ఇక్కడ చాలా ప్రధానమైన స్క్వాడ్రాన్‌లు ఉంటాయి. సైనిక సరకు రవాణా సదుపాయాలు ఉంటాయి. సీ-130 ట్రాన్స్‌పోర్టర్‌ల వంటి కీలకమైన ఆస్తులను కలిగి ఉంటుంది. అంతేకాకుండా సాబ్-2000 సైనిక ఉపకరణాల రవాణా విమానాలు కూడా నిలిపి ఉంచుతారు. ఇక గాల్లోనే విమానాలకు ఇంధనాన్ని నింపే ఐఎల్-78 వంటి రీఫ్యూయలర్ విమానాలతోపాటు వివిఐపిలకు సంబంధించిన చిన్న విమానాలకు ఇదే కీలక స్థావరం. అలాగే భవిష్యత్ వైమానిక దళ నాయకులకు శిక్షణాస్థలం కూడా ఇక్కడే ఉంది. ఈ ప్రాంతం పాకిస్థాన్ వ్యూహాత్మకప్రణాళికలకు కీలకమైన ప్రాంతం. ఇక్కడినుంచే అణ్వాయుధ సామగ్రిని పర్యవేక్షిస్తుందిభద్రపరుస్తుంది. ప్రస్తుతం పాక్‌లో 170 లేదా అంతకంటే ఎక్కువ వార్‌హెడ్‌లు ఉన్నట్లు అంచనా. ఈ వార్‌హెడ్‌లు పాక్ వ్యాప్తంగా వివిధప్రాంతాల్లో ఉన్నట్లు సమాచారం. కేవలం 3 గంటల్లోనే నూర్‌ఖాన్, రఫీఖీ, మరిద్, సుక్కూర్, సియాల్‌కోట్, పస్రూర్, చునియన్, సర్గోధ, స్కారు, భోలారి జాకోబాద్‌ల తోసహా 11స్థావరాలపై భారత్ దాడిచేసినట్లు మే 11న జరిగిన సంయుక్త విలేకరుల సమావేశంలో డిజిఎంఒ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్‌ఘాయ్ అన్నారు. పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది.

## ఉగ్రవాదిని మౌలానాగా చూపించే యత్నం

### అడ్డంగా బుక్ అయిన పాక్

**న్యూఢిల్లీ, మే 12:** సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషించే క్రమంలో పాకిస్థాన్ తప్పుల మీద తప్పులు చేస్తోంది. తాజాగా ఆ దేశం మరో తప్పు చేస్తూ అడ్డంగా దొరికిపోయింది. అగ్రరాజ్యం అమెరికా ప్రకటించిన ఉగ్రవాది హాఫీజ్ అబ్దుర్ రవుఫ్‌ను మౌలానాగా చిత్రీకరించే ప్రయత్నాన్ని పాక్ చేసింది. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో మరణించిన ఉగ్రవా దులకు పాకిస్థాన్‌లో ఇటీవల అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాఫీజ్ అబ్దుర్ రవుఫ్ మోలానాగా వ్యవహరించారు. అందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. అంతేకాదు ఈ ఆపరేషన్‌లో మరణించిన ఉగ్రవాదుల శవ పేటికలకు పాకిస్థాన్ జాతీయ జెండాలను చుట్టారు. అదే సమయంలో హాఫీజ్ రవుఫ్ పక్కనే ఆర్మీ అధికారులు సైతం ఉన్నారు. అయితే మీడియా ముందుకు వచ్చే సమయంలో హాఫీజ్ టోపి ధరించాడు. ఆర్మీ అధికారులు సూచన మేరకే అతడు టోపీ ధరించాడనే చర్చ అయితే జరుగుతోంది. హాఫీజ్ రవుఫ్ చిత్రాలు బహిర్గతం కావడంతో భారత్ అధికారులు న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్పందించారు. ఈ ఫోటోను వివరిస్తూ పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని బహిరంగంగా ప్రోత్సహిస్తుందనడానికి ఇది తిరుగులేని రుజువు అని వారు కుండబద్దలు కొట్టారు. మరోవైపు హాఫీజ్ రవుఫ్ చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఉగ్ర వాద సంస్థలను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌పై సర్వత్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అంతేకాదు జైషే మహమ్మద్ మసూద్ అజార్ సోదరుడే ఈ హాఫీజ్ రవుఫ్.

## పాక్ ఊసరవెల్లి, ఆ మాటలు నమ్మొద్దు

### బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ భారత్‌కు హెచ్చరిక




**క్వెట్టా, మే 12:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సింధూర్ చేపట్టి పాకిస్థాన్ లోని, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై భారత్ సర్జికల్ స్ట్రైక్స్ చేసింది. ఈ దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు ప్రాణాలు కోల్పోయారు. ఇదే సమయంలో పాకిస్థాన్ సైన్యం నియంత్రణ రేఖ వెంట కవ్వింపులకు పాల్పడటంతో భారత్ తిప్పికొట్టింది. ఈ క్రమంలో కాల్పుల విరమణ కోసం పాకిస్థాన్ చేసిన ప్రతిపాదనకు భారత్ అంగీకారం తెలిపింది. ఈ నేపథ్యంలో బలూచ్ లిబరేషన్ ఆర్మీ స్పందించింది. పాకిస్థాన్ మాయ మాటలు నమ్మి మోసపోవద్దని పరోక్షంగా హెచ్చరించింది. పాకిస్థాన్ ఊసరవెల్లిలా రంగులు మారుస్తుందని వ్యాఖ్యానించింది. పాకిస్థాన్ నుంచి వినిపించే శాంతి, కాల్పుల విరమణ, సోదరభావం ప్రవచనాలు కేవలం మోసమని పేర్కొంది. ఆ దేశంతో అప్రమత్తంగా ఉండాలని సూచించింది. బలూచ్ లిబరేషన్ ఆర్మీకి విదేశీ మద్దతు ఉందంటూ వస్తున్న విమర్శలను బలూచిస్థాన్ తోసిపుచ్చింది. తాము కీలు బొమ్మలం కాదని, పాకిస్థాన్ ఏం చేసినా చూస్తూ మౌనంగా ఉండబోమని పేర్కొంది. ఈ ప్రాంతానికి సంబంధించి ప్రస్తుత, భవిష్యత్తు సైనిక, రాజకీయ, వ్యూహాత్మక నిర్మాణంలో తమకు సరైన స్థానం ఉందని చెప్పింది. తనను తాను డైనమిక్, నిర్ణయాత్మక పార్టీగా అభివర్ణించుకుంది. పాకిస్థాన్లోని బలూచ్ ప్రావిన్స్‌లో చమురు, బొగ్గు, బంగారం, రాగి, సహజ వాయువు పుష్కలంగా ఉన్నాయని తెలిపింది. అయితే దేశ వ్యవసాయ యోగ్య భూమిలో బలూచ్ వాటా కేవలం 5 శాతం మాత్రమేనని వెల్లడించింది. బలూచ్‌లో కఠినమైన ఎడారి వాతావరణం ఉంటుందని, అందుకే పేదరికం ఎక్కువని బీఎల్‌ఏ తెలిపింది. ఎడారి ప్రాంతం కావడంతో జనాభా తక్కువగా ఉంటుందని, అందుకే అభివృద్ధికి దూరంగా ఉందని పేర్కొంది. అందుకే బలూచ్‌లో అనిశ్చితి నెలకొని వేర్పాటువాదులు శక్తిమంతమయ్యారని చెప్పింది. ప్రత్యేక దేశం ఏర్పాటు చేయాలని బలూచ్ ప్రజలు దశాబ్దాలుగా పోరాడుతున్నారని తెలిపింది.

## మూడు రోజులు అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు

**న్యూఢిల్లీ, మే 12:** భారత వాతావరణ శాఖ ప్రజలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా పలు చోట్ల రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతుంటే, మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరుగా వర్షాలు పడుతున్నాయి. ఈ క్రమంలోనే రానున్న మూడు రోజుల పాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ ఐఎండి హెచ్చరికలు జారీ చేసింది. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురిస్తే, మరోవైపు వేడి గాలులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఐఎండీ అంచనా ప్రకారం మే 12 నుంచి 15 వరకు ఉరుములు మెరుపులతో పాటు బలమైన గాలులు వీస్తాయి. ఇవి కొన్ని ప్రాంతాల్లో ఉపశమనం కలిగించేలా ఉంటే, మరికొన్ని చోట్ల ఆందోళనకరంగా ఉంటాయని ఐఎండీ పేర్కొంది. దేశరాజధాని ఢిల్లీలో రానున్న ఐదు రోజుల పాటు వాతావరణం చల్లగా ఉంటుందని సూచించింది. తేలికపాటి వర్షాలు పడతాయని తెలిపింది. విభిన్న వాతావరణ మార్పులు కారణంగా మే 11,12 తేదీల్లో జమ్మూకశ్మీర్, లద్ధాఖ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో 40-60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని అంచనా వేసింది. ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలున్నాయని, ఈ రాష్ట్రాలైన అరుణాచల్‌ప్రదేశ్, అసోం, మేఘాలయ, నాగాలాండ్, మిజోరాం, మణిపూర్, త్రిపుర రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. ముఖ్యంగా అసోం, మేఘాలయ రాష్ట్రాల్లో వర్షపాతం ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, ఒడిశా, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు 24 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉన్నట్లు ఐఎండీ అంచనా వేసింది. బెంగాల్, బిహార్, ఝార్ఖండ్ తూర్పు ఉత్తరప్రదేశ్‌లో వేడి గాలులు వీస్తాయని పేర్కొంది. ఇక ఉత్తరప్రదేశ్‌లోని 20 జిల్లాలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది ఐఎండీ. ఆదివారం ఆగ్రాలో గంటకు 80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. దీంతో హోర్డింగ్స్, చెట్లు కూలిపోవడం వంటివి జరిగాయి.

## టిబెట్, పాక్‌లో భూకంపం: తీవ్రత 5.7గా నమోదు



**టిబెట్, మే 12:** టిబెట్‌లో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలు పై భూకంప తీవ్రత 5.7గా నమోదు అయింది. సోమవారం తెల్లవారుజాము 2.41 గంటలకు ఈ భూకంపం సంభవించింది. ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణ నష్టం లేదని అక్కడి అధికారులు వెల్లడించారు. అర్ధరాత్రి 2.41 గంటల సమయంలో భూకంపం వచ్చినట్లు జాతీయ భూకంప పరిశోధనా కేంద్రం వెల్లడించింది. దేశవ్యాప్తంగా ప్రకంపనలు వచ్చినట్లు పేర్కొంది. మూడు రోజుల కిందట కూడా టిబెట్‌లో భూకంపం వచ్చింది. అయితే, అది రిక్టర్ స్కేల్‌పై 3.7గా నమోదైంది. ఎన్‌సీఎస్ తెలిపిన వివరాల ప్రకారం.. భూకంపం 10 కిలోమీటర్ల లోతులో సంభవించిందని, దీనివల్ల భూకంపం తర్వాత ప్రకంపనలు వచ్చే అవకాశం ఉందని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. కాగా మే 8న భూకంపం వచ్చిందని, అది 3.7 తీవ్రతతో ఈ ప్రాంతాన్ని కుదిపేసిందని పేర్కొంది. ఇలాంటి భూకంపాలు భూమి ఉపరితలానికి దగ్గరగా ఎక్కువ శక్తిని విడుదల చేయడం వల్ల లోతైన భూకంపాల కంటే ప్రమాదకరమైనవని, ఇది బలమైన భూప్రకంపనలకు భవన నిర్మాణాలు కూలిపోయి ప్రాణ నష్టాన్ని కలిగిస్తుందని ఎన్‌సీఎస్ తెలిపింది. పాక్‌ను వణికించిన భూకంపం భారత్ చేపట్టిన ప్రతీకార దాడులతో అల్లాడిపోయిన పొరుగు దేశం పాకిస్థాన్‌ను వరుస భూకంపాలు వణికిస్తున్నాయి. శనివారం ఉదయం పాక్‌లో భూ ప్రకంపనలు నమోదైన విషయం తెలిసిందే. మూడు రోజుల వ్యవధిలోనే తాజాగా మరోసారి అక్కడ భూమి కంపించింది. సోమవారం మధ్యాహ్నం 1:26 గంటల సమయంలో భూమి ఒక్కసారిగా కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 4.6గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు తెలిపింది. ఈ భూ ప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్లు, కార్యాలయాల నుంచి బయటకు పరుగులు తీశారు. అంతకుముందు శనివారం తెల్లవారుజామున 01.44 గంటలకు పాకిస్థాన్‌లో భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. రిక్టర్ స్కేల్‌పై భూకంపం తీవ్రత 4.0గా నమోదైంది. ఇటీవల పాక్‌లో వరుస భూకంపాలు సంభవిస్తున్నాయి. పాక్ యురేషియన్, ఇండియన్ టెక్టోనిక్ ప్లేట్లు కలిసే ప్రదేశంలో ఉంది. దాంతో తరచుగా అక్కడ భూకంపాలు వస్తుంటాయి. బలూచిస్తాన్, ఖైబర్ పఖ్తున్ఖ్వా, గిల్గిట్‌బాల్టిస్థాన్ తదితర ప్రాంతాలు యురేషియన్ ప్లేట్ దక్షిణ అంచున ఉండడం వల్ల భూకంపాల బారినపడుతున్నాయి.

## రహస్యాలకు యత్నిస్తున్న పాక్ గూఢచారులు

### వెల్లడించిన భారత నిఘా వర్గాలు



**న్యూఢిల్లీ, మే 12:** భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తగ్గించడానికి ఇరుదేశాలు ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో పాక్ గూఢచారులు మాత్రం భారత రహస్యాలను తెలుసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. తమకు తాము భారత్ రక్షణ శాఖ అధికారులుగా పేర్కొంటూ జర్నలిస్టులకు ఫోన్‌చేసి 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించి సైనిక అధికారులు చేసే బ్రీఫింగ్, పాక్ విషయంలో చేసే ప్రణాళికలు మొదలైన సమాచారాన్ని సేకరిస్తున్నారని భారత నిఘా వర్గాలు పేర్కొన్నారు. పాక్ దాడిలో భారత్‌లోని ఏయే ప్రాంతాల్లో ఎంత నష్టం జరిగిందనే విషయాలపై కూడా వారు ఆరా తీస్తున్నట్లు వెల్లడించాయి. ఇతర జర్నలిస్టులు, పలువురు పౌరులకు కూడా గూఢచారుల నుంచి ఫోన్‌కాల్స్ వస్తున్నట్లు సమాచారం. ఈ కాల్స్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ నుంచి వస్తున్నట్లు చూపిస్తున్నా యని, కానీ భరాత అధకారులెవరూ అటువంటి కాల్స్ చేయరని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. అటువంటి కాల్స్ వస్తే ఆన్సర్ చేయవద్దని తమకు సమాచారం ఇవ్వాలని సూచించాయి. ప్రస్తుతం భారత్, పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతోంది.

ఇందులో భాగంగా నేడు ఇరుదేశాల సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్‌ల మధ్య హాట్‌లైన్‌లో చర్చలు జరగను న్నాయి. భారత్, పాక్ చర్చల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోబాల్, త్రివిధ దళాధిపతులు, పలువురు ఉన్నతస్థాయి సైనికాధికారులతో సమావేశమయ్యారు.

## మా యుద్ధవిమానం ధ్వంసమైంది

### దాయాది దేశం అంగీకారం

**ఇస్లామాబాద్, మే 12:** ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌కు భారీ నష్టం కలిగించామని, ఆ దేశ అత్యాధునిక యుద్ధ విమానాలను నేలకూల్చామని భారత సైన్యం వెల్లడించిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా పాకిస్థాన్ ఆర్మీ స్పందించింది. తమ ఫైటర్ జెట్ ఒకటి ధ్వంసమైన మాట వాస్తవమేనని అంగీకరించింది. అయితే, అది స్వల్పమేనని పేర్కొనడం గమనార్హం. పాక్ ఆర్మీ అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్‌చౌధరీ.. తమ దేశ ఎయిర్‌ఫోర్స్, నేవీ అధికారులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ 'భారత్‌తో జరిగిన సైనిక ఘర్షణల్లో మన వాయుసేనకు చెందిన ఓ యుద్ధ విమానం స్వల్పంగా ధ్వంసమైంది' అని వెల్లడించారు.

## చత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం


## 13 మంది మృతి, మరో 30 మందికి గాయాలు



**నయారాయ్‌పూర్, మే 12:** పెళ్లి వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి 13 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 30 మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ శాతం మహిళలే ఉన్నారు. వారితో పాటు నలుగురు చిన్నారులు కూడా ఈ ప్రమాదంలో మరణించారు. ఈ ఘటన చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్ బలోదబజార్ రోడ్డులోని సారగావ్ సమీపంలో జరిగింది. ఈ ప్రమాదం సోమవారం తెల్లవారు జామున జరిగినట్టు తెలుస్తోంది. పోలీసుల వివరాల ప్రకారం చటౌడ్ గ్రామానికి చెందిన కొందరు తమ కుటుంబ సభ్యుల వివాహ వేడుకలో పాల్గొనడానికి చౌతియా ఛత్తీ గ్రామానికి వెళ్లినట్టు తెలుస్తోంది. అయితే వివాహం పూర్తయ్యాక ఓ వాహనంలో రాయ్‌పూర్‌కు బయల్దేరారు. వారు ప్రయాణిస్తున్న వాహనం బలోదబజార్ రోడ్డులోని సారగావ్ సమీపంలోకి రాగానే వేగంగా వచ్చిన ఓ ట్రక్కు ఆ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 13 మంది మృతి చెందగా 30 మందికిపైగా గాయపడ్డారు. అందుకున్న సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలతో పాటు గాయపడిన వారిని స్థానిక హాస్పిటల్‌కు తరలించారు. అయితే గాయపడిన వారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఇక మృతుల్లో తొమ్మిది మంది మహిళలతో పాటు నలుగు చిన్నారులు ఉన్నట్టు జిల్లా ఎస్పీ వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయ్‌పూర్ ఎస్పీ లాల్ ఉమ్మెద్ సింగ్ తెలిపారు.

# కోనలో వైభవంగా నృసింహుని తిరుకళ్యాణమహోత్సవం

## పట్టువస్త్రాలను సమర్పించిన టిటిడి దేవస్థానం



**రాపూరు (నెల్లూరు), మే 12, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహా స్వామి వారికి నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో బాగంగా సోమవారం స్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఇందులో బాగంగా ఉదయం శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారికి, శ్రీ ఆదిలక్ష్మీ అమ్మవారికి, శ్రీ అంజనేయ స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఉదయం 9 గంటలకు స్వామి ఆరి ఆస్థానమండపంలో పల్లకిలో స్వామి,అమ్మవార్లను వుంచి ఉభయ కర్తలు పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి,వారిని ఉభయ దేవేరులతో పల్లకీలో తీసుకోని వచ్చి స్వామి వారి కళ్యాణ మండపంలో వుంచారు. ఈ సందర్బంగా తిరుమల తిరుపతి దేవస్థానం వారు స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. స్వామి వారికి కళ్యాణ తలంబ్రాలను ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ,ఆలయ సేవా కమిటీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డిలు ఆందజేశారు. అనంతరం స్వామి వారి కళ్యాణ మండపంలో స్వామి,అమ్మవార్ల కళ్యాణాన్ని ఆలయ ఆర్చక స్వామలు వేమంత్రోచ్ఛ రణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి కళ్యాణ విశిష్టతను,స్వామి,అమ్మ వారి గోత్రాలను, గుంటూరుకు చెందిన పుల్లాభట్ల వెంకటేశ్వర్లు చక్కగా భక్తులకు ఆర్థమయ్యే రీతిలో వివరించారు. అనంతం స్వామి అమ్మవార్లకు తలంబ్రాలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ, సింధు దంపతులు, సేవా కమిటీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి,అనిత దంపతులు, ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, ఆలయ సీనియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ,దేవాదాయ శాఖ ఇఒ నూతలపాటి శ్రీధర్ నాయుడు,

గోనుపల్లి సర్పంచ్ గోతాటి నారాయణమ్మ, సేవా కమిటీ సభ్యులు రంగినేని వెంకటరమణయ్య, పీర్ల సోమయ్య, బొట్టా హజరత్ నాయుడు, తోట క్రిష్ణయ్య, శ్రీశైలం భార్గవ రామ్, కిన్నెర నరసింహా రావు,పెమ్మసాని సుగుణమ్మ,మోమిడి నరసింహులు, బోగులు బాస్కర రెడ్డి, బోతల శివ నాగేశ్వర రావు,దాసరి బాస్కర నాయుడు, యం.నవక్రిష్ణ చౌదరి, ఈతముక్కల యోగేశ్వర రావు వున్నారు.

# ప్రపంచగతిని మార్చిన ధర్మం బౌద్ధం

## బుద్ధ జయంతి సభలో మండలి బుద్ధప్రసాద్



ధమ్మవసి తీయగూర సోతా రామం, రచించిన గౌతమ బుద్ధ నృత్యరూపకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మండలి బుద్ధప్రసాద్.గుమ్మడి గోపాలకృష్ణ తదితరులు

**విజయవాడ,మే12,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచగతిని మార్చిన ధర్మం బౌద్ధమార్గమని అధికార భాషా సంఘం పూర్వాధ్యక్షులు అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఒక సంతుష్టమై జీవనగతి కోసం గౌతమ బుద్ధుడు సాగించిన అన్వేషణ,భిన్న మనో ఆవిష్కరణలకు తావిచ్చిందన్నారు.సమాజం పట్ల.పరస్పర సంఘ జీవనం,శాంతి, హేతుబద్ధ ఆలోచనకు దారి తీసిందన్నారు.సోమవారం గౌతమ బుద్ధుని జయంతి సందర్భంగా అవనిగడ్డ నియోజకవర్గం లోని బౌద్ధ క్షేత్రమైన ఘంటసాలలో రాష్ట్ర సృజనాత్మక సంస్కృతి సమితి, భాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శయన బుద్ధ ప్రాజెక్ట ప్రాంగణంలో బుద్ధ జయంతి మహోత్సవాలు ఘనంగా జరిగాయి.ఈ సభ అధ్యక్షత వహించిన మండలి మాట్లాడుతూ అందరికీ 2,569 వ బుద్ధ జయంతి శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు. బోధి వృక్షం నీడన తపోదీక్ష ద్వారా తన హృదయంలో వెలిగిన జ్ఞానజ్యోతి కాంతుల్ని ప్రపంచానికి పంచాలని సత్సంకల్పంతో ఆధ్యాత్మిక యాత్ర ప్రారంభించిన గౌతమ బుద్ధుని జన్మ దినం వైశాఖ పౌర్ణమి అని, బుద్ధుని జననం, బోధి ప్రాప్తి, మహాపరి నిర్వాణం అన్ని ఈ పౌర్ణమి నాడే సంభవించాయన్నారు. ఇదివరకు 2017 లో బుద్ధ జయంతి ఉత్సవాలను ఘంటసాల లో ఘనంగా నిర్వహించామన్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు కనక మేడల రవీంద్ర కుమార్ మాట్లాడుతూ మరుగున పడిన రాష్ట్ర రాజధాని అమరావతికి పూర్వ వైభవం తీసుకుని వస్తున్న విధంగానే రాష్ట్ర ప్రభుత్వం బౌద్ధ క్షేత్రమైన ఘంటసాల ఘన చరిత్రను ప్రాచుర్యం కల్పించే ప్రాజెక్ట చేపట్టడం సంతోషదాయకమన్నారు.బౌద్ధ సాహితీ చారిత్రిక సదస్సులో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసారు.

ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రముఖ బౌద్ధ క్షేత్రమైన ఘంటసాలకు పూర్వవైభవం తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ పేర్కొన్నారు.



# డివైడర్‌ను ఢీకొట్టిన ఆర్టీసి బస్సు 30 మందికి గాయాలు

**చంద్రగిరి, మే 12 ప్రభాతవార్త:** రక్తదాహం తీరని జాతీయ రహదారిపై అర్ధరాత్రి వేళ క్షణ కాలం డ్రైవర్ కునుకు తీశాడేమో వేగంగా డివైడర్‌ను ఢీ కొట్టడంతో 30 మంది తీవ్ర గాయాలపాల య్యారు. తిరుమల డిపో ఆర్టీసి బస్సు తిరువణ్ణామలై నుండి తిరుమలకు వస్తుండగా తిరుపతి జిల్లా చంద్రగిరి మండల పరిధిలోని అగరాల వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. డివైడర్‌ను ఢీకొట్టిన ధాటికి బస్సు ముందు భాగం ఛిద్రమైంది. అదృష్టవశాత్తు డ్రైవర్, కండక్టర్ సహా ప్రయాణికులు ప్రాణాపాయ స్థితి నుండి గాయాలతో బయటపడ్డారు. ఆదివారం రాత్రి 12.30 గంటల సమయంలో ప్రమాదం జరగడంతో సిఐ సుబ్బరామిరెడ్డి తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనాల ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ రాజారెడ్డిపై కేసు నమోదు చేశారు. పోలీసులు ప్రమాదానికి గురైన బస్సును క్రేన్ సాయంతో తొలగించారు.

# యుద్ధం ఉద్రిక్తతల ఎఫెక్ట్ !

## వేసవి సెలవుల్లోనూ తిరుమలలో మోస్తరుగా భక్తులు

**తిరుమల,మే 12ప్రభాతవార్తప్రతినిధి:** భారత్ -పాక్ మధ్య మొన్నటివరకు నెలకొన్న ఉద్రిక్త యుద్ధ పరిస్థితులు...రాష్ట్రవ్యాప్తంగా భద్రతా పరంగా పటిష్ట తనిఖీలతో కలియుగవైకుంఠం తిరుమలకు వేసవిసెలవుల్లోనూ భక్తుల సంఖ్య మోస్తరుగానే ఉంది. వేసవిసెలవులు నేపథ్యంలో కొండపై భక్తుల సంఖ్య అనూహ్యంగా రద్దీగా కనిపిస్తుంది. అందునా సామాన్యభక్తులకు దేవదేవుని దర్శనం సులభంగా తక్కువ సమయంలో చేయించేందుకు మే 1వతేదీ నుండి జులై 15వతేదీ వరకు విఐపి బ్రేక్ దర్శనాలు రద్దుచేయడం, సిఫార్సులేఖలు నిలుపుదలతో తిరుమలకు వచ్చే పలుకుబడి కలిగిన, డబ్బున్న ధనవంతుల భక్తుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ఇందుకు తార్కాణంగా గత ఏప్రిల్ నెలలో వేసవిసెలవులు ఆరంభంలో దేశం నలుమూలల నుండి రెండువారాలు భారీగా భక్తులు తిరుమలకు రావడం, ఏకంగా సర్వదర్శనానికి 20నుండి 24గంటల సమయం కేటాయించారు. అలాంటిది ఒక్కసారిగా మేనెల 1వతేదీ నుండి తిరుమలలో భక్తుల సంఖ్య తగ్గింది. మేనెల 1వతేదీ 57,863మంది భక్తులు మహాలఘులో స్వామివారిని దర్శించుకున్నారు. 2వతేదీ 74,344మంది, 3న 84,113మంది, 4న 83,380, 5న 65,095, 6వతేదీ 69,214మంది, 7న 71,001, 8న 64,850, 9వతేదీ 68,213మంది భక్తులు, 10న శనివారం రోజు 85,078మంది, 11వతేదీ ఆదివారం 80,43మంది ఇలా వరుసగా 70వేలమందికి తగ్గకుండా దర్శనం చేసుకోగలిగారు. ఈ సంఖ్యను బట్టి కొండపై వేసవిసెలవుల్లోనూ సాధారణ రోజుల్లాగే మోస్తరుగానే భక్తులు వస్తున్నారనేది తెలుస్తుంది. కాగా సోమవారం సాయంత్రం 6గంటల వరకు 47వేలమంది భక్తులు మహాలఘులోనే శ్రీవారిని దర్శించుకున్నారు. ఇలా ఉండగా ప్రతిరోజూ ఆన్‌లైన్‌లో 300 రూపాయలు ప్రత్యేక దర్శనాల టిక్కెట్లు 25వేలు, ఆర్జితసేవలు 5వేలు,,ప్రత్యేక దర్శనాలు 2వేలు, ఆఫ్‌లైన్‌లో 20వేల వరకు ఉచిత టైమ్‌స్లాట్ టోకెన్లు భక్తులు అందుకుని దర్శనానికి తిరుమలకు వస్తున్నారు. ఇక ప్రోటోకాల్ దర్శనాలు 2వేలమంది వరకు, శ్రీవాణి బ్రేక్ దర్శనాలు ఆన్‌లైన్‌లో రోజువారీగా 500 టిక్కెట్లు, ఆఫ్‌లైన్‌లో రేణిగుంట విమానాశ్రయంలో 200 టిక్కెట్లు, తిరుమలలో 800టిక్కెట్లు జారీఅవుతున్నాయి. ఈ టిక్కెట్లు అందుకున్న భక్తులు నేరుగా నిర్దేశిత సమయానికి వైకుంఠమ్ 1 క్యూలైన్లో ఆలయంలోనికి చేరుకుంటే కేవలంనాలుగుగంటల్లోనే ఏడుకొండల వెంకన్న దర్శనం జరుగుతుంది. పాక్‌లో ఉద్రిక్తలతో తీవ్రవాదులు భయంతో కూడా తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య కొంతవరకు తగ్గిందనేది తెలుస్తోంది. మొత్తంమీద వేసవిసెలవులు తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగానే ఉంది. వచ్చిన సామాన్యభక్తులకు గదులు కూడా సులభంగానే కేటాయిస్తున్నారు.

# ఢిల్లీలో ఇనుప వ్యర్థాలతో జైహింద్ చక్ర

## రూప శిల్పి విజయవాడ శ్రీనివాస్ వడకండ్ల

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** ఇనుప వ్యర్థాలతో అర్థం ఇస్తూ విజయవాడకు చెందిన ప్రముఖ కళాకారుడు శ్రీనివాస్ వడకండ్ల తయారు చేసిన జైహింద్ చక్ర శిల్పం దేశ రాజధాని ఢిల్లీలో కొలువుతీరింది. నేషనల్ ఇంటిగ్రెటీ స్ఫూర్తితో రూపొందించిన ఈ శిల్పాన్ని పార్లమెంట్‌కు వెళ్ళే దారిలో రఫీ మార్గ్ చౌరస్తాలో ఇటీవల నెలకొల్పారు. శ్రీనివాస్,ఈ శిల్పం కోసం 1.5 టన్నుల ఆటోమొబైల్ ఇనుప వ్యర్థాలను వినియోగించారు. నెవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్(ఎన్ఎల్‌సిఐఎల్) అధ్వర్యంలో 10 అడుగుల ఎత్తు,వెడల్పు ఉన్న ఈ శిల్పాన్ని రూపొందించారు.??మన్ కీ బాత్‌లో ప్రధాని నరేంద్రమోడీ ప్రత్యేకంగా ప్రస్తావించారు.శిల్పిని అభినందించారు. మన్ కీ బాత్ 75వ ఎపిసోడ్‌లో శ్రీనివాస్ కళాఖండాల గురించి ప్రత్యేకంగా మాట్లాడారు. తాజాగా కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖకు చెందిన నెవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఎన్ఎల్‌సిఐఎల్) ఆధ్వర్యంలో ఈ శిల్పాన్ని తయారు చేశారు. స్వచ్ఛతాహీ సేవా క్యాంపైన్ 4.0లో భాగంగా దీనిని రూపొందించారు. జాతీయ పతాకం స్ఫూర్తితో ఈ కళాఖండాన్ని తయారు చేశారు. జాతీయ సమగ్రత, సాంస్కృతిక వైవిధ్యం కలగలిసేలా భారతీయ సంస్కృతి, విలువలు, సంప్రదాయాలను ప్రతిబింబించేలా దీనికి రూపకల్పన చేశారు. 1.5 టన్నుల ఇనుప వ్యర్థాల వినియోగం: పదడుగుల ఎత్తు, వెడల్పుతో తయారుచేసిన ఈ శిల్పం కోసం 1.5 టన్నుల ఆటోమొబైల్ ఇనుప వ్యర్థాలను వినియోగించారు. పైపులు, చిన్న ట్యాంకులు, నట్లు, బోల్టులు, క్లచ్‌ప్లేట్లు, బేరింగ్స్ ఇలాంటి వాటన్నింటినీ వినియోగించారు. బొగ్గు గనుల్లో వినియోగించే వాహనాల నుంచి పనికిరాకుండా పక్కన పడేసిన వ్యర్థాలతోనే దీనిని పూర్తిగా తయారుచేశారు. తమిళనాడులోని కడలూరులో ఉన్న ఎన్ఎల్‌సిఐఎల్ ప్రాంగణంలో మూడు వారాలు ఉండి ఈ శిల్పాన్ని శ్రీనివాస్ తన బృందంతో కలిసి తయారుచేశారు. అనంతరం దీనిని దిల్లీకి తీసుకెళ్లి రఫీ మార్గ్ చౌరస్తాలో నెలకొల్పారు.

# ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి

**నెల్లూరు క్రైమ్, మే 12, ప్రభాతవార్త :** నెల్లూరు నగరంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ ఢీకొనడంతో యువకుడు మృతి చెందాడు. నార్త్ ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు కోవూరు పట్టణ పరిధిలోని చుండుగుంట ప్రాంతానికి చెందిన నల్లబోతు సాయి వెంకట ప్రతాప్ (26) నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేసున్నారు. సోమవారం విధుల్లో చేరేందుకు తన స్కూటీపై ఆత్మకూరు బస్టాండ్ ఫ్లైఓవర్ వంతెన పై వెళుతుండగా వెనక నుండి వచ్చిన ట్రాక్టర్ అతివేగంతో వెళ్తున్న క్రమంలో ట్రాక్టర్ ట్రాలీ స్కూటీని ఢీకొంది. కింద పడిపోయిన ప్రతాప్ ట్రాలీ చక్రాల కింద చిక్కుకుపోయాడు. ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంతో వెళుతుండడంతో చక్రాల కింద నలిగిన ప్రతాప్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ట్రాక్టర్ వదిలి డ్రైవర్ పరారయ్యాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు నార్త్ ట్రాఫిక్ సిఐ రామకృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# నర్సులు అందిస్తున్న సేవలు అనన్య సామాన్యం

## డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్



ఉత్తమ సేవా అవార్డు అందుకున్న పిఠాపురం నర్సింగ్ సిబ్బందితో తన క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** దేవతలు ఎక్కడో ఉండరని,మన కళ్ళెదుటే ఉంటారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.అత్యవసర సమయాల్లో తమ ప్రాణాలకు తెగించి ఎందరికో ఊపిరిపోసే నర్సు అమ్మలను మించి దేవతలు ఎవ్వరుంటారన్నారు. కరోనా సమయంలో ఎంత మంది నర్సులు ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి సేవలందించారో మనం ఎప్పటికి మరవలేమన్నారు.అత్యాంత ఆందోళనకరమైన స్థితిలో రోడ్డు ప్రమాద క్షతగాత్రులు వచ్చినప్పుడు నర్సులు చేసే సేవలు తలుచుకుంటే ఎంతో ఆశ్చర్యం వేస్తుందంటూ పవన్ భావోద్వేగానికి గురయ్యారు.వైద్యరంగంలో నర్సులు అందిస్తున్న సేవలు అనన్య సామాన్యమని పవన్‌కళ్యాణ్ కొనియాడారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో రోగులకు స్వస్థత కలిగేలా వృత్తికి గౌరవాన్ని తీసుకువస్తున్నారని పేర్కొన్నారు.నిస్వార్థంగా వారు అందించే సేవలు వెలకట్టలేనివన్నారు.నర్సుల చేతి స్పర్శ కూడ రోగిలో మానసిక స్థైర్యంతో పాటు సాంత్వన కల్గిస్తుందని తెలిపారు.అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా పిఠాపురం నియోజకవర్గానికి చెందిన ప్రభుత్వ స్టాఫ్ నర్సులతో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు భేటీ అయ్యారు. ఉత్తమ సేవలు అందించిన ఎనిమిది మందిని సత్కరించారు.

# వివాహితుల జనాభాలో ఏపి దేశంలోనే నం.1

**విజయవాడ మే 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని సామాజికంశాలకు సంబంధించి వ్యత్యాసాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఆ మేరకు ప్రభుత్వం సమాచారాన్ని వెల్లడించింది. ఒకవైపు వివాహం అయిన జనాభాలో దేశంలో మొదటి స్థానంలో నిలిచిన రాష్ట్రం మరోవైపు వితంతు/విడాకులు తీసుకున్న/ విడిగా ఉంటున్న వారిలో మూడోస్థానం లో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ పురుషులు వివాహాల్లోనే కాకుండా వితంతు విడాకులు విడిగా ఉంటున్న వారి విభాగంలోనూ దేశంలో మొదటిస్థానంలో ఉన్నారు. మరోవైపు వివాహం అయిన మహిళల్లో అత్యధికంగా కేరళ , హిమాచల్‌ప్రదేశ్ తర్వాత మూడో స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్ అతివలు వితంతు విడాకులు విడిగా ఉంటున్న వారి విభాగంలో నాలుగోస్థానంలో ఉన్నారు. కేంద్రంతాజాగా విడుదల చేసిన శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టం నివేదిక ఈ వివరాలను తెలియజేస్తోంది. దీని ప్రకారం పెళ్లయిన వారిలో ఆంధ్రప్రదేశ్‌ది దేశంలో మొదటి స్థానం కాగా బిహార్ చివరి స్థానంలో నిలిచింది. జాతీయస్థాయిలో పెళ్లికానివారు 51.2% పెళ్లయినవారు 45.5% వితంతు/ విడాకులు/విడిగా ఉంటున్న వారు 3.3% మంది ఉన్నారు.

# కన్నుల పండుగగా వేదాద్రి యోగానంద శ్రీలక్ష్మీ నరసింహస్వామి కళ్యాణ మహోత్సవం



**జగ్గయ్యపేట, మే 12, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం వేదాద్రి గ్రామంలో వేంచేసివున్న శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి గం.12లకు కన్నుల పండుగగా జరిగింది. దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్‌బాబు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వెలగపూడి లక్ష్మణ ఇందిరాదత్తు తరపున కెసిపి సిమెంట్స్ ఏజిఎం రామ్‌ప్రసాదు ఆధ్వర్యంలో శ్రీభూనీళా సమేత శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి తిరుక్కళ్యాణ మహోత్సవం వేలాదిగా తరలివచ్చిన భక్తులను తన్మయులను చేసింది. స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) స్వామివారి కళ్యాణ వేడుకలో పాల్గొని సేవించారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన పరిమళ పుష్పాలాకృతమై శోభిల్లు కళ్యాణ మండపంలో శ్రీభూనీళ రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సహిత శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణోత్సవాన్ని పరాంకుశం వాసుదేవా చార్యుల యాజ్ఞికంలో దేవస్థాన అర్చకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణానంతరం తెల్లవారుఝామున స్వామివారికి గరుడసేవ, చలువ-చక్రపవాహన సేవలు నిర్వహించారు. తిరుపతి దేవాదాయశాఖ మల్టీజోన్-2 ప్రాంతీయ సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ కూడా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వెలగపూడి ఇందిరాదత్తు, శ్రీ బాల త్రిపుర సుందరి అమ్మవారి ట్రస్టు, కెసిపి లిమిటెడ్ ఫ్యాక్టరీ వారు పులిహోర, చక్రపొంగలి, మహాజన అన్నదానం, దేవస్థానంలో విద్యుద్దీపాలంకరణ, కళ్యాణ మండప అలంకరణ నిర్వహించి స్వామివారికి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు,ముత్యాల తలంబ్రాలు, పుష్పాలు, పూల మాలలు సమర్పించారు. రామ్‌కో సిమెంట్స్ వారు అత్యవసర వైద్య సదుపాయాలు, ఉచిత మందుల పంపిణీ శిబిరం నిర్వహించారు. సోమవారం రాత్రి తెప్పోత్సవం నిర్వహించారు.

# ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు గల్లంతు

**సంగం (నెల్లూరు), మే 12, ప్రభాతవార్త :** మండలకేంద్రమైన సంగంలోని కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువలో ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు గల్లంతైయ్యారు.విషయం తెలిసి సిఐ వేమారెడ్డి,ఎస్ఐ రాజేష్ తమ సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన ఇద్దరు చిన్నారులు కోవూరు మండలం చిన్నపడుగుపాడు ఎన్‌టిఎస్ సమీపంలో నివాసం ఉంటున్న బందా గోవిందయ్య, శేషమ్మ, బెలుదారి పనిచేస్తు జీవనం సాగిస్తు కుమారులను చదించుకుంటున్నారు. ఈ ఇద్దరు పిల్లలు అమ్మమ్మవాళ్ళ ఊరు అయిన సంగంకు వెళ్ళి గల్లంతైయ్యారు. పెద్ద కుమారుడు వెంకట చందు 10 వ తరగతికి వస్తాడు. చిన్నకొడుకు వెంకట నందకిషోర్ 8 వ తరగతికి వస్తాడని బందువులు తెలిపారు.

# వీర జవాన్ మురళి నాయక్ కోసం పాట పాడుతా

## - ప్రముఖ సింగర్ మంగ్లీ

**అనంతపురం, మే 12 ప్రభాతవార్త బ్యూరో** భారతదేశము, పాకిస్తాన్ మధ్య జరిగిన యుద్ధంలో అమరుడైన వీర జవాన్ మురళి నాయక్ త్యాగాలు వెలకట్టలేనివి అని, దేశ సరిహద్దుల్లో దేశం కోసం సైనికులు ఎంతో శ్రమిస్తూ త్యాగాలు కూడా చేస్తున్నారని, దేశం కోసం తన ప్రాణాల్ని పనంగా పెట్టిన మురళి నాయక్ త్యాగాలు గుర్తుచేస్తూ ఒక పాట కూడా పాడుతానని ప్రముఖ సింగర్ మంగ్లీ వెల్లడి పేర్కొన్నారు. సోమవారం మురళీనాయక్ తల్లిదండ్రులను పరామర్శించడానికి ప్రముఖ సింగర్ హైదరాబాద్ నుంచి శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లిగ్రామానికి విచ్చేసి మురళీనాయక్ మృతిపట్ల విచారం వ్యక్తం చేసి నివాళులు అర్పించి, మురళీనాయక్ తల్లిదండ్రులను పరామర్శించారు. అనంతరం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతున్న ప్రముఖ సింగర్ మంగ్లీ మాట్లాడుతూ.. ఇలా జరగడం చాలా బాధాకరమైన విషయం.. ఒక రకంగా చాలా గర్వంగా కూడా ఉందన్నారు. జవాన్ మురళీ నాయక్ ప్రాణత్యాగం దేశంగర్వించ తగ్గ విషయం అన్నారు. భారతదేశం మొత్తం కల్లి తాండా వైపు చూస్తోందన్నారు. మురళీనాయక్ వీర మరణం ఊరికి గొప్ప పేరు తెచ్చి పెట్టిందన్నారు. మురళీనాయక్ నాడు ఈ అమ్మకు మాత్రమే కొడుకు నేడు దేశంలోని ప్రతి మహిళకు ఒక కొడుకుగా నిలిచాడన్నారు. ప్రతి మహిళ నుదుటిన సింధూరం ధరించే సమయంలో మురళీనాయక్‌ను తలుచుకునే విధంగా ఆయన సింధూర్ ఆపరేషన్‌లో వీర మరణం పొందారన్నారు. ప్రభుత్వం మురళీనాయక్ కుటుంబం పట్ల భరోసాగా నిలవడం గొప్ప విషయమన్నారు.

# రెమ్యూనరేషన్ కోసం టీచర్లు ఎదురుచూపులు!

## సొంత డబ్బుతో ప్యాకింగ్ మెటీరీయల్ కొనుగోలు చేసిన వైనం - తెలిసినా పట్టించుకోని విద్యాశాఖ ఉన్నతాధికారులు

**అనంతపురం న్యూటౌన్, మే 12 ప్రభాతవార్త** పదో తరగతి పరీక్షలు, స్పాట్ వాల్యూషన్ విధులు ముగిసిన వెంటనే చెల్లించాల్సిన రెమ్యూనరేషన్, టిఏ, డిఏలను నేటికీ చెల్లించకపోవడం విద్యాశాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.పదో తరగతి పరీక్షలు ఫలితాలు వచ్చాయి...వచ్చే వారం నుండి సప్లిమెంటరీ పరీక్షలు కూడా ప్రారంభం కానున్నాయి. అయినా కూడా చెల్లించకపోవడంతో విద్యాశాఖపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 17 నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు పదో తరగతి రెగ్యులర్ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షల విధులకు అనంతపురం జిల్లాలో దాదాపు 1700 మంది ఇన్విజిలేటర్లు (ఉపాధ్యాయులు), దాదాపు 300 మంది సీఎస్, డీవో (హెచ్‌ఎం-ఉపాధ్యాయులు) హాజరైయ్యారు. వీరికి రెమ్యూనరేషన్‌తో పాటు టిఏ, డిఏ చెల్లించాల్సి వుంది. అదే విధంగా ఏప్రిల్ 3 నుండి 9వ తేదీ వరకు స్పాట్ వాల్యూషన్ (జవాబు పత్రాలు దిద్దడం) జరిగింది. ఈ విధులకు హాజరైన వందలాది మంది ఏఈ,సీఈలు (ఉపాధ్యాయులు)లకు రెమ్యూనరేషన్‌తో పాటు టిఏ, డిఏ కూడా చెల్లించాల్సి వుంది. అలాగే స్పెషల్ అసిస్టెంట్లకు కూడా రెమ్యూనరేషన్ చెల్లించాల్సి వుంది. ఇలా రెమ్యూనరేషన్, టిఏ, డిఏలు చెల్లించడానికి దాదాపు రూ.70 నుండి 80 లక్షలు చెల్లించాల్సి వుంది. ప్రతి ఎడాది పరీక్షలకు ముందుగానే మంజూరు చేయాల్సిన నిధులను ఉన్నతాధికారులు సకాలంలో మంజూరు చేయకపోవడంతో పదో తరగతి పరీక్షలు, స్పాట్ వాల్యూషన్ ముగిసి ఇప్పటికీ నెల అవుతోంది. ఫలితాలు కూడా విడుదల అయ్యాయి. ఈనెల 19 నుండి 28వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు కూడా జరుగుతున్నాయి. అయినా కూడా నేటికీ రెమ్యూనరేషన్, టిఏ, డిఏలను చెల్లించకపోవడంతో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు లబోదిబోమంటున్నారు.

అంతే కాకుండా పరీక్షల విధుల్లో ప్యాకింగ్ మెటిరీయల్‌ను కూడా సీఎస్, డీవోలు సొంత డబ్బుతో కొనుగోలు చేయడం గమనార్హం. అంతే కాకుండా 2023-24లో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన రెమ్యూనరేషన్, టిఏ, డిఏలను కూడా ఇంత వరకు చెల్లించలేదని ఉపాధ్యాయ సంఘాలు వాపోతున్నాయి.

# భారత్ సైన్యానికి రూ.3.15లక్షలు విరాళం



**తిరుపతి,మే 12ప్రభాతవార్తప్రతినిధి:** ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా దేశంకోసం ప్రాణాలు త్యాగంచేసిన వీరసైనికులకు మద్దతుగా ఇండియన్ ఆర్మీకి తిరుపతి ఆటోమొబైల్స్ అసోసియేషన్ విరాళం ప్రకటించింది. 3.15లక్షల రూపాలయు డిడిని విరాళంగా హోండా మోటార్స్ అదినేత పృధ్వీరెడ్డి పలువురు ఆటోమొబైల్స్ డీలర్లు సోమవారం సాయంత్రం తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌కు ఈ డిడిని అందజేశారు. దేశం కోసం నిరంతరం పోరాడుతున్న సైనికులకు మద్దతుగా నిలచిన డీలర్ అసోసియేషన్ ప్రతినిధులను జిల్లా కలెక్టర్ అభినందించారు.

# రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ చంద్ర శివయ్య వర్ధంతి

**విజయవాడ మే 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు అమరుడుకామ్రేడ్ చంద్ర శ్రీమన్నారాయణ 17వ వర్ధంతి సభను ఆయన స్వగ్రామమైన కమ్మవారిపాలెం గ్రామంలో జిల్లా నాయకుడు కోట్యా నాయక్ అధ్యక్షతన జరిగింది. ముందుగా అమర స్తూపం వద్ద ఎర్రజెండాను ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు ఆవిష్కరించి నివాళులు అర్పించారు. తరువాత కామ్రేడ్ చంద్ర శివయ్య చిత్రపటానికి ఆయన కుమారుడు, ఆయన సోదరులు గ్రామ సర్పంచి రైతు కూలీ సంఘ నాయకులు బంధువులు అభిమానులు పూలదండలతో ఘనంగా నివాళులర్పించారు. తర్వాత జరిగిన సభలో జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతాంగం తమ పంటలకు మద్దతు ధరలు కూడా లేక తీవ్రమైన సంక్షోభంలో ఉన్నారని అలాగే నిరుద్యోగం తాండవిస్తున్నదని ధరలు పెరిగి సామాన్యులు కొనుగోలు చేయలేని పరిస్థితిలో ఉన్నారని మహిళలు దళితులు మైనార్టీ ప్రజలు తమ మనుగడ కరువై బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారని అన్నారు. దాదాపు ఇవే సమస్యలతో అటు పాకిస్థాన్‌లో కూడా ప్రజలు ఎదర్కొంటున్నారని అన్నారు. వీటన్నిటికీ కారణం ఉభయ దేశాల వ్యవసాయ రంగంపై పూర్తిస్థాయిలో సామ్రాజ్యవాద బహుళ జాతికంపెనీలు పట్టు సంపాదించడమేనని అన్నారు. అంతేకాక భూములు, గనులు సముద్ర తీరం మొత్తం సామ్రాజ్యవాద బహుళ జాతి కంపెనీలు అప్పజెప్పడం కోసం భారత ప్రభుత్వం చట్టాలు చేసిందని ఆయా ప్రాంతాల్లో నివసించే రైతాంగాన్ని గిరిజన ప్రజలను ఆయా భూముల నుంచి అడవుల నుంచి ఖాళీ చేయిం చేందుకు వాళ్ళ మధ్య గొడవలు సృష్టించారన్నారు.

# దివ్యాంగునికి గంటలోనే ట్రై సైకిల్ పంపిణీ - కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారుడు

**విజయవాడ మే 12 ప్రభాతవార్త ప్రతినిధి:** దివ్యాంగుని వద్దకే వెళ్ళి సమస్యను ఆలకించి పరిష్కరిస్తానని ఇచ్చిన హామీని గంటలోపే అమలుచేసి దివ్యాంగుని కోరికను నెరవేర్చి మానవత్వాన్ని చాటుకున్న జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ సోమవారం ఉదయం కలెక్టరేట్ ఆవరణంలో అనుకోని సంఘటన జరిగింది. అగ్ని ప్రమాదాలు జరిగే సమయంలో పౌరులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఎలా ఉండాలి అనే అంశంపై నిర్వహించిన మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని ముగించుకుని తిరువూరు పర్యటనకు బయలుదేరుతున్న సమయంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చూపులు తనపైవు దీనంగా చూస్తున్న దివ్యాంగునిపై పడ్డాయి. ఆయనకు రెండు కాళ్లు పనిచేసి స్థితిలో లేవు. కలెక్టర్ వద్దకు నేరుగా వచ్చి సమస్యనూ చెప్పుకోలేని దీనస్థితి .దీంతో కలెక్టరే స్వయంగా దివ్యాంగుడు కూర్చున్న చోటికి వెళ్లారు. మోకాళ్లపై కూర్చున్నారు. ఆశగా చూస్తున్న దివ్యాంగుడిని చిరునవ్వుతో పలకరించి ఎక్కడి నుంచి వాచ్చరు. ఏమిటి పరిస్థితి ఎందుకోసం వచ్చారు అని అడిగారు. కలెక్టర్ ప్రశ్నలు విన్న దివ్యాంగుడు కన్నీటి పర్యంతమయ్యాడు. విజయవాడ పటమట 10వ డివిజన్‌కు చెందిన గద్దె తంబి తన చేతిలో ఉన్న ఆదార్ కార్డు తన వికలాంగత్వాన్ని నిర్ధారణ చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రి ఇచ్చిన ధ్రువీకరణ పత్రం కలెక్టర్‌కు చూపిస్తూ తనకు ఉపాధి ఏమీ లేదని నడవలేని స్థితిలో ఉన్నానని తనకు ట్రైసైకిల్ సమకూరిస్తే దాంతో జీవిస్తానని కలెక్టర్ డా.జి.లక్ష్మీశను అభ్యర్థించారు. కలెక్టర్ ఆ వికలాంగుడు ఇచ్చిన పత్రాలను పరిశీలించి తప్పకుండా సమస్యలు అధైర్య పడవద్దని ధైర్యం చెప్పారు.

13-5P□g7exHMNWJQE.qxd:13-5P□g7exHMNWJQE.qxd 01/01/01 9:32 AM Page 1



# తెలుగుదేశం పార్టీలో రాజుకున్న నామినేటెడ్ పోస్టుల భర్తీ చిచ్చు

**జగ్గయ్యపేట, మే 12, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీమంత్రి నెట్టెం రఘురామ్ స్థాయిని మరిచి ఇచ్చిన హామీకి తిలోదకాలిచ్చి ఆప్కాబ్ చైర్మన్ పదవిని కల్పించకుండా అవమానపర్చారంటూ టిడిపి నియోజకవర్గ నాయకులు, శ్రేణులు మండిపడుతున్నారు. గతంలో ఎక్సైజ్‌శాఖ మంత్రిగా పనిచేసిన రఘురామ్ 2024 సార్వత్రిక ఎన్నికల్లో విశేష పరిశ్రమచేసి పార్టీని జిల్లాలో జైత్రయాత్ర చేసే విధంగా సమన్వయంచేసి నాయకత్వ పటిమతో చేసిన పరిశ్రమకు, కృషికి గుర్తింపు లేకుండా కేవలం కెడిసిసి బ్యాంక్ చైర్మన్ పదవిని పార్టీ అధిష్టానం కల్పించి సముచిత స్థానం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందంటూ పార్టీ నేతలు తిరుగుబాటు స్వరం పెంచారు.

ఆప్కాబ్ చైర్మన్ పదవిని కల్పిస్తామని చెప్తూ కెడిసిసి చైర్మన్ పదవికి నియామకంచేసి తుదకు ఆప్కాబ్ చైర్మన్ పదవిని వేరొకరిని నియమించటాన్ని కార్యకర్తలు, ద్వితీయశ్రేణి నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. కెడిసిసి చైర్మన్ పదవి నియామకం జరిపే రోజునే ఆప్కాబ్ చైర్మన్ పదవి కల్పిస్తామని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి శ్రీనివాసరావు హామీ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. అయితే ఇది అమలుకాకపోవటంతో కార్యకర్తలు మండిపడుతున్నారు. కాగా సోమవారం స్థానికంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు మాట్లాడుతూ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలకు సరైన గుర్తింపు ఇవ్వకుంటే పార్టీ మనుగడ కష్టమవుతుందని అభిప్రాయపడ్డారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు పునరాలోచన చేయాలని నియోజకవర్గ ముఖ్యనాయకులు విజ్ఞప్తిచేశారు.
1995లో టిడిపి సంక్షోభంలో ఉన్నప్పుడు చంద్రబాబుకు తోడు నిలిచి నాటి నుండి నేటి వరకు పార్టీ శ్రేయస్సు కోసం అనేక త్యాగాలు చేసిన జెంటిల్‌మెన్‌కు రాష్ట్రస్థాయి పదవి ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయటం తగదని నిరసన వ్యక్తంచేశారు.

నిర్ణయం మార్చుకోకుంటే తామంతా తమ పదవులు వదులుకోడాన్కి సిద్ధంగా ఉన్నామని ఆల్టీమేటం జారీచేశారు. సమావేశంలో పార్టీ నేతలు మేకా వెంకటేశ్వర్లు, కట్టా వెంకటనరసింహారావు, వడ్లమూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగా స్వామి అమ్మవార్ల గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి, మే 12, ప్రభాతవార్త అమ్మలగన్నమ్మ బెజవాడ దుర్గమ్మవారి ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ సోమవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం 5.55 గంటలకు ఘాట్‌రోడ్డు వద్ద వేంచేసియున్న శ్రీ కామధేను మాత ఆలయం వద్ద ఇఓ వికె శీనా నాయక్ కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి గిరి ప్రదక్షణను ప్రారంభించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రపఠనాల నడుమ వివిధ రకాల వేషధారణలైన భూత, ప్రేత, పిశాచ, గజకర్ణ, గోకర్ణ వేషధారణలతో, కోలాటాలు, నృత్య ప్రదర్శనలు, భక్తి గీతాలాపనలతో శ్రీ స్వామి అమ్మవార్ల ప్రదక్షణకు ముందుగా సాగుతూ తిరిగి ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. దారిపొడవునా శ్రీ స్వామి అమ్మవార్ల రథానికి ముందు భక్తులు మోకరిల్లి అనుగ్రహం అందుకున్నారు.

– మే 14న హుండీ లెక్కింపు:
దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను ఈనెల 14న బుధవారం నాడు లెక్కిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

– దుర్గమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ:
దుర్గమ్మవారి దర్శనానికి వైశాఖ పౌర్ణమి సందర్భంగా సోమవారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన దర్శనమయ్యేలా ఇఓ వికె శీనా నాయక్ చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు వేసవి తాపం ఉపశమానికి మజ్జిగ పంపిణీ చేశారు. దుర్గమ్మవారిని నూతన వధూవరులు కూడా దర్శించుకోగా వారికి దర్శన ఏర్పాట్లను అధికారులు ఏర్పాటు చేశారు.

– దుర్గమ్మవారి సేవలో జాతీయ ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులు :
దుర్గమ్మవారిని సోమవారం జాతీయ ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులు వి రామచందర్ దర్శించుకున్నారు. ఆయనకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన ఇఓ దుర్గమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.


వి రామచందర్‌కు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

## భూభారతి పైలట్ మండలాల్లో స్పీడ్‌గా పరిష్కారమతున్న భూసమస్యలు

### జిల్లా కలెక్టర్ల సమావేశంలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త :భూ భారతి చట్టాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న మద్దూర్, లింగంపేట, వెంకటాపూర్, నెలకొండపల్లి 4మండలాల్లో వచ్చిన దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి త్వరగా భూ సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూభారతి అమలుపై సోమవారం ములుగు, కామారెడ్డి, ఖమ్మం, నారాయణపేట జిల్లాకలెక్టర్లతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం దార్శనికతతో తీసుకువచ్చిన భూ భారతి చట్టంతో భూ సమస్యల పరిష్కారానికి మార్గం సులు వైందన్నారు. రైతులు కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా రెవెన్యూకార్యాలయంలోనే వాళ్ళ సమస్యకు పరిష్కారంలభిస్తుందని ,ప్రజల వద్దకే అధికారులు వచ్చి పైసా ఖర్చు లేకుండా వారి భూ సమస్యలను పరిష్కారం చూపిస్తారన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను తిరస్కరించాల్సి వస్తే లోతుగా, క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని. దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. సోమవారం నుంచి తహశీల్ధార్లకు ఆన్‌లైన్ నమోదు సౌకర్యం కల్పించామని 4 జిల్లాల పరిధిలో వచ్చిన దరఖాస్తులు, ప్రధాన సమస్యలపై చర్చించి నెలాఖరు కల్లా ఒక పరిష్కారానికి రావాలన్నారు. దరఖాస్తుల పరిశీలనకు సంబంధించి ఇతర ప్రాంతాల నుంచి అవసరమైన నైపుణ్యవంతులైన సిబ్బందిని పంపించేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్‌కు మంత్రి సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలోకూడా ఎప్పటికప్పుడు అర్హుల జాబితాలను ఆయా జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులకు పంపించి ఆమోదం తీసుకోవాలని, వీలైనంత త్వరగా ఇండ్ల నిర్మాణం ప్రారంభించేలా చూడాలన్నారు. సమావేశంలో సిసిఎల్‌ఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ మకరంద్ నాలుగు జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

## ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

### త్రిసభ్య కమిటీకి రాష్ట్ర ఉద్యోగ సంఘాల జెఎసి చైర్మన్ విజ్ఞప్తి

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త :** ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఉద్యోగ సంఘాల చైర్మన్ లచ్చి రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం లచ్చి రెడ్డి ఆధ్వర్యంలో జేఏసీ ప్రతినిధులు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రీ మెన్ ఆఫీసర్స్ కమిటీ ముందు హాజరై ఉద్యోగులందరికీ నగదు రహిత వైద్యం అందించాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, నూతన పెన్షన్ విధానం(సిపిఎస్) రద్దు చేసి పాత పెన్షన్ (ఓపిఎస్) పునరిద్ధంచాలని, పొరుగు సేవల ఉద్యోగుల కొరకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, 317 జివో ద్వారా మరి కొన్ని రకాల బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు. ప్రభుత్వ ఖజానా పై తక్షణ భారం పడని 24 అంశాలను తొలుత పరిష్కరించి, ఆ తర్వాత మిగిలిన 14 పైగా ఆర్థిక భారం పడే అంశాలను దశల వారీగా పరిష్కరించాలన్నారు. వీటితో పాటు జేఏసీ భాగస్వామ్య సంఘాలఉద్యోగుల ప్రత్యేక సమస్యల పట్ల ఆయా ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. తమ విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించి కమిటీ ప్రభుత్వం తో చర్చించి పరిష్కారం కొరకు కృషి చేయగలమని హామీ ఇచ్చినట్లు లచ్చిరెడ్డి తెలిపారు.

## అమెరికా వద్దంటే యుద్ధం ఆపిన బిజెపి.. ఆ దేశాన్ని లెక్కచేయని వీరవనిత ఇందిర

### రేవంత్‌రెడ్డిని దూషించినా కాంగ్రెస్‌ని తిట్టినా ఒక్కటే

### హైబ్రిడ్ రాజకీయం కాదు.. నాది నాటు రాజకీయం

### పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి




**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త :**అమెరికా వద్దంటే బిజెపి ప్రభుత్వం ఎందుకు యుద్ధం ఆపింది, ఇందిరాగాంధీ అమెరికాను లెక్కచేయకుండా బంగ్లాదేశ్ ఆవిర్భావం వరకు పోరాడిన వీరవనిత ఇందరాగాంధీ అని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ 1971లో ఇందిరాగాంధీ భయంకర యుద్ధం చేయడమే కాకుండా ఆమె తీసుకొన్న నిర్ణయాలు యావత్ ప్రపంచం మెచ్చుకొందని గుర్తుచేశారు. ఇందిరాగాంధీని అటల్ బిహార్ వాజపాయి అపరకాళీగా వర్ణిస్తూ ప్రశంసించారని, అమెరికా ఒత్తిడిని కూడా డోంట్ కేర్ అని పాకిస్థాన్ పై యుద్ధం చేసిన వీరనారి ఇందిరా గాంధీ అని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ నాయనమ్మ చరిత్ర ఇది, బిజెపి వాళ్లకు గాంధీ కుటుంబం పై ఏడుపులు ఎక్కువ చేతలు తక్కువ అని అపహాస్యం చేశారు. రేవంత్‌రెడ్డిని దూషించినా కాంగ్రెస్‌ను దూషించినా ఒక్కటే రండ అంటే అర్థం ఏంటో ఈటెల చెప్పాలి దానికి సమాధానం నేను చెబుతా అని ఆగ్రహంవ్యక్తం చేశారు. బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ వలే హైబ్రిడ్ రాజకీయం కాదని, నాది నాటు రాజకీయం నేను అండర్‌ఏజ్‌లోనే 19 ఏళ్ళకు కౌన్సిలర్‌ను అయినాను అప్పుడు నువ్వు చదువుకొంటున్నావ్ అని ఆయన అన్నారు. నేను రౌడీలకు రౌడీని మంచోడికి మంచోడిని నువ్వు ఎక్కువ ఫీల్ కాకు అంత అవసరం లేదు అని ఈటెల పై విరుచుకు పడ్డారు. కెసిఆర్ పార్టీ పెట్టకపోతే ఈటల ఎవరు అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఎవరి వల్ల నువ్వు లీడర్ అఆయ్యావు నీకే అంత ఉంటే మాకు ఎంత ఉండాలి నువ్వు ఒక్క తిట్టుతిడితే మేం వంద తిడుతం కంట్రోల్‌లో ఉండి పరువు కాపాడుకో అని ఆయన హితవు చెప్పారు. బిఆర్ఎస్‌లో పెద్ద నసగాడు ఎందుకని కెసిఆర్ ఈటెలను బయటకు పంపారని ఆయన వివరించారు. ఈటెల రాజేందర్ నువ్వు బిజెపిలో నాకంటే చిన్న పిల్లవాడివి నా చరిత్ర తెలియాలంటే కిషన్‌రెడ్డిని వెంకయ్యనాయుడు, భగవంత్‌రెడ్డిని అడుగు అని అన్నారు. ఈటెల రాజేందర్ నాన్సెన్స్ కామెంట్లు చేయకు అని అన్నారు.

# బిఆర్ఎస్‌లో కవిత పరిస్థితి కరివేపాకు వంటిది

## ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** బిఆర్ఎస్‌లో కరివేపాకుల కవిత పరిస్థితి దాపురించిందని ప్రభుత్వ విప్ ఐలయ్య ఎద్దేవా చేశారు. సోమవారం సిఎల్‌పిలో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ హరీష్ రావు , కవిత ను బీఆర్ఎస్ నుంచి బయటకు పంపించాలని కేటీఆర్ చూస్తున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్ లో మూడు ముక్కలాట నడుస్తోంది. అందుకే కవితను బయటకు పంపించాలని చూస్తున్నారు. గతంలో విజయశాంతి, ఆలే నరేంద్ర పార్టీ నుంచి బయటకు పంపినట్లే కవిత కూడా బయటకు పంపుతారని చరిత్రను వివరించారు. పార్టీ నుంచి బయటకు పంపించే ప్రయత్నాలు జరుగు తున్నందువల్లనే రైతు బంధు, సామాజిక తెలంగాణ విషయాలను కవిత మాట్లాడుతోంది. తెలంగాణ ప్రజలు అరిగోస పడినప్పుడు మాట్లాడితే బాగుండేది పార్టీలో విలువగౌరవం లేకపోవడం వల్లనే కవిత మాట్లాడుతోందని ఆయన అభివర్ణించారు.
మీ నాన్న చేసిన అప్పులు, మీ అన్న చేసిన తప్పులను కవిత బయట పెట్టాలని డిమాండ్ చేశారు. కవిత నువ్వు లిక్కర్ స్కాం చేసి జైలుకు వెళ్ళావు కానీ తెలంగాణ ప్రజల కోసం జైలుకు పోలేదని గుర్తుచేశారు.
ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పదేళ్ల బిఆర్ఎస్ పాపాలపైన మాట్లాడినందుకు ధన్యవాదాలు భౌగోళిక తెలంగాణ మాత్రమే వచ్చింది సామాజిక తెలంగాణ రాలేదన్న కవిత మాట్లాడారని అన్నారు. బిఆర్ఎస్ మూడు ముక్కలు, నాలుగు చెక్కలు గా మారబోతుందని బీర్ల జోస్యం చెప్పారు. పదేళ్లలో కవిత పదవులు అనుభవించి వేల కోట్ల దండుకుని ఆ రోజు మాట్లాడకుండా, ఇప్పుడు మాట్లాడుతున్నందుకు సంతోషంగా ఉందని అన్నారు.

## సైన్యానికి దేశమంతా సంఘీభావం తెలిపినా

# కేంద్రం పోరాటం ఆపేయడం కలచివేసింది

### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్


మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**హుస్నాబాద్ రూరల్, మే 12, ప్రభాతవార్త :** ముక్తకంఠంతో సైన్యానికి దేశం మొత్తం సంఘీ భావం తెలిపిన కేంద్ర ప్రభుత్వం పోరాటం ఆపివేయడం కలిచివేసిందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ సైనికులు చేసిన పోరాటం ఎటు వంటి రూపం దాల్చాక ముందే ఒక్క ట్విట్టర్‌తో దేశ సార్వ భౌమత్వాన్ని ప్రశ్నార్థకంగా మిగిల్చారని తెలిపారు. మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీలా దాయాది దేశాన్ని కట్టడి చేయలేక పోయారని తెలిపారు. అనాడు చిన్నచిన్న ఘటనలు జరిగితే అప్పటి ప్రధాని మన్మోహన్‌ను ప్రశ్నించిన మోడీ ఇప్పుడు చేసిందేమిటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం చర్యలకు దేశ ప్రజలు, కాంగ్రెస్ అధిష్టానం అన్ని రకాలుగా మద్దతు ఇస్తామంటే ట్విట్టర్‌కు స్పందిచడం అందరిని కలిచివేసిందన్నారు. యుద్ధ విరమణ ఎందుకు జరిగిందో పార్లమెంట్ వేదికగా చర్చలు జరగాలని రాహుల్‌గాంధీ, మల్లికార్జున్‌ఖర్గే కోరుతున్నారని తెలిపారు. ట్విట్టర్‌కు ఎందుకు స్పందించారో ప్రధాని మోడీ వివరణ ఇవ్వాలన్నారు.
అసదుద్దీన్ ఓవైసీ ఎంఐఎం వారు కూడా పాకిస్తాన్‌పై చేసే దాడులకు మద్దతిస్తే విరమణ చేసే పరిస్థితి ఎందుకు వచ్చిందన్నారు. జరిగిన పరిణామాలు, ఎందుకు విరమణ చేయాల్సి వచ్చిందో జరిగిన సంఘటనపై ముఖ దర్శనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. చర్చలు లేకుండా ఒక ట్విట్టర్ ద్వారా యుద్ధ విరమణ ప్రకటిస్తే సైనికుల మనోధైర్యం దెబ్బతిందన్నారు. ఎందుకు పోరాటాన్ని ఆపారాని దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతుందని ఒక భారత దేశ పౌరుడిగా నేను ప్రధానినీ ప్రశ్నిస్తున్నన్నారు.
సమావేశంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, సీనియర్ నాయకులు చిత్తారి రవీందర్ తదితరులు ఉన్నారు.

# ట్రంప్ ప్రకటన భారత్‌కు తలవంపు

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్

**హైదరాబాద్ (చిక్కపల్లి), మే 12, ప్రభాతవార్త:** పాకిస్థాన్‌తో భారత్ చేస్తున్న ఉగ్రవాద నిర్మూలన యుద్ధం ట్రంప్ మధ్యవర్తిత్వంలో ముగిసినట్టుగా ట్రంప్ ప్రకటించుకోవటం భారతదేశానికి తలవంపుగా ఉన్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ అన్నారు. ట్రంప్ భారతదేశంతో మరీ ప్రత్యేకంగా మోడీతో స్నేహంగా ఉన్నట్లు నటిస్తూనే పాకిస్థాన్‌కు పూర్తి సహ కారం అందిస్తున్నట్టుగా ఈ యుద్ధం ద్వారానైనా మోడీ అర్థం చేసుకుంటే మంచిదన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ట్రంప్ ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని పాకిస్థాన్ ఆర్థిక ఇబ్బందులను తొలగించటానికి అమెరికా ప్రభావం కింద నడుస్తున్న ఐఎంఎఫ్ (ఇంటర్నేషనల్ మానిటర్ ఫండ్) సంస్థ నుండి లక్ష కోట్ల డాలర్లు అప్పు పాకిస్థాన్‌కు ఇప్పించటంలో ట్రంప్ కపటనాటకం భారత ప్రజలకు పూర్తిగా అర్థమయిందన్నారు. గతంలో అమెరికా ప్రోద్బలంతో మొదలైన రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ట్రంప్ ముగిస్తానని ప్రకటించి దాని కొరకు ఉక్రెయిన్‌పై అక్రమంగా ఒత్తిడి తీసుకొచ్చి ఉక్రెయిన్‌లో ఉన్న ఖనిజ సంపదను అమెరికాకు ధారాదత్తం చేయాలని డిమాండ్ చేయటం దుర్మార్గమన్నారు. తప్పని పరిస్థితుల్లో ఉక్రెయిన్ ప్రభుత్వం ఖనిజ సంపద అమెరికాకు ధారాదత్తం చేసే ఒప్పందంపై సంతకాలు చేయాల్సి వచ్చింది. అలాగే పాలస్తీనా దేశంపై ఇజ్రాయెల్‌ను అమెరికా ఉసిగొల్పి యుద్ధాన్ని ప్రోత్సహించింది. అలాంటి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయెల్, పాలస్తీనా దేశాల మధ్య యుద్ధాన్ని ఆపుతానని, దానికొరకు గాజా ప్రాంతాన్ని ట్రంప్‌కు ధారాదత్తం చేయాలని షరతు విధించటం ట్రంప్‌లో దాగి ఉన్న రాక్షసుడు బయటపడుతున్నాడు. ఉక్రెయిన్‌లోను, ఇజ్రాయెల్‌లోను యుద్ధానికి పూర్తి కారకులు అమెరికా ప్రభుత్వమేననేది జగమెరిగిన సత్యం. ప్రపంచంలో ఉగ్రవాదాన్ని పెంచి పోషించేది అమెరికా అనేది అందరికి తెలిసిన విషయమని ఆయన అన్నారు.

# కౌలు రైతుల హామీలు తక్షణమే అమలు చేయాలి

## సాగుదారు గుర్తింపు కార్డుల చట్టాన్ని అమలు చేయాలి

### రైతు స్వరాజ్య వేదిక డిమాండ్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), మే 12, ప్రభాతవార్త:** తెలంగాణలో లక్షలాది కౌలు రైతులు అనేక సంవత్సరాలుగా గుర్తింపు లేక, ఎటువంటి ప్రభుత్వ పథకాల నుండి లబ్ధి పొందక అప్పుల ఊబిలో పడి ఆత్మహత్య చేసుకుంటున్న వారిని ఆదుకోవాలని రైతు స్వరాజ్య వేదిక డిమాండ్ చేసింది. సోమవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వికారాబాద్ జిల్లా పెరిగి మండలానికి చెందిన కురువ మంజుల. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం జి చెందిన రమాకాంత్, కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలానికి చెందిన మాదాసు మాధవి, ఉమ్మడి ఖమ్మం జిల్లా గార్ల మండలానికి చెందింగ్ చాపల సుజాత, భూపాలపల్లి జయశంకర్ జిల్లాకు చెందింగ్ ముదస్తు సుమలత, ఆదిలాబాద్ జిల్లా తలమడుగు గ్రామానికి చెందిన జెడి శ్రీనివాస్ , ఎం.రమేష్ , యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం కు చెందిన రాందాస్, రైతు స్వరాజ్య వేదిక నుండి బి. కొండల్ కన్నెగంటి రవి, విస్సా కిరణ్ కుమార్, ఎస్. ఆశాలత తదితరులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుందని ఆశించిన కౌలు రైతులు నిరాశకు లోనవు తున్నారని, తక్షణం 2025 ఖరీఫ్ సీజన్ నుంచి కౌలు రైతులు గుర్తింపు కోసం చర్యలు తీసుకోవాలని రైతు స్వరాజ్య వేదిక డిమాండ్ చేశారు. రైతు స్వరాజ్య వేదిక, ఇతర రైతు సంఘాల ప్రతినిధులు కూడా సమావేశంలో పాల్గొని 2011 భూ అధీకృత సాగుదారుల చట్టం ప్రకారం కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కౌలు రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేసి, కౌలుదారులు సంబంధం లేదని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తనకు న్యాయం జరుగుతుందని నమ్మిన తమకు ఇప్పటి వరకు నిరాశే ఎదురయిందని కౌలు రైతులు బాధ వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా పరిగి మండలానికి చెందిన కురువ మంజుల. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం జి చెందిన రమాకాంత్, కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలానికి చెందిన మాదాసు మాధవి, ఉమ్మడి ఖమ్మం జిల్లా గార్ల మండలానికి చెందింగ్ చాపల సుజాత, భూపాలపల్లి జయశంకర్ జిల్లాకు చెందింగ్ ముదస్తు సుమలత, ఆదిలాబాద్ జిల్లా తలమడుగు గ్రామానికి చెందిన జెడి శ్రీనివాస్ , ఎం.రమేష్ , యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలానికి చెందిన రాందాస్, రైతు స్వరాజ్య వేదిక నుండి బి. కొండల్ కన్నెగంటి రవి, విస్సా కిరణ్‌కుమార్, ఎస్. ఆశాలత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు స్వరాజ్యవేదిక ప్రతినిధులు

## రాష్ట్ర ప్రజలకు బుద్ధపూర్ణిమ శుభాకాంక్షలు

### మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** గౌతమ బుద్ధుని జయంతి, బుద్ధ పూర్ణిమ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుభాకాంక్షలు తెలిపారు. మానవాళి ప్రగతి కోసం బౌద్ధం చూపిన బాట నేటికీ ఆచరణీయమన్నారు. తెలంగాణ సమాజపు మానవత్వ పరిమళాలు, శాంతి సహనంతో కూడిన అహింసాయుత జీవన విధానం.. వీటిలోని మూలాలు బౌద్ధ వారసత్వం నుంచే అలవడ్డాయని అన్నారు. అరుదైన బౌద్ధ చారిత్రక సంపద.. గోదావరి, కృష్ణా పరివాహక ప్రాంతాలను అల్లుకొని తెలంగాణలో బౌద్ధం పరిఢవిల్లిందనడానికి నిదర్శనంగా నిలుస్తున్నాయన్నారు. నాగార్జున సాగర్‌లో బుద్ధవనం అంతర్జాతీయ బౌద్ధ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని, రాష్ట్రంలోని బౌద్ధ వారసత్వ కేంద్రాలను పునరుజ్జీవింపచేసి ప్రపంచ బౌద్ధ పటంలో తెలంగాణకు సముచిత స్థానాన్ని కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

## బ్యాంకుల జోక్యం లేకుండా రాజీవ్ యువ వికాసం వర్తింపచేయాలి : ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** రాజీవ్ యువ వికాసం పథకం కింద ఇచ్చే సబ్సిడీ రుణాలను ప్రతి దరఖాస్తుదారునికి వర్తింపచేయాలని బిసి సంఘాలు డిమాండ్ చేశారు. సోమవారం విద్యానగర్‌లోని బిసిభవన్‌లో జరిగిన 13 బిసి సంఘాల సమావేశంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్య సభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకానికి నిర్దేశించిన 6వేల కోట్లు బడ్జెట్‌ను 15వేల కోట్లుకు పెంచాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకంలో 50వేలు, లక్ష, 2లక్షలు, 3లక్షలు, 4లక్షల చొప్పున సబ్సిడీ కింద రుణాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే దీనికి సంబంధించి రాష్ట్రంలో 16.26లక్షల దరఖాస్తులు వచ్చాయన్నారు. అయితే ఈ రాజీవ్ యువ వికాసం పథకానికి గందరగోళం పరిస్థితులు ఏర్పాటు అయినట్టు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఈ పథకానికి సిబిల్ స్కోర్ అంటూ ముడిపెట్టి యువతకు రుణాలు అందకుండా కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ఇప్పటికే సిబిల్ స్కోర్‌తో ముడిపెట్టి బీసీలకు చెందిన 5,35,666 దరఖాస్తులలో సగం దరఖాస్తులు తిరస్కరించినట్టుగా తెలుస్తుందన్నారు. సెలక్షన్ ప్రాసెస్‌లో బ్యాంకుల జోక్యం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు.

## చెన్నై విద్యార్థినిపై ఇద్దరు లైంగికదాడి

### ఆలస్యంగా వెలుగులోకి..

**హైదరాబాద్ (కొంపల్లి), మే 12, ప్రభాతవార్త:** చెన్నై విద్యార్థినిపై తోటి విద్యార్థి సహా అతడి మిత్రుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఈ నెల 4న సైబరాబాద్ కమిషనరేట్ బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన విద్యార్థిని చెన్నైలోని కళాశాలలో బయోమెడికల్ ఫైనల్ ఇయర్ చదువుతున్నది. అదే కళాశాలకు చెందిన అజయ్ బిటెక్ చదువుతున్నాడు. వీరిద్దరు స్నేహితులే. ఈ నెల 3న హైదరాబాదులో ఉన్నతవిద్య అడ్మిషన్‌ల కొరకు హైదరాబాదు వెళ్లి వద్దామంటూ తన స్నేహితురాలికి అజయ్ చెప్పాడు. అందుకు సమ్మతించిన ఆమె అజయ్‌తో కలిసి హైదరాబాదులోని నిజాంపేట రాజీవ్‌గృహకల్పకు వచ్చారు. అజయ్ మిత్రుడు హరి వీరికి తన ఫ్లాట్లో ఉండడానికి అంగీక రించాడు. దీంతో ఈనెల 4వ తేదీ రాత్రి ముగ్గురు కలిసి పార్టీ చేసుకున్నారు. అనంతరం మద్యం మత్తులో అజయ్ తన స్నేహితురాలిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం హరి కూడా ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమె తిరగబడి కేకలు వేయగా ఇరుగుపొరుగు గమనించి బాచుపల్లి పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేశారు. రాత్రి 1 గంటకు బాచుపల్లి పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి నిందితులు అజయ్, హరిలను అదుపులోకి తీసుకుని పోలీసు కస్టడీకి తరలించారు. బాధితురాలిని వైద్యపరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. నిందితులను సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు బాచుపల్లి పోలీసులు తెలిపారు. బాచుపల్లి పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బాచుపల్లి ఎస్‌హెచ్ఓ ఉపేందర్‌రావు తెలిపారు.

## కాలు నరం తెగిందని ఆస్పత్రికెళ్తే తలకు ఆపరేషన్!

### ఆస్పత్రిలో మృతి

**హైదరాబాద్ (దుండిగల్), మే 12, ప్రభాతవార్త:** కాలు నరం తెగిందంటూ ఆస్పత్రికి వెళ్తే... తలకు ఆపరేషన్ చేసి ప్రాణాలు తీసిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసు కుంది. వివరాల్లోకి వెళ్తే.. సూర్యాపేటలోని ఎరకారం గ్రామానికి చెందిన కుర్ర పరమేష్(26) హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో ఉంటున్నాడు. ఈ నెల 5న బహదూర్‌పల్లిలోని ఒక ఇంట్లో ప్యాకర్స్ అండ్ మూవర్స్‌లో ఇంటి సామాను తరలించేందుకు పనికివెళ్లాడు. సామను షిఫ్ట్ చేస్తున్న క్రమంలో రేకు లాంటి వస్తువు పర మేశ్ కాలికి తగిలి నరంతెగి రక్త స్రావం అయింది. దాంతో గమ నించిన తోటి పనివారు దగ్గర్లో ఉన్న బహదూర్‌పల్లిలోని ఎస్.వి.సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. రెండు రోజులు చికిత్స చేసిన ఆస్పత్రి యాజమాన్యం, రోగి కోలుకున్నాడని రేపు డిశ్చార్జ్ చేస్తామని చెప్పారు. నాలుగు రోజులు గడిచినా పరమేశ్‌ను డిశ్చార్జ్ చేయట్లేదని అడగ్గా.. పరమేష్ తలలో రక్తం గడ్డ కట్టిందని, ఆపరేషన్ చేశామని, అతని పరిస్థితి సీరియస్‌గా ఉందంటూ వైద్యులు చెప్పారు. తలకు ఆపరేషన్ ఎందుకు చేశారని నిలదీస్తే వైద్యులు సమాధానం దాటవేశారనీ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉం డగా రోగి పరమేశ్ బతికే ఛాన్స్ తక్కువని అక్కడి వైదులు చెప్పడంతో కుటుంబీకులు అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. తీరా గాంధీ ఆసుపత్రి వైద్యులు రోగి పరమేశ్ మరణించాడని చెప్పడంతో బాధిత కుటుంబ సభ్యులు న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా ప్యాకర్స్ అండ్ మూవర్స్ వాళ్లపై ఫిర్యాదు ఇవ్వండని అన్నారు. ఎస్.వి. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యంతో పరమేశ్ చనిపోతే, ఆస్పతిపై చర్యలు తీసుకోకుండా తమకు అన్యాయం చేస్తున్నారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


పరమేశ్ (ఫైల్)

13-5pg10m:13-5pg10m.qxd 5/13/2025 1:21 AM Page 1



ఆట

## జర్మనీ అంతర్జాతీయ ఫుట్‌బాల్ టోర్నీలో..
# విజేతగా ఇంగ్లండ్ స్టార్ హ్యారీ

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక జర్మనీ అంతర్జాతీయ ఫుట్‌బాల్ లీగ్ బుండెస్ లీగ్‌లో హ్యారీ కేన్ తన స్వప్నాన్ని సాకారం చేసుకున్నాడు. 2024-25 బుండెస్ లీగ్ సీజన్‌లో బాయెర్న్ మ్యూనిక్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టును విజేతగా నిలబెట్టాడు. ఏకంగా ఆరుసార్లు కెరీర్‌లో మేజర్ ట్రోఫీలు సాధించే అవకాశాన్ని తృటిలో కోల్పోయిన హ్యారీ ఏడో ప్రయ త్నంలో విజయవం తమయ్యాడు. ఈ క్రమంలో తన కెరీర్ లో లోటుగా ఉన్న మేజర్ ట్రోఫీని అందుకున్నాడు. బెర్లిన్‌లో సోమవారం బొరుసియా మొంచెన్‌గ్లాడ్‌బాచ్ క్లబ్‌తో జరిగిన 33వ లీగ్ మ్యాచ్‌లో మాన్యుయేల్ నెయుర్ సారథ్యంలోని బాయెర్న్ మ్యూనిక్ జట్టు 2-0 గోల్స్ తేడాతో గెలిచింది. తద్వారా ఈ సీజన్‌లో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే బాయెర్న్ మ్యూనిక్ జట్టు రికార్డ్ స్థాయిలో 33వ సారి బుండెస్ లీగ్ టైటిల్‌ను హస్తగతం చేసుకుంది. మ్యూనిక్ జట్టుకు హ్యారీ కేన్ 31వ నిముషంలో, మైకేల్ ఒలిస్ 90వ నిముషంలో ఒక్కో గోల్ అందించారు. ఈ సీజనులో 30 మ్యాచ్‌లు ఆడిన హ్యారీ కేన్ 25 గోల్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కాగా సీజన్‌లోని నామమాత్రపు చివరి మ్యాచ్ ఈ నెల 17న హాఫెన్‌హీమ్ జట్టుతో బాయెర్న్ మ్యూనిక్ టీం తలపడుతుంది.



ఇక మొత్తం 18 జట్లు ఇంటా, బయట పద్ధతిలో బుండెస్ లీగ్‌లో పోటీపడుతున్నాయి. ఒక్కో జట్టు 34 మ్యాచ్‌లు ఆడుతుంది. 33 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న బాయెర్న్ మ్యూనిక్‌జట్టు 24 విజయాలు సాధించింది. 7 మ్యాచ్‌లను డ్రా చేసుకుని, 2 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. 95గోల్స్ సాధించి, 32 గోల్స్‌ను సమర్పించుకుంది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 79 పాయింట్లతో టాప్ ర్యాంక్‌ను ఖరారు చేసుకుంది.



# టెస్టులకు గుడ్ బై
## రోహిత్ బాటలోనే విరాట్

**న్యూఢిల్లీ:** టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఇంగ్లండ్ టూర్‌కు ముందు టెస్టులకు కింగ్ కోహ్లీ రిటైర్మెంట్‌తో షాక్ ఇచ్చాడు. రోహిత్ శర్మ బాటలోనే టెస్టు క్రికెట్ నుంచి రిటైరవుతున్నట్లు ప్రకటించాడు స్టార్ క్రికెటర్ కోహ్లీ. ఈమేరకు ఇన్‌స్టాలో సోమవారం సుదీర్ఘ ఎమోషనల్ పోస్ట్ చేశాడు. టెస్ట్ క్రికెట్‌లో భారతదేశం తరపున అత్య ధిక పరుగులు చేసిన నాల్గవ ఆటగాడిగా కోహ్లీ రిటైర్ అయ్యాడు. సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్, సునీల్ గవాస్కర్ తర్వాత టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసింది కోహ్లీనే. ఇంగ్లాండ్ పర్యటనకు తనను ఎంపిక చేయొద్దని భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ)కి ముందుగానే సమాచారమిచ్చిన కోహ్లీ తాజాగా తన రిటైర్మెంట్‌ను అధికారికంగా ప్రకటించాడు. ఈ సమయంలో రిటైర్మెంట్ వద్దని బీసీసీఐ వారించినప్పటికీ కోహ్లీ వాటిని పట్టించుకోలేదు. 2011లో భారతదేశం వన్డే ప్రపంచ కప్ గెలిచిన జట్టులో భాగమైన రెండు నెలల తర్వాత, అతను జమైకాలో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో తన టెస్ట్ అరంగేట్రం చేశాడు. ఇక 2025 జనవరిలో సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన నూతన సంవత్సర టెస్ట్ సందర్భంగా అతను ఈ ఫార్మాట్‌లో చివరిసారిగా కనిపించాడు. 123 టెస్టుల్లో కోహ్లీ 46.85 సగటుతో 9,230 పరుగులు సాధించాడు. వాటిలో 30 సెంచరీలు, 31 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అతని అత్యధిక స్కోరు - 254 నాటౌట్. 2019లో దక్షిణాఫ్రికాతో పుణెలోని మహారాష్ట్ర క్రికెట్అసోసియేషన్ స్టేడియంలోజరిగిన మ్యాచ్‌లో ఈ అత్యుత్తమ ప్రదర్శనచేశాడు. 14 ఏళ్ల టెస్టు కెరీర్ తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని పేర్కొన్నాడు.

**ప్రేమతో సైనింగ్ ఆఫ్**

"టెస్ట్ క్రికెట్‌లో నేను తొలిసారి బ్యాగీ బ్లూ దుస్తులు ధరించి 14ఏళ్లు అయింది. నిజాయితీగా చెప్పాలంటే, ఈ ఫార్మాట్ నన్ను ఈ ప్రయాణంలో తీసుకెళ్తుందని నేను ఎప్పుడూ ఊహించలేదు. ఇది నన్ను పరీక్షించింది. తీర్చిదిద్దింది. జీవితాంతం నేను పాటించాల్సిన పాఠాలు నేర్పింది. తెల్లని దుస్తుల్లో ఆడటంలో ఏదో లోతైన విషయం దాగుంది. నిశ్శబ్దమైన ఆనందం, సుదీర్ఘమైన రోజులు, ఎవరికీ కన్పించని చిన్న చిన్న క్షణాలు నాతో ఎప్పటికీ ఉండిపోతాయి. అలాంటి ఈ ఫార్మాట్ నుంచి దూరం జరగడం అంత తేలిక అయిన విషయం కాదు. కానీ, నా నిర్ణయం సరైనదే అనిపిస్తోంది. ఈ ఫార్మాట్ కోసం నేను ఎంతో ఇచ్చాను. ఆశించిన దాని కంటే ఎక్కువే ఇది నాకు తిరిగిచ్చింది. మనసు నిండా సంతృప్తితో, కృతజ్ఞతాభావం తో ఈ ఫార్మాట్ నుంచి వైదొలుగుతున్నా. ఈ గేమ్ నేను మైదానంలో ఆడిన నా తోటి ప్లేయర్లు, ఈ ప్రయాణాన్ని నేను చూడటానికి కారణమైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ప్రేమతో ఇక

# ఐపిఎల్ హిస్టరీలో చెత్త రికార్డ్స్
## ముందే నిష్క్రమించిన నాలుగు జట్లు.. జాబితాలో చెన్నై, ముంబయి, బెంగళూరు



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. 12 మ్యాచ్‌ల్లో ఏకంగా 9 ఓడి, 3 మ్యాచ్‌ల్లో నెగ్గి 6 పాయింట్లతో పట్టికలో అట్టడుగున నిలిచింది. ఫలితంగా సీజన్ 18నుంచి నిష్క్రమించిన తొలి జట్టుగా చెత్త రికార్డ్ మూటుగట్టుకుంది. అయితే టోర్నీ నుంచి అందరికంటే ముందే నిష్క్రమించడం చెన్నైకు ఇది రెండోసారి. 2020లో తొలిసారి ఈ చెత్త రికార్డ్ నమోదు చేసింది. మరి ఇప్పటి వరకు ఐపీఎల్ హిస్టరీలో టోర్నీ నుంచి తొలుత పలు జట్టు నిష్క్రమించాయి. దక్కన్ ఛార్జర్స్ 2008 నుంచి 2012 సీజన్‌లలో ఐపీఎల్‌లో పాల్గొంది. ఇందులో 2008, 2011, 2012లో మొదటగానే ఎలిమినేట్ అయ్యింది. పుణె వారియర్స్ ఇండియా కేవలం మూడు సీజన్లలో 2011, 2012, 2013 లోనే ఆడింది. ప్రతి సీజన్‌లోనూ లీగ్ స్టేజీలోనే తొలి సారిగా వైదొలిగిన టీమ్‌ల జాబితాలో చోటు సంపాదించుకుంది. ఇక దిల్లీ క్యాపిటల్స్ ఒక్కసారి కూడా టైటిల్ గెలుచుకోలేదు. కానీ చరిత్రలో మూడుసార్లు తొలుత నిష్క్రమించిన జట్టుగా నిలిచింది. 2014లో 14 మ్యాచ్‌ల్లో కేవలం రెండే నెగ్గి లీగ్ టేబుల్‌లో అట్టడుగున నిలిచి అందరి కంటే మొదటగా నిష్క్రమించింది. 2018లో 5 మ్యాచ్‌ల్లో, 2023లో కూడా 5 మ్యాచ్ ల్లోనే గెలిచి ఇంటిబాట పట్టింది. పంజాబ్ కింగ్స్ ఇప్పటివరకూ రెండుసార్లు టోర్నీ నుంచి తొలుత నిష్క్రమించింది. 2010లో ఆడిన 14మ్యాచ్‌లలో నాలుగు మాత్రమే నెగ్గి పదింట్లో నిరాశపరిచింది. లీగ్ టేబుల్‌లో చివరి స్థానంలో నిలిచి టోర్నీ నుంచి ఇంటిబాట పట్టింది. 2015లో 14 మ్యాచ్‌లకు కేవలం 3 మ్యాచ్‌లలో విజయం సాధించి పాయింట్స్ టేబుల్‌లో చివరి స్థానంలో నిలిచి మొదటగా వైదొలిగింది. అలాగే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఒక్కసారి కూడా టైటిల్ గెలవకపోవడం గమనార్హం. ఆర్సీబీ ఇప్పటివరకూ రెండు సార్లు లీగ్ నుంచి తొలుత వైదొలిగింది. 2017లో ఆడిన 14 మ్యాచ్‌లలో 3 మాత్రమే నెగ్గి పదింట్లో ఓడి ఒక మ్యాచ్ టై చేసుకుని ఇంటిబాట పట్టింది. 2019లో 5 మ్యాచ్ లలో గెలిచి 8 మ్యాచ్ లలో నిరాశపరిచి మొదటగా నిష్క్రమించింది. ముంబయి ఇండియన్స్ ఇప్పటి వరకూ 2013, 2015, 2017, 2019, 2020లో టైటిల్ కైవసం చేసుకుంది. అయితే రెండుసార్లు లీగ్ నుంచి మొదటగా ఎలిమినేట్ అయ్యింది. 2022లో ఆడిన 14 మ్యాచ్‌లలో నాలుగింట్లో మాత్రమే విజయం సాధించింది. 2024 లోనూ నాలుగే నెగ్గి 10 మ్యాచ్‌లలో ఓటమి చెంది లీగ్ నుంచి తొలుతగా బయటకు వచ్చింది. కోల్‌కతా నైట్ రైడర్స్ 3సార్లు (2012, 2014, 2024) టైటిల్ గెలుచుకుంది. ఒక్కసారి మాత్రమే లీగ్‌లో తొలుతగా వైదొలిగింది. 2009లో టీమ్ ఆడిన 14 మ్యాచ్‌లలో కేవలం మూడునెగ్గి, 10 ఓటమిపాలై మొదటగా నిష్క్రమించింది. కాగా 2013లో సన్ రైజర్స్ హైదరాబాద్ ఐపీఎల్‌లో ఎంట్రీ ఇచ్చింది. వచ్చిన మూడేళ్లకే 2016లో ఛాంపియన్‌గా నిలిచింది. ఆ తర్వాత ఆశించిన స్థాయిలో రాణించలేదు. 2021 ఐపీఎల్ సీజన్‌లో 14మ్యాచ్‌లలో 3 మాత్రమే నెగ్గి 11 విఫలమైంది. దీంతో లీగ్ నుంచి నిష్క్రమించిన తొలి టీమ్‌గా నిలిచింది.



## మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో.. భారత్ షూటర్స్ చెనాయ్, సబీర కంచుమోత


**న్యూఢిల్లీ:** ఐఎస్ఎస్ఎఫ్ షాట్‌గన్ వరల్డ్ కప్-2025 లో భారత షూటర్లు సత్తా చాటారు. కినన్ చెనాయ్, సబీరా హ్యారిస్‌లు పతకంతో మెరిశారు. నికోసియా వేదికగా జరుగుతున్న మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో అదరగొట్టి కంచు మోతో మోగించారు. మూడో స్థానం కోసం తుర్కియే షూటర్లతో పోటీ పడిన ఈ జోడీ అద్భుత ప్రదర్శనతో మువ్వన్నెల జెండాను రెపరెపలాడించింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో 34వ స్థానంలో నిలిచిన భారత ద్వయం అసమాన ప్రతిభాపాటవాలతో పతకం కొల్లగొట్టడం విశేషం. ఐఎస్ఎస్ఎఫ్ షాట్‌గన్ వరల్డ్ కప్ మిక్స్‌డ్ పోటీల క్వాలిఫికేషన్‌లో నిరాశపరిచిన కినన్, సబీరలు ఆ తర్వాత పుంజుకున్నారు. టీమ్ విభాగంలో 142 పాయింట్లు సాధించి 34వ స్థానం సాధించారు. మూడో స్థానం కోసం తుర్కియే ద్వయం తొల్గా టన్సర్, పెలిన్ కయాపై 34-33తో విజయం సాధించారు. అగ్రస్థానంలో నిలిచిన చైనా బంగారు పతకం గెలవగా, పోలాండ్ షూటర్లు సిల్వర్ సాధించారు. భారత్‌కు చెందిన శార్దూల్ విమాన్, కీర్తి గుప్తాలు 137 పాయింట్లతో 17వ స్థానంలో నిలిచారు.

## ఆసియా బ్లిట్జ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో..
# భారత్‌కు తృటిలో చేజారిన పతకాలు

**న్యూఢిల్లీ:** ఆసియా వ్యక్తిగత చెస్ ఛాంపియన్‌షిప్ బ్లిట్జ్ విభాగంలో భారత్‌కు తృటిలో రెండు కాంస్య పతకాలు చేజారాయి. పురుషుల విభాగంలో తమిళనాడు గ్రాండ్ మాస్టర్ మరళీ కార్తికేయన్, మహిళల విభాగంలో ఒడిశా అమ్మాయి పద్మిని రౌత్ నాలుగో స్థానంలో నిలిచి కాంస్య పతకాలను కోల్పోయారు. నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత కార్తికేయన్ ఏడు పాయింట్లతో మరో ముగ్గురితో కలిసి ఉమ్మడిగా నాలుగో స్థానంలో నిలిచాడు. దాంతో మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించారు. రష్యాకు చెందిన రుడిక్ మకారియన్ మూడో స్థానంతో పాటు, కాంస్య పతకం ఖరారైంది. కార్తికేయన్‌కు నాలుగో స్థానం, భారత్‌కు చెందిన మరో ప్లేయర్ నీలాశ్ సాహాకు ఐదో స్థానం, చైనాకు చెందిన జియాంగ్ హోవోచెన్‌కు ఆరో స్థానం లభించాయి. పురుషుల విభాగంలో మొత్తం 111 మంది ప్లేయర్లు పోటీపడగా, 8 పాయింట్లతో రష్యాకు చెందిన 15 ఏళ్ల ఇవాన్ జెమ్లియాన్‌స్కి విజేతగా అవతరించాడు. ఇరాన్‌కు చెందిన 15 ఏళ్ల సినా మొవాహెద్ 7.5 పాయింట్లతో రజతాన్ని దక్కించుకున్నాడు. ఇక మహిళల విభాగంలో నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత పద్మిని రౌత్, చైనాకు చెందిన యుజిన్ సాంగ్, కజకిస్తాన్‌కు చెందిన ఎల్నాజ్ కలియాక్‌మెత్ ఏడు పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచారు. దాంతో మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా కాంస్య పతకాన్ని ఖరారు చేయగా, అది యుజిన్ సాంగ్‌కు లభించింది. పద్మిని నాలుగో స్థానంలో, ఎల్నాజ్ ఐదో స్థానంలో నిలిచారు. 7.5 పాయింట్లతో కజికిస్తాకు చెందిన అలువా నుర్మాన్, రష్యాకు చెందని వాలెంటీనా గునీనా సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంక్‌లను వర్గీకరించగా, నుర్మాన్‌కు స్వర్ణం, గునీనాకు రజతం లభించాయి.

# రూ.16 లక్షల కోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద

**ముంబై, మే 12:** భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ఖరారైన నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు దూసుకెళ్లాయి. అమెరికా చైనా వాణిజ్య చర్చలు, రష్యా ఉక్రెయిన్ మధ్య కాల్పుల విరమణ చర్చల్లో పురోగతి వంటి అంతర్జాతీయ అంశాలు ఇందుకు తోడయ్యాయి. దీంతో మన సూచీలు ఆకాశమే హద్దుగా పైకెగిశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 3 వేలకు పైగా పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 25 వేల మార్కుకు కాస్త దూరంలో నిలిచింది. 2024 డిసెంబర్ 16 తర్వాత బెంచ్ మార్క్ సూచీలు ఈ స్థాయిని అందుకోవడం ఇదే తొలిసారి. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.16 లక్షల కోట్ల మేర పెరిగి రూ.432 లక్షల కోట్లకు చేరింది. భారత్ పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగి ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు చల్లారిన వేళ సెన్సెక్స్ ఆరంభంలోనే 80,803.80 పాయింట్ల వద్ద భారీ లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం అదే దూకుడు కొనసాగించింది. ఇంట్రాడేలో 3 వేల పాయింట్లకు పైగా లాభంతో 82,495.97 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 2975.43 పాయింట్ల లాభంతో 82,429.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 916.70 పాయింట్ల లాభంతో 24,924.70 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువగా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, ఇండస్ ఇండ్ బ్యాంక్ మినహా మిగిలిన షేర్లు లాభాలు చవి చూశాయి. ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా స్టీల్, ఎటర్నల్, టెక్ మహీంద్రా షేర్లు ప్రధానంగా రాణించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 65 డాలర్లు, బంగారం ఔన్సు 3222 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి. అన్ని రంగాల షేర్లు లాభాల్లోనే ముగిశాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా 6.70 శాతం మేర లాభపడింది. గడిచిన ఐదేళ్లలో ఒక్కరోజులో ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్సులు కూడా 4 శాతం మేర రాణించాయి.



# అప్పుల్లో తమిళనాడు టాప్..

**న్యూఢిల్లీ, మే 12:** దేశంలోని రాష్ట్రాల్లో ఏటికేడు అప్పులు పెరుగుతున్నాయి. కొన్ని రాష్ట్రాలు భవిష్యత్తులో తమకు ఉపయోగపడేలా స్థానికంగా మౌలిక సదుపాయాల కల్పనకు అప్పులను వాడుతున్నాయి. ఇంకొన్ని రాష్ట్రాల్లో వేతనాలు, పెన్షన్లు, ప్రభుత్వ పథకాలు వంటి వాటికోసం వీటిని వినియోగిస్తున్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రుణాల్లో తమిళనాడు మొదటి స్థానంలో ఉందని ఇటీవల ఆర్‌బిఐ నివేదిక తెలిపింది. మధ్య మొత్తం తమిళనాడు రుణాలు రూ.1.01 లక్షల కోట్లకు చేరుకున్నాయి. బలమైన ఆర్థిక వ్యూహం, వృద్ధి ఆధారిత పెట్టుబడుల పట్ల నిబద్ధతను ప్రతిబింబిస్తూ తమిళనాడు రాష్ట్రం పెట్టుబడులను సమీకరిస్తుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. గత కొన్నేళ్లుగా అప్పుల్లో తమిళనాడు నిలకడగా ముందంజలో ఉంది. సంవత్సరాలవారీగా అప్పులు వివరాలు ఇలా ఉన్నాయి. 2021 ఆర్థిక సంవత్సరంలో రూ.87,977 కోట్లు, 2022, 2023 ఆర్థిక సంవత్సరాల్లో రూ.87వేల కోట్లు, 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.1.13 లక్షల కోట్లు, 2025 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 2024 నుంచి 2025 ఫిబ్రవరి వరకు రూ.1.01 లక్షల కోట్లు. తమిళనాడు తర్వాత 2025 ఆర్థిక సంవత్సరంలో మహారాష్ట్ర రూ.99వేల కోట్ల అప్పుతో రెండో స్థానంలో నిలిచింది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2026 ఆర్థిక సంవత్సరానికి మూలధన వ్యయంలో 22శాతం పెరుగుదలను రాష్ట్రం బడ్జెట్లో ప్రతిపాదించింది. ఇది మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆర్థికవృద్ధికి బలమైన నిబద్ధతను సూచిస్తుంది. 15వ ఆర్థిక సంఘం నిర్దేశించిన 28.7శాతంలోపు దాని డెట్-జీఎస్‌డిపి నిష్పత్తి 26.43శాతంగా ఉంది. ఇది ఆర్థిక స్థిరత్వం, సుస్థిరతను నిర్ధారిస్తుంది.






# భారత్ వృద్ధి 6.5శాతం: సిఐఐ

**న్యూఢిల్లీ, మే 12:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జిడిపి 6.5శాతం వృద్ధి చెందుతుందని పరిశ్రమల సంఘం సిఐఐ అంచనా వేసింది. భౌగోళిక రాజకీయ సమస్యల వల్ల కొంత ప్రభావం ఉన్నప్పటికీ, దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా వృద్ధిని కొనసాగగలదని కూడా సిఐఐ అధ్యక్షుడు సంజీవ్ పురి అన్నారు. పెరుగుతున్న వాణిజ్య సవాళ్ల నేపథ్యంలో జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవ డానికి దేశం కీలక వాణిజ్య భాగస్వాములతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలను కొనసాగించాలని ఆయన ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. ఇంధనం, రవాణా, లోహాలు, రసాయనాలు, ఆతిథ్యం వంటి రంగాలలో ప్రైవేట్ పెట్టుబడులు పెరుగుతున్నాయి. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చితులు పెట్టుబడులకు కొంత అవరోధం ఏర్పడవచ్చు. ఇది స్వల్పకాలమే, ఆ తర్వాత పరిస్థితులు సాధారణంగా మారతాయని సంజీవ్ పూరి వివరించారు. ఈ కారణంగా దేశ ఆర్థిక వృద్ధి అంచనాను 6.5శాతంగా భావిస్తున్నామని చెప్పారు. ఇటీవల ఆర్‌బిఐ వడ్డీరేట్లు తగ్గించింది. ద్రవ్యోల్బణం క్రమంగా దిగివస్తోంది. తాజా బడ్జెట్‌లో ప్రభుత్వం వ్యక్తిగత ఆదాయపు పన్ను పరిమితి పెంచింది. దీని వల్ల వినియోగం గణనీయంగా పెరుగుతుంది. దీనికి తోడు ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో పెట్టుబడులు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

# ప్రీమియం స్కూటర్లపై టివిఎస్ ఫోకస్!

**ముంబై, మే 12:** దేశీయ స్కూటర్ల మార్కెట్ అంతకంతకూ విస్తరిస్తోంది. ప్రస్తుతానికి 110, 125 సీసీ సెగ్మెంట్‌దే హవా. ఇందులో హోండా యాక్టివా, టీవీఎస్ జుపిటర్, సుజుకీ యాక్సెస్ వంటివి సత్తా చాటుతున్నాయి. తనదైన స్పోర్టీ లుక్‌తో టీవీఎస్‌కు చెందిన ఎన్‌టార్క్ కూడా కుర్రకారును ఆకట్టుకుంటోంది. మరోవైపు ప్రీమియం, పెర్ఫార్మెన్స్ స్కూటర్లకు ఆదరణ పెరుగుతోంది. దీనిపై టీవీఎస్ దృష్టి పెట్టింది. ఎన్‌టార్క్ రూపంలో 150 సీసీ సెగ్మెంట్‌లోకి ప్రవేశించాలని చూస్తోంది. ప్రస్తుతం ప్రీమియం స్కూటర్ల సెగ్మెంట్‌లో యమహా ఏరోక్స్ 155, హీరో మోటోకార్ప్ జూమ్ 160, ఆప్రిలియా 160 సీసీ మోడళ్లు అందుబాటులో ఉన్నాయి. యమహా మొత్తం సేల్స్‌లో ఏరోక్స్ 155వాటా 45 శాతం మాత్రమే. హీరో మోటోకార్ప్ మొత్తం అమ్మకాల్లో జూమ్ వాటా కూడా అంతంత మాత్రమే. కానీ, కుర్రకారు అంచనాలు పెరుగుతున్నాయి. తదనుగుణంగా ప్రీమియం స్కూటర్లకు డిమాండ్ పెరగబోతోందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో టీవీఎస్ కూడా ఎన్‌టార్క్‌ను 150 సీసీలో తీసుకొచ్చేందుకు సన్నద్ధం అవుతోంది.



# 32 విమానాశ్రయాలు ఓపెన్

**న్యూఢిల్లీ, మే 12:** భారత్‌పాక్ నడుమ ఉద్రిక్తతల నేపథ్యంలో ఉత్తర, పశ్చిమ భారత్‌లోని 32 విమానాశ్రయాలను మే 15 వరకు మూసివేస్తున్నట్లు కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తొలగిపోవడంతో విమానాశ్రయాలను తిరిగి ప్రారంభిస్తున్నట్లు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ప్రకటించింది. తొలుత ఈనెల 15 వరకు వాటిని మూసి వేయాలని భావించినప్పటికీ పరిస్థితులు మెరుగుపడటంతో వాటిని తెరిచినట్లు అధికారులు వెల్లడించారు. పౌర విమానయాన కార్యకలాపాలు వెంటనే అందుబాటులోకి వస్తాయని.. ఈ విషయాన్ని దృష్టిలోఉంచుకొని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. విమానాల సేవలు, వివరాలకు సంబంధించిన ఇతర విషయాలు తెలుసుకోవడానికి ప్రయాణికులు ఎయిర్‌లైన్స్ వెబ్‌సైట్‌లను పర్యవేక్షించాలని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా సూచించింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీ కారంగా భారత్ పాక్‌లోని వివిధ ఉగ్రస్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడులు చేయడంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థి తులు నెలకొన్నాయి. ఈనేపథ్యంలో సరి హద్దులకు దగ్గరగా ఉన్న దాడులు జరిగేందుకు అవకాశమున్న చండీగఢ్, శ్రీనగర్, అమృత్‌సర్, లూథియానా, భుంటార్, కిషన్‌గఢ్, పటియాలా, శిమ్లా, ధర్మశాల, భఠిండా, జైసల్మేర్, జోధ్‌పూర్, లేహ్, బికనేర్, పఠాన్‌కోట్, జమ్మూ, జామ్‌నగర్, రాజ్‌కోట్, భుజ్ తదితర విమానాశ్రయాలను మూసివేస్తున్నట్లు పౌరవిమానయాన శాఖ ప్రకటించింది. ఇటీవల ఇరుదేశాలు కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవడంతో సరిహద్దు ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనడంతో ఈ సేవలను తిరిగి పునరుద్ధరించింది.



# వాణిజ్యం

## టారిఫ్ వార్‌కు విరామం..

**వాషింగ్టన్, మే 12:** పరస్పర ప్రతీకార సుంకాల ప్రకటనలతో ప్రపంచ దేశాలకు, స్టాక్ మార్కెట్లకు కంటిమీద కునుకులేకుండా చేసిన అమెరికా, చైనా ఓ అవగాహనకు వచ్చాయి. పోటాపోటీగా విధించుకున్న టారిఫ్‌లను తాత్కాలికంగా తగ్గించేందుకు నిర్ణయించాయి. ఇరుదేశాలు 90 రోజుల పాటు తమ టారిఫ్‌లను 115 శాతం మేర తగ్గించుకుంటాయని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ ప్రకటించారు. ఇరు దేశాల మధ్య స్విట్జర్లాండ్ వేదికగా జరిగిన వాణిజ్య చర్చల్లో భాగంగా ఈ నిర్ణయం వెలువడింది. వివిధ భాగస్వామ్య దేశాలపై ప్రతీకార సుంకాల్లో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాపై భారీగా టారిఫ్‌లు విధించారు. ప్రతిగా ఆ దేశం కూడా టారిఫ్ వార్‌కు దిగింది. దీంతో ట్రంప్ చైనా ఉత్పత్తులపై అమెరికా తన టారిఫ్‌లను 145 శాతానికి పెంచగా.. చైనా కూడా అమెరికా దిగుమతులపై 125 శాతం సుంకాలు విధించింది. దీంతో ప్రపంచ దేశాల స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. ఆర్థిక మాంద్యం భయాలు తలెత్తాయి. ఈ క్రమంలో అమెరికా, చైనా ప్రతినిధులు స్విట్జర్లాండ్ వేదికగా జరిపిన వాణిజ్య చర్చల్లో టారిఫ్‌లను తాత్కాలికంగా వాయిదా వేసేందుకు నిర్ణయించారు. ఇందులోభాగంగా అమెరికా దిగుమతులపై చైనా తన సుంకాలను 115 శాతం అంటే 125 శాతం నుంచి 10 శాతానికి తగ్గించనుంది. మరోవైపు చైనా దిగుమతులపై అమెరికా తన సుంకాలను 145 శాతం నుంచి 30 శాతానికి తగ్గిస్తుంది. 90 రోజుల పాటు ఈ టారిఫ్‌లు అమల్లో ఉండేలా ఇరుదేశాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole › 523001, ph: 2312451, Fax: 08592›236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12›14 Air Surcharge:Delhi:40 Ps